పద్నాలుగు వందల
నలభై రెండు నిమిషాలు
రూ॥100/- పేజీలు:96
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిలిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 08, సంచిక: 49 | శుక్రవారం | 17-01-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00

విద్యార్థి రాజకీయాల 'పునరుజ్జీవం' సాధ్యమేనా?

మనువాదుల మనోభావాలకు చెంపపెట్టు!

అంతరిక్షంలో విజయవంతంగా ఇస్రో 'స్పేస్ డాకింగ్'

లోపలి పేజీల్లో

ఎలక్ట్రిక్ మోడల్‌లోకి ఆర్‌టిసి బస్సులు

మార్చేందుకు సహకరించండి
అభివృద్ధి పనులకు అటవీశాఖ అనుమతులివ్వండి
కేంద్ర మంత్రులు కుమారస్వామి, భూపేందర్ యాదవ్‌లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వినతి

ప్రజాపక్షం / హైదరాబాద్

హైదరాబాద్ నగరంలోని వంద శాతం బస్సులను ఎలక్ట్రిక్ (ఈ మోడల్) మోడల్‌లోకి మార్చేందుకు సహకరించాలని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రితో ఆయన కార్యాలయంలో సిఎం గురువారం సాయంత్రం భేటీ అయ్యారు. పిఎం ఈ-డ్రైవ్ పథకం కింద జిసిసి పద్ధతిలో బస్సులు కేటాయించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు కేంద్ర మంత్రికి సిఎం రేవంత్‌రెడ్డి తెలియజేశారు. ప్రస్తుతం ఉన్న డీజిల్ బస్సులకు ఎలక్ట్రిక్ కిట్ అమర్చి రిట్రో ఫిట్‌మెంట్ పద్ధతిలో ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చేందుకు అవకాశం ఉన్న విషయాన్ని కేంద్ర మంత్రి కుమారస్వామి దృష్టికి సిఎం రేవంత్‌రెడ్డి తీసుకెళ్లారు. హైదరాబాద్‌కు కేంద్ర ప్రభుత్వం కేటాయించే 2,800 బస్సులను జిసిసితో పాటు రిట్రో ఫిట్‌మెంట్ మోడల్ కింద కేటాయించాలని కేంద్ర మంత్రికి సిఎం విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, నల్గొండ,

తరువాయి 2లో

బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ కీలక నిర్ణయం

తొలుత 'అదనపు టరమ్స్ ఆఫ్ రెఫరెన్స్'పై విచారణ

న్యూఢిల్లీ : కృష్ణా జలాల పంపిణీ వ్యవహారంలో బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నీటి విభజన వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం సమర్పించిన 'అదనపు టరమ్స్ ఆఫ్ రెఫరెన్స్'పై మొదట విచారణ చేపట్టాలని ట్రైబ్యునల్ నిర్ణయం తీసుకుంది. పునర్విభజన చట్టంలోని మూడో సెక్షన్ ప్రకారం రెండు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీ అంశంపై మొదట వాదనలు వింటామని తెలిపింది. ముందుగా 811 టిఎంసిల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వాటాను ముందే తేల్చాల్సిన అవసరం ఉందని ట్రైబ్యునల్ పేర్కొంది. ఇందులో భాగంగా ఫిబ్రవరి 19 నుంచి 21 వరకు ఇరు రాష్ట్రాల వాదనలు వింటామని తెలిపింది. ఆ తర్వాతే 89వ సెక్షన్ ప్రకారం ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు తేలుస్తామని బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ స్పష్టం చేసింది. బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్‌ను తెలంగాణ ప్రభుత్వం స్వాగతిస్తోందని రాష్ట్ర నీటిపారుదలశాఖమంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. తెలంగాణకు సరైన న్యాయం జరిగేందుకు ఈ తీర్పు దోహదపడుతుందని తెలిపారు. బచావత్ ట్రైబ్యునల్ ఎన్ బ్లాక్‌గా కేటాయించిన 811 టిఎంసిల కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయమైన వాటా దక్కనుందన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్ 12 మంది మావోయిస్టుల హతం

ప్రజాపక్షం/భద్రాచలం

ఛత్తీస్‌గఢ్‌లో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్లో 12 మంది మావోయిస్టులు మృతి చెందారు. బీజాపూర్ జిల్లా పూజారకాంకేర్–మారేడుబాక తెలంగాణ, సరిహద్దు అటవీ ప్రాంతంలో ఊసూరు పిఎస్ పరిధిలో ఈ ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. అటవీ ప్రాంతంలో భద్రత బలగాలు గత నాలుగు రోజులుగా పెద్ద ఎత్తున కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. మావోయిస్టుల సంచారం ఉందనే సమాచారం మేరకు సుక్మా, బీజాపూర్, దంతెవాడ జిల్లాలో సిఆర్‌పిఎఫ్, డిఆర్‌జి,కోబ్రా,ఎస్‌టిఎఫ్ సంయుక్త బలగాలతో ఆ ప్రాంతంలో కూంబింగ్ విస్తృతం చేశారు. మావోయిస్టులు తారసపడటంతో ఇరు వర్గాల మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకున్నారు. సుమారు రెండు గంటలకు పైగా జరిగిన కాల్పుల్లో 12 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలంలో మృతదేహాలతో పాటు ఒక ఎస్ఎల్ఆర్ ఇతర ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాల్పుల అనంతరం అడవుల్లోనికి జారుకున్న మావోయిస్టుల కోసం పెద్ద ఎత్తున గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో ఎన్‌కౌంటర్ చోటు చేసుకోవడంతో భద్రాచలం రెవెన్యూ డివిజన్ పరిధిలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. వచ్చిపోయే వారిని ఆరాతీస్తున్నారు. అటవీ గ్రామాల్లో నుండి ప్రధాన రహదార్లకు చేరుకునే రోడ్లను పోలీసులు తన ఆధీనంలోనికి తీసుకున్నారు. గోదావరి పరీవాహకంలో గల ఫెర్రీ పాయింట్ల నిఘా పెంచారు. మావోయిస్టులు ఛత్తీస్‌గడ్ అడవుల్లో నుండి

తరువాయి 2లో

ఆర్‌బిఐ నిబంధనలు పాటించరా?

- ఫార్ములా ఈ–కార్ రేస్ కేసులో కెటిఆర్‌ను ప్రశ్నించిన ఇడి
- ఫెమా, మనీలాండరింగ్ చట్టాల ఉల్లంఘనపైనే ప్రశ్నల వర్షం
- ఏడు గంటల పాటు మాజీమంత్రిని విచారించిన దర్యాప్తు సంస్థ

ప్రజాపక్షం/హైదరాబాద్

ఫార్ములా ఈ–కార్ రేస్‌లో విదేశీ సంస్థకు నిధులు బదిలీ చేసే సమయంలో ఆర్‌బిఐ నిబంధనలు ఎందుకు పాటించలేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్‌ను డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) అధికారులు ప్రశ్నించారు. సంచలనం సృష్టించిన ఫార్ములా ఈ–కార్ రేస్ కేసులో (ఇడి) అధికారులు కెటిఆర్‌ను ఏడు గంటల పాటు ప్రశ్నించారు. ఫార్ములా ఇకార్ రేస్ నిర్వాహకులైన లండన్‌కు చెందిన ఫార్ములా ఇఆపరేషన్స్ లిమిటెడ్ (ఎఫ్ఇఒ) సంస్థకు ఆర్‌బిఐకి సమాచారం లేకుండా నారాయణగూడలోని ఇండియన్ ఓవర్‌సిస్ బ్యాంక్‌లో ఉన్న హెచ్ఎండిఎ ఖాతా నుంచి రూ. 45.71 కోట్లు ఎందుకు బదిలీ చేశారనే విషయంపై పలు మార్లు కెటిఆర్‌ను ఇడి అధికారులు అడిగి తెలుసుకున్నారు. కెటిఆర్ ఆదేశాల మేరకే తాము ఎఫ్ఇఒకు హెచ్ఎండిఎ నుంచి నిధులు బదిలీ చేశామని అప్పటి మున్సిపల్ శాఖ కార్యదర్శిగా ఉన్న ఐఎఎస్ అధికారి అరవింద్‌కుమార్ ఇడికి ఇచ్చిన వాంగ్మూలాన్ని కూడా కెటిఆర్‌తో అడిగి తెలుసుకున్నారు. అరవింద్‌కుమార్‌తో జరిపిన వాట్సాప్ చాటింగ్‌పై కూడా ఇడి అధికారులు కూపి లాగారు. విదేశీ సంస్థకు రూ.45.71 కోట్లు బదిలీ చేసినందుకు హెచ్ఎండిఎకు ఇన్‌కమ్‌ట్యాక్స్

తరువాయి 2లో

8వ వేతన సంఘం కేంద్రం ఆమోదం

1.15 కోట్లమంది కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్లకు లబ్ధి

న్యూఢిల్లీ : ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎనిమిదవ వేతన సంఘాన్ని ఏర్పాటు చేసేందుకు కేంద్రం ఆమోద ముద్ర వేసింది. 50 లక్షలమంది కేంద్ర ఉద్యోగుల వేతనాలు, మరో 65 లక్షలమంది పెన్షనర్ల అలవెన్సులను సవరించేందుకు ఎనిమిదవ వేతన సంఘాన్ని ఏర్పాటు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ గురువారంనాడు ఈ ఫైలును ఆమోదించారు. ఒక్క ఢిల్లీ మహానగరంలోనే నాలుగు లక్షలమంది ప్రభుత్వ ఉద్యోగులు ఈ వేతన సంఘం సిఫార్సులవల లబ్ధి పొందుతారు. వీరిలో

తరువాయి 2లో

'హిండెన్‌బర్గ్ రీసెర్చ్' మూసివేత

HINDENBURG RESEARCH

వెబ్‌సైట్ ద్వారా ప్రకటించిన వ్యవస్థాపకుడు నేట్ ఆండర్సన్

మూసివేతకు ప్రత్యేక కారణాలు లేవని ప్రకటన

ఆదానీ గ్రూప్‌పై నివేదికతో భారతదేశంలో ప్రకంపనలు

వాషింగ్టన్ : బడా కార్పొరేట్ సంస్థ ఆదానీ గ్రూప్ పెద్ద ఎత్తున ఆర్థిక అవతవకలను ఆధారాలతో సహా బైట్టబయలు చేసి భారతదేశంలో ప్రకంపనలు సృష్టించిన హిండెన్‌బర్గ్ రీసెర్చ్‌ను మూసివేస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు నేట్ ఆండర్సన్‌ల గురువారం నాడు ప్రకటించారు. ఈ సంస్థ తన జీవితంలో ఓ అధ్యాయం మాత్ర మేనని, అదే జీవితాశయం కాదని అన్నారు. సవాళ్లు, ఒత్తిళ్లు ఎదురైనప్పటికీ ఉత్సాహంగా పనిచేశామని, ఇదంతా తనకో ప్రేమ కథలా అనిపిస్తోందని పేర్కొన్నారు.కనెక్టికట్ యూనివర్సిటీ నుంచి ఇంటర్నేషనల్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఆండర్సన్ 2017లో 11 మంది ఉద్యోగులతో 'ఫోరెన్సిక్ ఫైనాన్షియల్ రీసెర్చ్' సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్‌ను స్థాపించారు. ప్రపంచ వ్యాప్తంగా తప్పులు, మోసాలు చేసే లేదా మానవ సంక్షోభాలను సృష్టించే కంపెనీల బండారాన్ని బైటపెట్టడంలో ఈ కంపెనీ పని చేసేది. ఫలితంగా ఆ కంపెనీలు మార్కెట్‌లో కుప్పకూలేపోయేవి. 1937లో నిప్పు అంటుకొని కూలిపోయిన జర్మనీ ఎయిర్‌షిప్ 'హిండెన్‌బర్గ్' పేరును తన సంస్థకు నాథన్ (నేట్) ఆండర్సన్ నామకరణం చేశాడు. 2020లో ఎలక్ట్రిక్ ట్రక్‌లు తయారు చేసే నికోలా సంస్థ గురించి అక్రమాలు బైటపెట్టగా, రెండేళ్ళలో ఆ సంస్థ వ్యవస్థాపకుడు ట్రెవర్ మిల్టన్‌ను అమెరికన్ జ్యూరీ దోషిగా నిర్ధారించింది. అలాగే లార్డ్స్ టౌన్ కార్ప్(యుఎస్), కంది(చైనా), క్లోవర్ హెల్త్ (అమెరికా), టెక్నోగ్లాస్ (కొలంబియా) తదితర కంపెనీలను లక్ష్యంగా చేసుకొని పని చేసింది.

ఆదానీ షేర్‌లను కుప్పకూల్చిన నివేదిక : ఆదానీ గ్రూప్ సహా పలు కంపెనీల లావాదేవీల్లో అవతవకలను, అక్రమాలను, రహస్య కార్యకలాపాలను బట్టబయలు చేశారు. 2023 జనవరిలో హిండెన్‌బర్గ్ ఆదానీ గ్రూప్‌పై వెల్లడించిన సంచలన రిపోర్ట్‌తో హిండన్‌బర్గ్ సంస్థ పేరు భారతదేశంలో మారుమ్రోగింది.''కార్పొరేట్ చరిత్రలో అతి పెద్ద మోసం'' అని

తరువాయి 2లో

మోదానీకి క్లీన్ చిట్ ఇచ్చినట్లు కాదు : కాంగ్రెస్

న్యూఢిల్లీ : హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థను మూసివేడమంటే 'మోదానీ' (మోదీ–ఆదానీ)లకు 'క్లీన్ చిట్' ఇచ్చినట్లు కాదని కాంగ్రెస్ పేర్కొంది. దీనిపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జెపిసి) వేయకుంటే ఇప్పటికే రాజీ పడిన భారత ప్రభుత్వ వ్యవస్థలు బలవంతులను రక్షించడాన్ని కొనసాగిస్తాయని విమర్శించింది. 2023 జనవరిలో హిండెన్‌బర్గ్ నివేదిక ఆదానీ గ్రూప్‌పై విచారణకు సుప్రీం కోర్టు స్వయంగా నిపుణుల కమిటీని నియమించాల్సి వచ్చిందని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ గుర్తు చేశారు. ఆదానీ ప్రధాన రక్షకుడు మరెవరో కాదని, దేశ ప్రస్తుత ప్రధాని అని పేర్కొనారు. హిండెన్‌బర్గ్ నివేదిక మోదానీ స్కామ్‌లో సెక్యూరిటీస్ చట్టాల ఉల్లంఘనల్లో ఒక భాగాన్ని మాత్రమే వెల్లడించిందని అన్నారు. ఆదానీ మెగాస్కామ్‌పై ప్రధాని మోదీకి కాంగ్రెస్ సంధించిన 100 ప్రశ్నల్లో హిండెన్ బర్గ్ నివేదిక

తరువాయి 2లో

ఆదివారం నుంచి గాజాలో కాల్పుల విరమణ అమలు

ఆరు వారాల్లో మూడు దశలుగా ఒప్పంద ప్రక్రియ

బైడెన్,ట్రంప్ సహా ప్రపంచ నేతల హర్షాతిరేకాలు

పాలస్తీనియన్ల ఆనందోత్సవాలు

దోహా : ఇజ్రాయెల్ – హమాస్ మధ్య 15 నెలలుగా కొనసాగిన ఎడతెగని యుద్ధం ముగిసింది. యుద్ధాన్ని ఆపి, బందీలను విడుదల చేసేందుకు ఇజ్రాయెల్–హమాస్ మధ్య ఒక అంగీకారం కుదిరింది. దోహాలో మధ్యవర్తులద్వారా జరిగిన చర్చలు ఫలించడంతో నిర్ణీత ప్రకారం ఎల్లుండి ఆదివారం నుండీ గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి రావాల్సి ఉంది. మూడు దశల ఈ ప్రక్రియలో రెండు, మూడు దశల ఒప్పందం ప్రక్రియ ఫిబ్రవరి 3 నుండి (16 రోజుల తర్వాత) ప్రారంభం అవుతుంది. మూడో విడత ప్రక్రియలో గాజా పునర్నిర్మాణం ప్రారంభం అవుతుంది. ఈ పునర్నిర్మాణ ప్రక్రియ సంవత్సరాల పాటు కొనసాగుతుంది. ఈ ఒప్పందం హడావుడిమధ్య, మధ్యవర్తుల మాటలకు తలవొగ్గి కాల్పుల విరమణకు కట్టుబడి ఉన్నామని హమాస్ ప్రతినిధులు చెబుతుండగా, ''హమాస్ ఒప్పందం నుండి వెనకడుగు వేస్తోంది'' అని

తరువాయి 2లో

స్వాగతించిన భారత్

ఇజ్రాయెల్–హమాస్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని భారత్ స్వాగతించింది. దీనికి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. చర్చల ద్వారా ఒప్పందం కుదరడంపట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఎలాంటి సమస్యలకైనా చర్చలతోనే పరిష్కారాలు లభిస్తాయని భారత ప్రభుత్వం పదే పదే అంతర్జాతీయ వేదికలపై చెబుతున్న విషయాన్ని భారత విదేశాంగమంత్రిత్వశాఖ గురువారం పునరుద్ఘాటించింది. ఈ ఒప్పందంతో గాజాలోకి సురక్షితంగా ఇకపై మానవతా సహాయం సరఫరాలను పెంచడానికి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేసింది. బందీల విడుదలకు హమాస్ అంగీకరించడం, సైన్యాన్ని గాజా నుండి వెనక్కు తరలించేందుకు ఇజ్రాయెల్ అంగీకరించడం పశ్చిమ ఆసియాలో శుభ పరిణామమని పేర్కొంది.

దీర్ఘకాలిక ఒప్పందం కుదిరేదాకా.. : బైడెన్

ఆరు వారాలపాటు మూడు దశల్లో ఇజ్రాయెల్ –హమాస్ మధ్య ఒప్పందం ప్రక్రియ అమలును పూర్తిచేస్తారని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించారు. ఇజ్రాయెల్–హమాస్ మధ్య దీర్ఘకాలిక ఒప్పందం జరిగేందుకు చర్చలు కొనసాగినంతకాలం గాజాలో కాల్పుల విరమణ ఒడంబడిక కొనసాగుతుందని బైడెన్ ప్రకటించారు. బుధవారంనాడు ఈ మేరకు ఒప్పందం కుదిరిందని ఆయన చెప్పారు. ప్రాథమికంగా 42 రోజులపాటు గాజాల కాల్పుల

తరువాయి 2లో



సైఫ్ అలీఖాన్‌పై కత్తితో దాడి

ముంబయి : బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీ ఖాన్‌ను గురువారం తెల్లవారుజామున బాంద్రాలో ఉన్న తన 12వ అంతస్తు అపార్ట్‌మెంట్‌లో ఓ అగంతకుడు కత్తితో పొడిచాడు. అయితే 54 ఏళ్ల ఖాన్ అత్యవసర శస్త్రచికిత్స తర్వాత ప్రమాదం నుండి బయటపడ్డారని లీలావతి ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ఈ ఘటన తెల్లవారుజామున 2.30 గంటల ప్రాంతంలో సద్గురు శరణ్ భవనంలోని తన అపార్ట్‌మెంట్‌లో జరిగింది. అనంతరం ఆయనను ఆసుపత్రికి తరలించారు. హత్య లేదా తీవ్రంగా గాయపర్చడానికి యత్నంతో కూడిన సాయు ధ దోపిడీ కేసుగా పోలీసులు నమోదు చేశారు. దాడి చేసిన వ్యక్తి భవనం మెట్ల ద్వారా పారిపోయాడు. అయితే ఈ కేసులో ఇప్పటి వరకు ఎవరినీ అరెస్టు చేయలేదని, ఆరో అంతస్తులో నిందితుడి సిసిటివి దృశ్యాలను గుర్తించామని ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. దుండగుడితో జరిగిన

తరువాయి 12లో

సంక్షేమ పథకాల సందడి

లబ్ధిదారుల ఎంపికలో అధికారులు నిమగ్నం

26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,ఇందిరమ్మ ఇళ్లు

కొత్త రేషన్ కార్డుల మంజూరుకూ సన్నాహాలు

ఈ నెల 21నుంచి గ్రామ, పట్టణ గ్రామసభలు

ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి

గ్రామాలలో సంక్షేమ కార్యక్రమాల సందడి నెలకొన్నది. రాష్ట్ర ప్రభుత్వం కీలకమైన పలు పథకాలను అమలు చేసేందుకు సిద్ధమవుతున్నది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా సందడి వాతావరణం నెలకొన్నది. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26వ తేదీ నుంచి అమలు చేయనున్న నాలుగు ప్రతిష్ఠాత్మక పథకాల లబ్ధిదారుల ఎంపికలలో ఆయా జిల్లాల అధికార యంత్రాంగాలు నిమగ్నమయ్యాయి. నియోజకవర్గాల వారీగా జిల్లా అధికారులు,నియోజకవర్గ సిబ్బందితో సమావేశాలు నిర్వహించి ఆయా పథకాల లబ్ధిదారులను ఎంపికలో పారదర్శకంగా వ్యవహరించాలని సూచిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలతో పాటు మరిన్ని పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ మేరకు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఒక్కొక్కటిగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నది. ఈనెల 26వ తేదీ నుంచి ఇందిరమ్మ ఇళ్ల పథకం, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతో పాటు కొత్త రేషన్ కార్డులను మంజూరుచేయనున్నారు. ఆయా పథకాల కోసం ప్రభుత్వం డిసెంబరు 26 నుంచి జనవరి 8వ తేదీ వరకు గ్రామ, పట్టణ సభలను

తరువాయి 12లో

21 నుంచి రైతులు మళ్లీ ఢిల్లీబాట

డల్లేవాల్‌కు సంఘీభావంగా 111 మంది రైతుల ఆమరణ దీక్ష

చండీగఢ్ : రైతులు మరోసారి ఢిల్లీ బాటపట్టనున్నారు. పంటలకు కనీస మద్దతు ధర కల్పించేలా చట్టబద్ధ హామీ సహా తమ డిమాండ్లు అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచనున్నారు. ఈ నేపథ్యంలో 101 రైతులతో కూడిన బృందం శంబు సరిహద్దు పాయింట్ నుంచి ఢిల్లీకి ఈనెల 21వ తేదీన మరోసారి ర్యాలీగా వెళ్లనున్నట్లు రైతు సంఘం నేత సర్వన్ సింగ్ పంధేర్ తెలిపారు. ఇంతకు ముందు కూడా 101 రైతులతో కూడిన 'జాతా' గత ఏడాది డిసెంబరు 6, 8, 14 తేదీల్లో మూడుసార్లు పాదయాత్రగా ఢిల్లీకి వెళ్లేందుకు ప్రయత్నించింది. అయితే హర్యానాలో భద్రతా

తరువాయి 12లో

అవినీతి–స్వార్థపరుల గుప్పెట్లోకి అమెరికా పాలన

ప్రపంచం

దేశ ప్రజాస్వామ్యం,మౌలిక హక్కులకు అత్యంత ప్రమాదకరం

వీడ్కోలు ప్రసంగంలో ప్రజలకు బైడెన్ హెచ్చరిక

వాషింగ్టన్ : అమెరికా దేశ పరిపాలన కొంతమంది స్వార్థపరులు, అవినీతిపరులతో కూడిన ఒక గ్రూపు చేతుల్లోకి వెళ్ళిపోయిందని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ (82) హెచ్చరించారు. అమెరికాలో ప్రజాస్వామ్యం అంతిమదశలో ఉందని హెచ్చరించారు. నాలుగు సంవత్సరాలు అధ్యక్ష బాధ్యతలు నిర్వహించిన బైడెన్ ఈనెల 20వ తేదీన పదవీ విరమణ చేస్తున్న బైడెన్ గురువారంనాడు వైట్‌హౌస్‌లోని తన ఓవల్ కార్యాలయం నుండి అమెరికా ప్రజలను ఉద్దేశించి వీడ్కోలు ప్రసంగం చేశారు. సిలికాన్ వ్యాలీని ఏలుతున్న ప్రపంచ కుబేరులు ఎలాన్ మస్క్ గురించి తన ప్రసంగంలో హెచ్చరికలు చేశారు. అమెరికా అధికారం ఆయనలాంటి కొంతమంది గుప్పెట్లో చిక్కుకుంటోందని పరోక్ష హెచ్చరిక చేశారు.

''ఈరోజున అమెరికాలో కొద్దిమంది స్వార్థపరులు, అవినీతిపరులతో కూడిన బృందం అధికారాన్ని చేజిక్కించుకుంది, అమెరికాలో ఉన్న అపారమైన సంపద, దేశ పలుకుబడి, దేశాధికారం అన్నీ ఈ స్వార్థపరుల గ్రూపు చేతుల్లోకి వెళ్ళింది, ఇది యావత్ అమెరికా ప్రజాస్వామ్యానికి, మౌలిక హక్కులకు, మౌలిక స్వేచ్ఛకు అత్యంత ప్రమాదకరం'' అని ప్రజలకు హెచ్చరిక చేశారు. నాలుగేళ్ళ తన పరిపాలనలో అనేక రికార్డులు సృష్టించామనీ, ఉద్యోగాలు సృష్టించామని చెప్పారు. మౌలిక సదుపాయాల అభివృద్ధికి, ప్రజల ఆరోగ్య రక్షణకు భారీగా ఖర్చుపెట్టామని, కరోనా మహమ్మారిని అదుపు చేశామని , అమెరికాను ఒక సురక్షితమైన దేశంగా తీర్చిదిద్దామని ఆయన గుర్తుచేశారు. రాబోయేకాలంలో వాతావరణ మార్పుల ప్రమాదం, సోషల్ మీడియాలో దారుణమైన దుష్ప్రచారాల ప్రమాదం పొంచి ఉందని కూడా ఆయన హెచ్చరిక చేశారు. వాతావరణ మార్పులను, రాబోయే సంక్షోభాన్ని అదుపు చేసేందుకు తాను తీసుకున్న చర్యలను అధికార ప్రయోజనాలు, లాభాపేక్ష కోసం బలమైన శక్తులు గుడ్డిగా తోసిపుచ్చాలని కోరుకుంటున్నాయని బైడెన్ అన్నారు. అధికారాన్ని దుర్వినియోగం చేయడంకోసం సోషల్ మీడియా ద్వారా జరిగే ''దుష్ప్రచారం'' అనే భారీ హిమపాతం అట్టడుగున అమెరికా

ప్రజలు శిథిలమైపోతున్నారని హెచ్చరించారు. నాలుగేళ్ళలో తాను నాటిన విత్తనాలు పెరిగి రాబోయే దశాబ్దాలలో మహావృక్షాలుగా మారి గొప్ప ఫలితాలు వస్తాయని, అప్పటివరకూ ఎదురుచూడాలని అన్నారు. తన కృషి క్రమంగాఅందరికీ తెలుస్తుందని అన్నారు. తనపై గెలిచి అధికారం చేపట్టబోతున్న డోనాల్డ్ ట్రంప్‌కు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఫ్యాక్ట్ చెక్‌ను తొలగించిన మెటా వంటి సంస్థల గురించి ఆయన హెచ్చరిక చేశారు.

బైడెన్ వైఫల్యాలు–విజయాలు

ఈనెల 20వ తేదీన డోనాల్డ్ ట్రంప్ దేశాధ్యక్ష బాధ్యతలు చేపట్టడంతో జో బైడెన్ దశాబ్దాల రాజకీయ ప్రస్థానానికి ఇక తెరపడుతుంది. ఆయన పూర్తిపేరు జోసెఫ్ రాబినెట్ బైడెన్ జూనియర్. 2020 జనవరి 20 నుండి ఆయన అమెరికా 46వ అధ్యక్షుడుగా పనిచేశారు. అంతకుముందు 2009 నుండి 2017 వరకూ దేశ ఉపాధ్యక్షుడుగా పనిచేశారు. 1942 నవంబరు 20న జన్మించిన బైడెన్ మొదటి జీవిత భాగస్వామి నీలా హంటర్. రెండో భార్య జిల్ బైడెన్. అంతకుముందు దేశాధ్యక్షుడు బరాక్ ఒబామాకు నమ్మకస్తుడైన సహచరుడుగా బైడెన్ పేరు సంపాదించారు. 1991లో ఆయన గల్ఫ్ యుద్ధాన్ని వ్యతిరేకించారు. 2011లో ఇరాక్ నుండి సైన్యాన్ని ఉపసంహరించి అమెరికా విధాన రూపకల్పనకు ఆయన దోహదం చేశారు. 2021 ఆగస్టులో అఫ్గానిస్థాన్ నుండి అమెరికా సైన్యాన్ని ఉపసంహరించారు. దీనిని అతిపెద్ద తప్పిందంగా రిపబ్లికన్లు, అమెరికన్లు తప్పుపట్టారు. ఆ సమయంలో ప్రజల్లో ఆయన రేటింగ్ 50 శాతం మేరకు పడిపోయింది. అదేవిధంగా అమెరికా 30 ఏళ్ళ చరిత్రలో ఎన్నడూలేనిరీతిలో ద్రవ్యోల్బణం ఐదూశాతం మేరకు పెరిగింది. తర్వాత 2022 జూన్ నాటికి అమెరికా ద్రవ్యోల్బణం ఆయన పాలనలో రికార్డుస్థాయిలో 9.1 శాతానికి చేరుకుంది. మెక్సికో సరిహద్దుల్లో అక్రమ వలసలను అరికట్టలేకపోయారని ప్రజల్లో అసమర్థుడుగా పేరు తెచ్చుకున్నారు. ఆయన పాలనలో కోడిగుడ్డు ధరలు అనూహ్యంగా పెరిగిపోయాయి. ట్రంప్‌కు దీటైన ప్రత్యర్థిగా బైడెన్‌ను డెమోక్రటిక్‌పార్టీ భావించింది. కానీ పార్టీ ఆశలను ఆయన అడియాశలు చేశారు. ఆయన ఆరోగ్యం సహకరించలేదు.వృద్ధాప్యం, మతిమరపు ఆయనకు పాలన చివరికాలంలో అతిపెద్ద సమస్యగా మారింది. ఒకదశలో ఎక్కువగా బయట కనిపించడం మానేశారు. మాటల్లో తడబాటు, అధికారిక కార్యక్రమాల్లో హఠాత్తుగా కింద పడిపోవడం, ఒకరిపేరుతో మరొకరిని పిలిచి అంతర్జాతీయ వేదికల్లో అభాసుపాలు కావడం వంటివి రిపబ్లికన్‌పార్టీకి ఎంతో కలిసి వచ్చింది. దీంతో ఉపాధ్యక్షురాలు కమలాహ్యారిస్ అధ్యక్ష పదవికి అభ్యర్థిగా తెరమీదకు వచ్చారు. తన కొడుకును కేసుల నుండి బయట పడేసేందుకు వల్లమాలిన ప్రేమ చూపించి ప్రజల్లో స్వార్థపరుడుగా ముద్రవేయించుకున్నారు.

12 మంది నక్సల్స్ హతం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ సరిహద్దు అటవీ ప్రాంతాల్లో తలదాచుకునే అవకాశం ఉందనే సమాచారం మేరకు అటవీ గ్రామాల్లో నిఘా వ్యవస్థను కట్టుదిట్టం చేశారు. ఇదిలా ఉండగా ఒక పక్క ఎన్‌కౌంటర్లు, మరో పక్క ప్రెషర్ బాంబుల దాడులతో దండకారణ్యం అట్టుడుకి పోతోంది.

భారీ డంప్ స్వాధీనం

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టులకు చెందిన భారీ డంప్‌ను భద్రాత బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. డిఆర్‌జి, బస్తర్ ఫైటర్స్ ఆధ్వర్యంలో అడవుల్లో కూంబింగ్ నిర్వహిస్తుండగా తుమ్మీవాల్ అటవీ ప్రాంతంలో నక్సల్ దాచిన డంప్‌ను బలగాలు కనుగొని స్వాధీనం చేసుకున్నాయి. ఈ డంప్‌లో 14 తుపాకులు, 14 టిఫిన్ బాంబులు, పేలుడు పదార్థాలు, విప్లవ సాహిత్యం ఉన్నాయి. ఇదే ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న జవాన్లకు ప్రెషర్ బాంబు పేలి తీవ్రగాయాలు అయ్యాయి. గాయాలపాలైన వారిని మెరుగైన వైద్య కోసం హుటాహుటిన రాయపూర్ ఆస్పత్రికి తరలించారు.

ఆర్‌టిసి బస్సులు

(మొదటి పేజీ తరువాయి)

మహబూబాబాద్ ఎంపిలు రఘువీర్ రెడ్డి, బలరాం నాయక్, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, ఆర్ అండ్ బి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ తదితరులున్నారు.ఇదిలా ఉండగా కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయన కార్యాలయంలో గురువారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించి పలు అంశాలపై ఆయనతో చర్చించారు.

అభివృద్ధి పనులకు అటవీశాఖ అనుమతులు మంజూరు చేయండి

తెలంగాణలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు అటవీ, పర్యావరణ శాఖ అనుమతులు మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌కు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి గురువారం సాయంత్రం కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్, కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామి, కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మలను కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలు, సమస్యలపై చర్చించారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మహబూబాబాద్ ఎంపి బలరామ్‌నాయక్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి, సిఎం ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, పిసిసిఎఫ్ డొబ్రియల్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ తదితరులున్నారు. తెలంగాణాలో రహదారుల నిర్మాణాలకు అటవీ శాఖ అనుమతులకు సంబంధించిన పలు అంశాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందిరా పర్యావరణ్ భవన్‌లో కేంద్ర అటవీ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. అటవీ శాఖ అనుమతులు రాకపోవడంతో తెలంగాణ వ్యాప్తంగా 161 ప్రాజెక్టులు నిలిచిపోయాయని సిఎం వివరించారు. 38 ప్రాజెక్టులకు వన్యప్రాణి సంరక్షణ చట్టాలకు సంబంధించిన అనుమతులు మంజూరు చేయాలని సిఎం కేంద్ర మంత్రిని కోరారు. ఈ ప్రాజెక్టుల్లో అత్యధికం రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలు, వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నాయని కేంద్ర మంత్రికి సిఎం రేవంత్‌రెడ్డి తెలియజేశారు. అనుమతులు రాకపోవడంతో జాతీయ రహదారులు, ఏజెన్సీ ప్రాంతాల్లో టవర్ల నిర్మాణం, పిఎంజిఎస్‌వై, పొరుగు రాష్ట్రాలను అనుసంధానించే రహదారుల నిర్మాణ పనులు నిలిచిపోయాయని కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌కు సిఎం రేవంత్‌రెడ్డి వివరించారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన అనుమతుల విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి సిఎం తీసుకెళ్లారు. వివిధ పనులకు వెంటనే అనుమతులు మంజూరు చేయాలని సిఎం విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తికి కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ సానుకూలంగా స్పందించారని అనంతరం మంత్రి కొండా సురేఖ ఎక్స్ వేదికగా వెల్లడించారు.

మూసివేత

(మొదటి పేజీ తరువాయి)

అదానీ గ్రూప్‌ను ఆరోపించడం రాజకీయ దుమారం రేపింది. దశాబ్దాలుగా స్టాక్‌ల అవకతవకలకు పాల్పడమే కాకుండా, ఖాతాల మోసానికి పాల్పడుతోందని తీవ్ర స్థాయిలో ఆరోపించారు. ఆ దెబ్బకు అదానీ గ్రూప్ షేర్లు 150 బిలియన్ అమెరికన్ డాలర్‌ల వరకు కోల్పోయింది. ఆ దెబ్బకు అప్పటి వరకు ప్రపంచ ధనికులలో నాలుగవ స్థానంలో ఉన్న గౌతమ్ అదానీ 20వ స్థానానికి పడిపోయాడు.

సామ్రాజ్యాలను కుదిపేసాం : ఆండర్సన్

తాను హిండెన్‌బర్గ్‌ను రద్దు నిర్ణయంపై రాసిన లేఖను నేట్ ఆండర్సన్ (40) తన వెబ్‌సైట్‌లో పెట్టారు. తాము ఎంచుకున్న ప్రణాళికలు, ఆలోచనలు ముగియడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ నిర్ణయం వెనుక ఎలాంటి ప్రత్యేక కారణాలు, ఎవరి బెదిరింపులు కానీ, ఆరోగ్య, వ్యక్తిగత సమస్యలు కానీ లేవని పేర్కొన్నారు. ఓ నిర్దిష్టమైన సమయంలో విజయవంతమైన కెరీర్ స్వార్థపూరిత చర్యలకు దారితీస్తుందన్నారు. గతంలో తనను తాను నిరూపించుకోవాలని భావించానని, ఇప్పుడు సౌకర్యవంతమైన స్థితిలో ఉన్నానని అన్నారు. తమ బృందంలోని ప్రతి ఒక్కరూ మంచి స్థానాల్లో ఉండాలనుకుంటున్నారని అన్నారు. వారందరికి అవసరమైన సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ఆండర్సన్ తన లేఖలో పేర్కొన్నారు. గతేడాది చివరలో సంస్థ రద్దు గురించి తన కుటుంబం, స్నేహితులు, కంపెనీ సభ్యులతో చర్చించానని అన్నారు. ఈ సంస్థను ప్రారంభించే సమయంలో సమర్థవంతంగా నిర్వహించగలనా అని సందేహించానని, సంస్థను ప్రారంభించేందుకు అవసరమైన ఆర్థిక నేపథ్యం లేదని, బంధువులు ఎవరూ ఈ రంగంలో లేరని అన్నారు. ప్రపంచ స్థాయి ప్రజావేగు, న్యాయవాది బ్రయాన్ వుడ్ మద్దతు లేకపోతే ఈ సంస్థ విజయం సాధించేది కాదని తెలిపారు. ఊహించిన దానికన్నా అధికంగా విజయం సాధించామని, బిలియనీర్ల సామ్రాజ్యాలను కదిలించామని, సుమారు 100 మందిపై సివిల్ లేదా క్రిమినల్ అభియోగాలు నమోదయ్యాయని వివరించారు. వారిలో బిలియనీర్లు, ఖులీనులు, ఉనానరని చెప్పారు. తాను చివరగా అనుమానిత పోంజి స్కీమ్‌లపై పని చేసి, వాటికి సంబంధించిన సమాచారాన్ని నియంత్రణ సంస్థలు తెలియజపరిచిన తరువాత సంస్థను మూసేస్తున్నామని ఆండర్సన్ తెలిపారు. వచ్చే ఆరు నెలల్లో హిండెన్‌బర్గ్ నమూనా గురించి వీడియో సిరీస్‌లు తీయడంపై పని చేస్తానని, దీని ద్వారా ఇతరులు శోధన ఎలా చేయాలో నేర్చుకుంటారని అన్నారు.

దీర్ఘకాలిక ఒప్పందం కుదిరేదాకా

(మొదటి పేజీ తరువాయి)

విరమణ ఒప్పందం అమలులో ఉంటుంది. అంటే ఒప్పందం ప్రక్రియ కూడా అప్పటివరకూ కొనసాగుతుంది. ఇజ్రాయెల్ హెచ్చరికల కారణంగా 20.30 లక్షలమంది పాలస్తీనియన్లు ఇళ్ళు వదలి వెళ్ళిపోయారు. వీరందరూ ఇక తిరిగి రావొచ్చునని బైడెన్ అన్నారు. ఈ ఒప్పందం జరిగేందుకు ట్రంప్ టీమ్‌తో తాము కలిసి పనిచేశామని బైడెన్ అన్నారు. ఈ ఒప్పందం ప్రకారం ఇజ్రాయెల్ సైన్యం 50 రోజుల్లోపు ఫిలిడెల్ఫీ కారిడార్‌ను ఖాళీ చేయవలసి ఉంటుంది. ఈ యుద్ధంవల్ల గడచిన 15 నెలల్లో 46,707 మంది పాలస్తీనియన్లు హతులయ్యారని, మరో 1,10,265 మంది గాయపడ్డారని, ఆక్రమిత బెస్ట్‌బ్యాంక్‌లో 846 మంది పాలస్తీనియన్లు మరణించారనీ, మొత్తం మృతుల్లో 70 శాతంమంది మహిళలు, పిల్లలే ఉన్నారని పాలస్తినా ప్రభుత్వం ప్రకటించింది. ఐతే బందీల విడుదల పూర్తయ్యేలోపు గాజాలో పూర్తిగా యుద్ధ విరమణ జరిగిందన్న భరోసా ఇవ్వాలని హమాస్ ఒత్తిడి చేస్తున్నది.

ఈ ఒప్పందం మా పార్టీ చారిత్రక విజయంవల్లే : ట్రంప్

గాజాలో కాల్పుల విరమణ ఒప్పందంపట్ల కాబోయే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హర్షం ప్రకటించారు. గడచిన ఏడాది నవంబరునెలలో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్‌పార్టీ చారిత్రక విజయం సాధించడంవల్లనే గాజాలో హమాస్–ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణకు అంగీకారం కుదిరిందని ప్రకటించారు. ఈ ఒప్పందం పశ్చిమ ఆసియాలో తాము సాధించిన విజయమేనని అన్నారు. ''రాబోయేకాలంలో తమ ప్రభుత్వ యంత్రాంగం శాంతి సాధించేందుకు సంప్రదింపుల ఒప్పందాలు చేస్తుందని, అమెరికా ప్రజలకు, తమ మిత్రులకు భద్రత, పూర్తి భరోసా కలుగుతుందని ఈ ఒప్పందం రుజువు చేస్తోంది'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. తాను జనవరి 20వ తేదీన ప్రమాణ స్వీకారం చేసేలోపు గాజాలో కాల్పుల విరమణకు ఇజ్రాయెల్‌తో హమాస్ ఒక ఒప్పందం చేసుకోవాలని, లేకపోతే తీవ్రమైన బీభత్సకాండ జరుగుతుందని ఎన్నికల్లో గెలిచాక రెండు మూడుసార్లు హమాస్‌కు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు చేశారు. ఈ హెచ్చరికల అనంతరం మధ్యవర్తుల చర్చలు మరింత వేగం పుంజుకున్నాయి. ఈ యుద్ధంలో హమాస్ చాలా తీవ్రస్థాయిలో నష్టపోయింది. విలువైన ఉగ్రవాద నాయకులను కోల్పోయింది.

విరమణ అమలు!

(మొదటి పేజీ తరువాయి)

ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నేతన్యాహూ విమర్శించారు. ఇజ్రాయెల్ మంత్రివర్గం తక్షణం ఈ ఒప్పందాన్ని ఆమోదించవలసి ఉంది. కానీ దీనిపై నేతన్యాహూ పెదవి విప్పడంలేదు. దీంతో కాల్పుల విరమణ ఒప్పందం అమలు జరుగుతుందా? లేదా? అనే విషయంపై టెన్షన్ పెరుగుతున్నది.2023 అక్టోబరు 7వ తేదీన ఇజ్రాయెల్‌పై హమాస్ దాడిచేసి 251 మందిని బందీలుగా తీసుకుపోయింది. వీరిలో కొంత మంది విడుదలకాగా అనేకమంది వివిధ కారణాలతో మరణించారు. ఇంకా ఇప్పటికీ 94 మంది ఇజ్రాయెల్‌కు చెందిన బందీలు హమాస్ వద్ద ఉన్నారు. కానీ హమాస్ వద్ద ఉన్న బందీలలో కేవలం 60 మంది మాత్రమే సజీవంగా ఉండి ఉంటారని ఇజ్రాయెల్ ప్రభుత్వం అంచనా వేస్తుండగా, సంవత్సరాల తరబడి ఇజ్రాయెల్ జైళ్ళల్లో మగ్గుతున్న 1,000 మంది పాలస్తినా ఖైదీలు ఈ ఒప్పందం ప్రకారం విడుదల అవుతారని హమాస్ నాయకత్వం అంచనావేస్తున్నది. వీరిలో 190 మంది ఖైదీలకు 15 ఏళ్ళుపైగా జీవితకాల శిక్షలు పడ్డాయి. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వస్తుంది. తాజా ఒప్పందం ప్రకారం దశలవారీగా 33 మంది బందీలను హమాస్ విడుదల చేస్తుంది. 19వ తేదీ నుండీ ఇజ్రాయెల్ సైన్యం ఉపసంహరణ ప్రారంభం అవుతుంది. కానీ ఈ ఒప్పందం అమలులోకి వచ్చేలోపు ఇజ్రాయెల్ మంత్రివర్గం ఈ ముసాయిదా ఒప్పందం ప్రతిని ఆమోదించవలసి ఉంది. ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జాగ్ ఒక ప్రకటన చేస్తూ ఒప్పందాన్ని ఆమోదించాల్సిందిగా ప్రధానమంత్రి నేతన్యాహూను కోరారు. అటు బందీలు, ఇటు ఖైదీల విడుదలకు తాము సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రపంచ రెడ్‌క్రాస్ సంస్థ ప్రకటించింది. ఈ ఒప్పందం ప్రకారం గాజాలోకి ప్రతిరోజూ 600 ట్రక్కుల్లో మానవతాసహాయం తరలి రావాల్సి ఉంటుంది. ఈ కాల్పుల విరమణ ఒప్పందం ఆరు వారాలలో మొత్తం మూడు దశల్లో అమలు జరుగుతుంది. 42 రోజులపాటు తాత్కాలికంగా కాల్పు విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ సైన్యం ఆదివారం నుండీ అమలు చేస్తుంది. గాజా నుండి ఇజ్రాయెల్ సైన్నాన్ని ఉపసంహరించే ప్రక్రియ దశలవారీగా ఆరు వారాలలో పూర్తిచేస్తారు. అదే సమయంలో పాలస్తినాను పరిపాలిస్తున్న హమాస్ ఉగ్రవాద సంస్థ కూడాఇజ్రాయెల్‌కు చెందిన 33 మంది బందీలను దశలవారీగా విడుదల చేస్తుంది. దోహాలో జరిగిన పత్రికాగోష్ఠిలో ఖతార్ ప్రధానమంత్రి మహ్మద్ బిన్ అబ్దుల్ రెహ్మాన్ అల్ థానీ ఈ విషయం ప్రకటించారు. అమెరికా,ఈజిప్టు, ఖతార్‌లతోపాటు 85 దేశాల ప్రతినిధులు ఇజ్రాయెల్ – హమాస్ మధ్య చర్చలకు, ఒప్పందంపై అంగీకారానికి దోహదం చేశారు. దోహాలో విజయవంతంగా చర్చలు ముగిశాయని మహ్మద్ బిన్ అబ్దుల్ రెహ్మాన్ అల్ థానీ ప్రకటించారు. ఎడారిలో వానచినుకులా ఈ ఒప్పందంతో పాలస్తినా ప్రజల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ప్రజలు పలుచోట్ల కేరింతలు కొడుతూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌హర్షం వ్యక్తం చేస్తూ ఇక పాలస్తినా ప్రజలు ఇకమీదట గాజాలో తమ తమ ఇళ్ళకు తిరిగి రావచ్చునని ఒక ప్రకటన చేశారు. డోనాల్డ్ ట్రంప్‌తో పాటు పలు దేశాల నాయకులు ఒప్పందంపట్ల హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం పశ్చిమాసియాలో శాంతికి దోహదం చేస్తుందని యూరోపియన్ యూనియన్ ఆనందం వ్యక్తం చేసింది. యుద్ధాన్ని ముగించేందుకు గాజా ఒప్పందం తలుపులు బార్లా తెరిచిందని జర్మనీ ఛాన్సలర్ ఓలాఫ్ షుల్జ్ అన్నారు. గాజాలోకి ఇక ధారాపాతంగా ఆహారం, సహాయ సామాగ్రి తరలింపును ఉద్ధృతం చేయాలని ఈజిప్టు దేశాధ్యక్షుడు అబ్దెల్ ఫతా ఎల్ సిసి కోరారు. గాజా నుండి బందీలను విడుదల చేసేందుకు కృషి చేసినందుకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, కాబోయే అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌లకు ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజిమన్ నేతన్యాహూ కృతజ్ఞతలు తెలియజేశారు. తుది విడత ఒప్పందం వివరాలను ఖరారు చేస్తామని నేతన్యాహూ కార్యాలయం ప్రకటించింది. కానీ ఇజ్రాయెల్‌లో మాత్రం ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మొత్తం బందీలందరినీ విడుదల చేసేవిధంగా ఒప్పందం జరగాలని కోరుతూ బాధిత కుటుంబాలకు చెందినవారు రాజధాని టెల్ అవీవ్‌లో నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు.

24 గంటల్లో గాజాలో 80 మంది హతం

గాజాలో కాల్పుల విరమణ ఒప్పదం అమలు ప్రారంభం కావడానికి ఇక గంటల్లో మాత్రమే వ్యవధి ఉండటంతో ఇజ్రాయెల్ సైన్యం తన దాడులను ఉద్ధృతం చేసింది. గడచిన 24 గంటలలో గాజాలో చేసిన దాడుల్లో 80 మంది మరణించారు. ఒకవైపు ఒప్పందం కుదిరినందుకు హర్షాతిరేకాలు వ్యక్తమవుతుండగా మరోవైపు ఇజ్రాయెల్ సైన్యం రెచ్చిపోయి దాడులు చేస్తోంది. గాజాలో కాల్పుల విరమణకు కుదిరిన అంగీకారాన్ని ఇజ్రాయెల్ మంత్రివర్గం ఆమోదించాల్సి ఉంది. ఒప్పందం అమలు చేసేందుకు ఇంకా కొద్ది గంటలు వ్యవధిమాత్రమే ఉంది. కానీ మంత్రివర్గ తీర్మానం చేసేవిషయంలో నేతన్యాహూ ప్రభుత్వం తాత్సారం చేస్తున్నది. మరోవైపు గాజాలో ఒప్పందాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు వీలుగా తాము పూర్తి అప్రమత్తతో వ్యవహరిస్తామని పాలస్తినాకు చెందిన ఇస్లామిక్ జీహద్ ఉగ్రవాదులు ప్రకటించారు.

పాటించరా?

(మొదటి పేజీ తరువాయి)

డిపార్ట్‌మెంట్ 8 కోట్ల 6 లక్షల 75 వేల 404 రూపాయల ఫైన్ వేసింది. దీంతో పాటు వివిధ ఫీజుల రూపంలో ఫెడరేషన్ ఇంటర్నేషనల్ ఆటోమొబైల్, ఫెడరేషన్ ఆఫ్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్స్ ఆఫ్ ఇండియాకు మరో కోటి 10 లక్షల 51 వేల 14 రూపాయలను హెచ్ఎండిఎ చెల్లించింది. ఇట్ల ఫార్ములా ఈ రేస్ సీజన్ 10 కోసం మొత్తంగా 54 కోట్ల 88 లక్షల 87 వేల 43 రూపాయలను హెచ్ఎండిఎ చెల్లింపులు జరిపింది. హెచ్ఎండిఎ రూల్స్ ప్రకారం రూ. 10 కోట్ల కంటే ఎక్కువ చెల్లింపులు చేయాలంటే ప్రభుత్వం, ఆర్థిక శాఖ అనుమతి తప్పనిసరి. అయితే ఈ మొత్తం ఉదంతంలో ప్రెవెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్2002 (పిఎంఎల్ఏ), ఫారన్ ఎక్స్‌చేంజీ మేనేజిమెంట్ యాక్ట్1999 (ఫెమా) ఉల్లంఘనలు జరిగినట్లు స్పష్టంగా తెలుస్తుందని కెటిఆర్ అందుకు బాద్యుడా కాదా అని ఇడి ప్రశ్నించింది. ఇడి సుమారు 30 నుంచి 35 ప్రశ్నలు కెటిఆర్‌పై సందించింది. పలు ప్రశ్నలకు గుర్తు లేదని, తనకు తెలియదని దాటవేసినట్లు తెలిసింది. విచారణలో కెటిఆర్ వెల్లడించిన అంశాలను ఇడి అధికారులు రికార్డు చేశారు. ఇందులోని అంశాలను మరోసారి రుడీ చేసుకునేందుకు ఈ కేసులో నిందితులుగా ఉన్న అరవింద్‌కుమార్, బిఎల్ఎన్ రెడ్డిలను ఇడి మరోసారి విచారించే అవకాశాలు కూడా ఉన్నాయని తెలుస్తుంది.

ఇడి కార్యాలయం వద్ద బిఆర్ఎస్ ఎంఎల్ఎల అరెస్టు...

హైదరాబాద్‌లోని ఇడి కార్యాలయం వద్దకు బిఆర్ఎస్ ఎంఎల్ఎలు, నేతలు పెద్ద ఎత్తున చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఇడి కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది.కెటిఆర్ విచారణ నేపథ్యంలో అక్కడకు వచ్చిన ఎంఎల్ఏ మాగంటి గోపీనాథ్‌ను, మాజీ ఎంఎల్ఏ బాల్క సుమన్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌లను ఇడి ఆఫీస్ నుంచి వెళ్లిపోవాలని పోలీసులు సూచించారు. ఎంతకీ వినకపోవడంతో వారిని అరెస్ట్ చేశారు. అంతేకాదు.. ఇడి ఆఫీస్ వైపు వచ్చే వాహనాలను దారి మళ్లించారు.

లై డిటెక్టర్ పరీక్ష నిర్వహణకు సిద్ధమా:కెటిఆర్

'రేవంత్ రెడ్డి నీకు ధైర్యం ఉంటే లై డిటెక్టర్ పరీక్షకు ముందుకు రా..నీకు ధైర్యం ఉంటే వెంటనే నిర్ణయం తీసుకో.. డేట్, టైం, ప్లేస్ నువ్వే చెప్పు.. నేను వస్తా'' అని ఇడి విచారణ అనంతరం కెటిఆర్ మీడియాతో మాట్లాడుతూ అన్నారు. ఈ విచారణకు దాదాపుగా రూ.10 కోట్లు ఖర్చు అవుతుంది.. అందుకే రేవంత్ రెడ్డికి నేను ఒకమాట చెప్తున్నా..మీరు మీ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా.. మీ మీద ఎసిబి, ఇడి కేసులు అయ్యాయి కాబట్టి నా మీద కూడా అవే కేసులు బనాయించావు అని అన్నారు. ఈ వృధా అవుతున్న రూ.10 కోట్ల ప్రజా ధనంతో ఇంకా 500 మందికి రుణమాఫీ చేయొచ్చు.. అందుకే డబ్బులు వృధాకాకుండా విచారణ సంస్థలను గౌరవించి ఎసిబి, ఇడి విచారణకు హాజరయ్యానన్నారు. రెండు సంస్థలు కూడా ఒకే రకమైన ప్రశ్నలను ఏడు గంటల పాటు అడిగి వివరాలు తీసుకున్నాయన్నారు.ఈ రెండు సంస్థలకు ఒక్కటే మాట చెప్పిన. మీరు ఎన్ని సార్లు పిలిచినా వచ్చి సమాధానం చెబుతాను. పూర్తిగా విచారణకు సహకరిస్తానన్నాను. సంక్రాంతి పండగ సందర్భంగా రేవం

మంత్రి సీతక్కను కలిసి అమెరికా బోనాల ఉత్సవాలకు ఆహ్వానించిన 'నైటా'

ప్రజాపక్షం/హైదరాబాద్ : న్యూయార్క్ తెలంగాణ తెలుగు సంఘం (నైటా) కొత్త అధ్యక్షురాలిగా ఎంపికైన వాణి ఏనుగు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అభినందించారు. అమెరికా ప్రధాన నగరమైన న్యూయార్క్‌లో తెలుగువారికి ఓ సంఘం ఏర్పాటు చేయటంతో పాటు, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగించేందుకు నైటా చేస్తున్న కృషిని మంత్రి సీతక్క ప్రశంసించారు. హైదరాబాద్‌లో మంత్రి నివాసంలో జరిగిన కార్యక్రమంలో నైటా కొత్త కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. మహిళా శక్తికి ఆదర్శంగా నిలిచి, నైటా సేవలను మరింత విస్తృతపరచాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. వాణి ఏనుగులతో పాటు కుటుంబ సభ్యులను సన్మానించారు. రానున్న జూన్‌లో నైటా తరపున న్యూయార్క్‌లో జరిగే బోనాల ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని మంత్రిని నైటా కార్యవర్గం ఆహ్వానించింది. అందుకు మంత్రి సీతక్క సుముఖత వ్యక్తం చేశారు.

పసుపుబోర్డు చైర్మన్ గంగారెడ్డికి మంత్రి తుమ్మల శుభాకాంక్షలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : జాతీయ పసుపు బోర్డు చైర్మన్‌గా నియమితులైన పల్లె గంగారెడ్డికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా పసుపు రైతుల దశాబ్దాల పోరాటాన్ని, పసుపు బోర్డు సాధించడంలో వారు చూపిన స్ఫూర్తిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గుర్తు చేశారు. పసుపు బోర్డు చైర్మన్‌గా తెలంగాణ పసుపు రైతుల ఆకాంక్షలకు తగ్గట్టుగా ఉన్నత స్థాయికి చేర్చాలని గంగారెడ్డిని కోరారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వము తరపున పసుపు బోర్డు ప్రగతికి కావల్సిన అన్ని విధాలుగా సహాయ సహకారాలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని మంత్రి తెలిపారు. నూతన వంగడాల అభివృద్ధి, సాగులో కొత్త పద్ధతులతో బోర్డు ద్వారా రైతులకు కొత్త ప్రోత్సాహకాలతో రాష్ట్రం నుండి పసుపు ఎగుమతులు మరింత వృద్ధి చెందేవిధంగా బోర్డు చైర్మన్‌గా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. పసుపు ఉప ఉత్పత్తుల తయారీదారులకు నైపుణ్య అభివృద్ధికి పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టి, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ అవకాశాలు మెరుగుపరుస్తారని ఆశిస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

పోలీసులు చట్టానికి లోబడి పనిచేయాలి : వేముల ప్రశాంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : పోలీసులు సిఎం రేవంత్ రెడ్డి చెప్పినట్టు కాకుండా, చట్టానికి లోబడి పని చేయాలని, లేదంటే అన్ని రోజులు ఒకేలా ఉండబోవని బిఆర్ఎస్ మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సూచించారు. సిఎం రేవంత్ రెడ్డి కక్షతోనే కెటిఆర్‌పైన అక్రమంగా ఫార్ములా ఈ కార్ రేస్‌ను పెట్టారని ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ ప్రతిష్ఠ కోసమే ఫార్ములా ఈ కార్ రేసు విషయంలో మంత్రిగా కెటిఆర్ నిర్ణయం తీసుకున్నారన్నారు. కార్ రేసులో ప్రతి రూపాయికి లెక్క ఉన్నదని, ఎక్కడా అవినీతి జరుగలేదని, రూ.42 కోట్లు ప్రభుత్వ ఖాతా నుండి బదిలీ అయ్యాయని వివరించారు. కేసు పెట్టాల్సి వస్తే సిఎం రేవంత్ రెడ్డిపైన కేసు పెట్టాలని, ఇడి, కేంద్ర దర్యాప్తు సంస్థలు ముఖ్యమంత్రిని విచారించాలన్నారు. కెటిఆర్‌ను కాంగ్రెస్, బిజెపి రెండూ టార్గెట్ చేశాయని, ఆ రెండు పార్టీల నాయకులు ఒకే రకంగా మాట్లాడుతున్నారన్నారు. పార్టీ మారిన ఎంఎల్‌ఎల విషయంలో రాజ్యాంగంలో ఉన్న ప్రతి అవకాశాన్ని కూడా బిఆర్ఎస్ ఉపయోగించుకుంటుందని తెలిపారు. తనది కాంగ్రెస్ పార్టీ అని జగిత్యాల ఎంఎల్‌ఎ సంజయ్ అధికారికంగా ప్రకటించారని,ఆయనపైన శాసనసభ స్పీకర్ అనర్హత వేటు వేయాలని కోరారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలలో ఎండగడుతామని హెచ్చరించారు.

తెలంగాణ కల సాకారంలో..

జైపాల్‌రెడ్డి పాత్ర చిరస్మరణీయం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రముఖుల నివాళి

ప్రజాపక్షం / హైదరాబాద్ : ప్రత్యేక తెలంగాణ కల సాకారంలో కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి పాత్ర చిరస్మరణీయమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కొనియాడారు. కేంద్ర మాజీ మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్ సూదిని జైపాల్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని గురువారం ఢిల్లీలోని సిఎం అధికారిక నివాసంలో జైపాల్‌రెడ్డి చిత్రపటానికి సిఎం రేవంత్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలోని సాధారణ పల్లె నుంచి ఢిల్లీ వరకు కొనసాగిన ఆయన ప్రస్థానంలో నైతిక విలువలకు కట్టుబడ్డారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో, పార్లమెంట్ ఉభయ సభల్లో తెలంగాణ గురించి బలమైన గళం వినిపించారని సిఎం గుర్తుచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కార్, బెల్లంపల్లి, పరిగి ఎంఎల్‌ఎలు గడ్డం వినోద్, రామ్మోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్‌అలీ, నాయకులు రోహిన్‌రెడ్డి, విద్యాసాగర్ పాల్గొన్నారు.

సిపిఐ నేతల ఘన నివాళి : తెలంగాణ రాష్ట్ర సాధనలో కేంద్రమంత్రిగా దివంగత సూదిని జైపాల్‌రెడ్డి కీలక భూమిక పోషించారని సిపిఐ నేతలు కొనియాడారు. మాజీ కేంద్ర మంత్రి దివంగత ఎస్.జైపాల్‌రెడ్డి 83వ జయంతిని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్డు, పివి మార్గ్‌లోని స్ఫూర్తి స్థల్ వద్ద సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎంఎల్‌ఎ పల్లా వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు ఉజ్జని రత్నాకర్‌రావు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో మాజీ కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి కీలకపాత్ర పోషించారని కొనియాడారు. తెలంగాణ ప్రజల ప్రత్యేక రాష్ట్రం స్వప్నం సాకారం కావడంలో ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధిలో జైపాల్‌రెడ్డి పాత్ర మరువలేనిదన్నారు.

పలువురు ప్రముఖుల నివాళి : అత్యుత్తమ పార్లమెంటేరియన్, కేంద్ర మాజీ మంత్రి దివంగత ఎస్.జైపాల్ రెడ్డి రాష్ట్ర, దేశ రాజకీయాలకే వన్నె తెచ్చిన మహానేత అని పలువురు ప్రముఖులు కొనియాడారు. హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లో పివి మార్గ్ స్ఫూర్తి స్థల్‌లో గురువారం మాజీ కేంద్ర మంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి 83వ జయంతిని అధికారికంగా.. ఘనంగా నిర్వహించారు. జైపాల్‌రెడ్డి సమాధిపై తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సతీమణి ఎనుముల గీతారెడ్డి, కుటుంబ సభ్యులు, ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కె.కేశవరావు, వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి, ఎంఎల్‌సిలు టి.జీవన్‌రెడ్డి, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ఎంపిలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, మాజీ మంత్రి కుందూరు కె.జానారెడ్డి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, గడ్డం వివేక్, సుదర్శన్ రెడ్డి, ఎన్.ఉత్తమ్ పద్మావతిరెడ్డి, యశస్విని, జైవీర్‌రెడ్డి, మందుల సామెలు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డంప్రసాద్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా పార్లమెంట్‌లో ముఖ్య భూమిక పోషించారని, ఆ మహానేత పాలమూరు జిల్లా వాసి కావడంతో పాలమూరు జిల్లాకు జైపాల్‌రెడ్డి పేరు పెట్టాలని కోరారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ సమకాలీన భారత రాజకీయాల్లో మొదటగా నిలిచే గొప్ప రాజనీతిజ్ఞుడు, ఉత్తమ పార్లమెంటేరియన్ మంచి విలవలు, నిజాయితీ గల గొప్ప రాజకీయ నాయకుడు మాజీ కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి అన్నారు.

శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సహకారంలో జైపాల్‌రెడ్డి ముఖ్య పాత్రను ప్రజలు ఎన్నటికీ మరిచిపోరని, చేపట్టిన పదవులకు వన్నె తెచ్చారని అన్నారు. స్ఫూర్తి స్థల్ వద్ద మాజీ ఎంపిలు ఉండవల్లి అరుణ్ కుమార్, కెవిపి.రామచంద్రయ్య, డిజిపి డాక్టర్ జితేందర్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, మెట్రో ఎండి ఎన్‌విఎస్.రెడ్డి, వివిధ శాఖల అధికారులు జైపాల్ రెడ్డి సమాధిపై పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు.

అగ్ని ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు

రూ. 100కోట్లతో ఖమ్మం మార్కెట్ ఆధునీకరణ

హైదరాబాద్‌లో ప్రపంచ స్థాయి మార్కెట్ నిర్మాణానికి ప్రణాళికలు

అగ్ని ప్రమాద ఘటన స్థలాన్ని పరిశీలించిన మంత్రి తుమ్మల

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : మార్కెట్‌లో అగ్ని ప్రమాదాలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి ఖమ్మం పత్తి మార్కెట్ యార్డులో బుధవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాద ఘటన స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఖమ్మం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం రాత్రి జరిగిన సంఘటన దురదృష్టకరమని, దీనికి గల కారణాలు ఇంకా తెలియ రాలేదని, ప్రస్తుతం పోలీసులు విచారణ చేస్తున్నారని మంత్రి తెలిపారు. ప్రమాదంలో పత్తిబేళ్లు తగలబడుతున్నాయని తెలిసిన వెంటనే నష్ట నివారణ చర్యలకు ఆదేశించామని, వెంటనే ఫైరింజన్ రావడం వల్ల ప్రమాద విస్తృతి తగ్గిందని మంత్రి తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాల నివారణకు, ప్రమాదం ఎందుకు జరిగిందో తెలుసుకోవాల్సి ఉందని, మార్కెట్‌లో ఉన్న భద్రతా ఏర్పాట్లు వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని సరైన నివేదికను ప్రభుత్వానికి అందించాల్సిందిగా అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు రూ.100కోట్లతో ఆధునీకరణ పనులు ప్రారంభిస్తామని త్వరలోనే ఆ పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు. మార్కెట్‌కు చుట్టూ ఉండే రోడ్లు విశాలంగా ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా ఉండాలని, మార్కెట్ పూర్తి స్థాయిలో పరిశుభ్రంగా ఉండాలన్నారు. హైదరాబాద్‌లో రూ.1000 కోట్ల నుంచి రూ. 2000 కోట్లు ఖర్చు పెట్టి మెగా మార్కెట్ అభివృద్ధికి ప్రభుత్వం ఆలోచిస్తుందని, విమానాశ్రయం దగ్గరలో ఔటర్ రింగురోడ్డు, రిజినల్ రింగు రోడ్డు మధ్యలో 400 ఎకరాల్లో ప్రపంచంలోనే మేటి మార్కెట్‌గా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. వరంగల్, నిజామాబాద్, ఖమ్మం వంటి పెద్ద పెద్ద మార్కెట్లు అభివృద్ధి చేసేందుకు నివేదికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రైతు సంఘం నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు, పలువురు నాయకులు, వ్యాపారులు, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కెటిఆర్ వ్యాఖ్యలపై స్పందించిన పిసిసి అధికార ప్రతినిధి గౌరీ సతీష్

ప్రజాపక్షం/హైదరాబాద్ : గురివింజ తన నలుపు తనకు తెలియనట్లు కెటిఆర్ మాట్లాడుతున్నారని పిసిసి అధికార ప్రతినిధి గౌరీ సతీష్ పేర్కొన్నారు. ఫార్ములా ఇ కార్ రేస్ కేసులో కెటిఆర్‌పై వచ్చిన ఆరోపణలను వాస్తవం కాదని నిరూపించుకోవాలని ఆయన సవాల్ విసిరారు. అలా కాకుండా...ముఖ్యమంత్రికి సవాల్ విసరడం సరికాదన్నారు. నియమనిబంధనలు ఉల్లంఘించి నిధులు ఖర్చు చేయడం నేరమా కాదా అని ప్రశ్నించారు. మంత్రివర్గ తీర్మాణంకాని, గవర్నర్ అనుమతి కాని, ఆర్‌బిఐ అనుమతికాని లేకుండా ఏలా ప్రభుత్వ సొమ్మును ఇతర దేశాలకు బదిలీ చేస్తారు ? అని సతీష్ ప్రశ్నించారు. దయ్యాలు వేదాలు వల్లించినట్లు కెటిఆర్ మాట్లాడుతున్నారన్నారు. కెటిఆర్ వచ్చిన ఆరోపణలు అవాస్తవమని నిరూపించుకోవాలని సూచించారు. సత్యదూరమైన మాటలు మాట్లాడుతూ ప్రభుత్వంపై బురద జల్లడం సరికాదని అన్నారు.

8 ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు 'అదర్ డ్యూటీ' సౌకర్యం

ఉత్తర్వులు జారీ చేసిన జిఎడి

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలోని వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు రాష్ట్ర ప్రభుత్వం 'అదర్ డ్యూటీ' (ఒడి) సౌకర్యాన్ని కల్పించింది. ఒడి పొందిన సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు విధులకు హాజరు కావాల్సిన అవసరం లేదు, వీరికి ప్రత్యేక సెలవులు మంజూరవుతాయి. 8 ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలకు ఒడి సౌకర్యాన్ని కల్పించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన (సర్వీస్ వెల్ఫేర్) శాఖ ముఖ్యకార్యదర్శి బెన్సూర్ మహేష్ దత్ ఎక్కా 'జిఒ ఆర్‌టి నంబర్ 55ను' జారీ చేశారు. ఒడి పొందిన సంఘాలలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సెంట్రల్ అసోసియేషన్, తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ సెంట్రల్ హైదరాబాద్ (టిఎన్‌జిఒ), తెలంగాణ క్లాస్ 4 ఎంప్లాయిస్ సెంట్రల్ అసోసియేషన్, తెలంగాణ స్టేట్ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్(టిఎస్‌యుటిఎఫ్), స్టేట్ టీచర్స్ యూనియన్ ఆఫ్ తెలంగాణ స్టేట్(ఎస్‌టియు టిఎస్), తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టిఆర్‌టిఎఫ్), ప్రొగ్రెసివ్ రికోగ్నైస్డ్ టీచర్స్ యూనియన్ టిఎస్ (పిఆర్‌టియుటిఎస్), తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (టిఆర్ఇఎస్ఎ) సంఘాల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులకు ప్రభుత్వం ఒడి సౌకర్యాన్ని కల్పించింది.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా..

ప్రతి నిరుపేదకు లబ్ధి చేకూరేలా ఎంపిక

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ్మ

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా ప్రతి నిరుపేదకు లబ్ధి చేకూరేలా ఎంపిక జరగాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర్ రాజనర్సింహ్మ అన్నారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, ఎమ్మెల్సీ కూచుకల్ల దామోదర్ రెడ్డి, ప్రత్యేక అధికారి రవి, జిల్లా శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి అనిరుద్ రెడ్డి, వాకిటి శ్రీహరి, మధుసూదన్ రెడ్డి కూచుకుల్ల రాజేష్, మేఘా రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, విజయుడు, కసిరెడ్డి నారాయణ రెడ్డి, డిసిసిబి చైర్మన్ విష్ణు వర్ధన్ రెడ్డితో కలిసి రైతు భరోసా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల, రేషన్ కార్డుల జారీ వంటి సంక్షేమ పథకాల అమలుపై జరిగిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కార్యాచరణ సమన్వయ సమావేశంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కూలంకషంగా సమీక్షించి సమర్ధ నిర్వహణకు జిల్లా కలెక్టర్లు, జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు విజయేందిర బోయి బదావత్ సంతోష్, ఆదర్శ సురభి, బి.ఎం సంతోష్, ఆయా జిల్లాల అదనపు కలెక్టర్లు, సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాలకు సంబంధించి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, తదితర అంశాలపై కార్యాచరణకు సంబంధించిన వివరాలను ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టరు వివరించారు. జర్నలిస్టులు కూడా ఇందిరమ్మ ఇండ్లను అడుగుతున్నారని ఒకసారి పరిశీలించాలని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి కోరారు.

'అండర్ గ్రాడ్యుయేట్'

పాఠ్యాంశాల సవరణ

నైపుణ్యాన్ని పెంచేలా నూతన సిలబస్

ప్రత్యేక గూగుల్ ఫోరం ద్వారా సూచనల స్వీకరణ

మండలి చైర్మన్ నేతృత్వంలో కోర్ కమిటీ

ప్రజాపక్షం/హైదరాబాద్ : అండర్ గ్రాడ్యుయేట్ పాఠ్యాంశాలను తెలంగాణ ఉన్నత విద్యా మండలి (టిజిసిహెచ్ఇ) సవరించనుంది. ఉపాధి అవకాశాలను దృష్టిలో పెట్టుకుని ప్రయోగాత్మకంగా నైపుణ్యాలను నేర్చుకునే విధంగా 'నూతన సిలబస్'ను రూపొందించనున్నారు. యుజిసి మార్గదర్శకాలకు అనుగుణంగా నూతన సిలబస్ రూపకల్పనకు విద్యా మండలి చైర్మన్స్, వైస్‌చైర్మన్లు, కార్యదర్శి నేతృత్వంలో కోర్ కమిటీని ఏర్పాటు చేశారు. ప్రయోగాత్మకంగా, పరిశ్రమకు సంబంధించిన జ్ఞానాన్ని నేర్చుకోవడం, ఉపాధి సామర్థ్యాలను అభివృద్ధి చేయడం, గ్లోబల్ పోటీతత్వాన్ని తట్టుకునేలా పరిశ్రమ నైపుణ్యాలతో విద్యార్థులను తీర్చిదిద్దాలనే ముఖ్యమైన లక్ష్యంగా కోర్ కమిటీ కృషి చేయనుంది. నూతన సిలబస్ రూపకల్పనలో భాగంగా విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులు, విద్యార్థులు, విధాన రూపకర్తలతో పాటు పలువురి సూచనలను తెలంగాణ విద్యా మండలి ఆహ్వానిస్తోంది. ఇందుకు ప్రత్యేక 'గూగుల్ ఫోరం'ను టిజిసిహెచ్ఇ వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టారు. టెక్నాలజీ, డిజిటల్ బదిలీ పరిశ్రమలను దృష్టిలో పెట్టుకుని పాఠ్యప్రణాళిక పునరుద్ధరణ, పరిశోధన, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, ఇంటర్న్‌షిప్‌లు, నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించడం, ఎంటర్‌ప్రెన్యూనర్‌షిప్, ఇన్నోవేషన్ ఎకో సిస్టమ్, ఫీడ్‌బ్యాక్ విధానం, మౌలిక సదుపాయాలు, నాణ్యత మెరుగుదల తదితర అంశాలపై కోర్ కమిటీ ప్రత్యేక దృష్టి పెట్టనుంది. యుజిసి మార్గదర్శకాలకు అనుగుణంగా ,అకడమిక్ లెర్నింగ్ , వాస్తవ ప్రపంచ సవాళ్ల మధ్య అంతరాన్ని తగ్గించే లక్ష్యంతో ఇంటర్న్‌షిప్‌ల కోసం కూడా పరిశోధనలను రూపొందించనుంది. పాలసీ మేకింగ్, గవర్‌నెన్స్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్‌లో ప్రయోగాత్మక అనుభవాన్ని అందించడం, అకాడమిక్ లెర్నింగ్, ఇండస్ట్రీ అవసరాలను తీర్చే విధంగా, తాజా దృక్కోణాల ద్వారా వినూత్న ఆలోచనను ప్రోత్సహించడం, డిజిటల్ పరివర్తన, స్థిరత్వం, సమకాలీన సవాళ్ల కోసం నైపుణ్యం కలిగిన వర్క్‌ఫోర్స్‌ను సిద్ధం చేస్తున్నట్టు ఉన్నత విద్యామండలి తెలిపింది. ఉన్నత విద్యా పరిపాలనలో వాస్తవ నైపుణ్యాల అభివృద్ధి, విధాన విశ్లేషణ, పరిశోధన, ప్రాజెక్ట్ నిర్వహణలో నైపుణ్యాల అభివృద్ధి, నిపుణులతో నెట్ వర్కింగ్, పూర్తి చేసిన సర్టిఫికెట్, అసాధారణమైన పని తీరు కోసం సిఫార్సులు చేసేందుకు ఇంటర్‌నల్‌కు ఉపయోగపడుతుందని, రాబోయే తరం విద్యార్థులను శక్తివంతులుగా తీర్చిదిద్దేందుకు ఇంటర్న్‌షిప్ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని విద్యా మండలి అధికార వర్గాలు చెబుతున్నాయి.

విద్యార్థులకు 'స్కిల్ స్ప్రింట్' పేరిట ప్రత్యేక ఇంటర్న్‌షిప్

మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్ : విద్యార్థులు, నిరుద్యోగ యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు 'టీ వర్క్స్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ సంయుక్తాధ్వర్యంలో 'స్కిల్ స్ప్రింట్' పేరిట ప్రత్యేక ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సచివాలయంలో గురువారం ఆవిష్కరించారు. 'తెలంగాణను నైపుణ్య మానవ వనరులకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చుతామన్నారు. పరిశ్రమలు, విద్యా సంస్థల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతలో ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నాం అని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. 'స్కిల్ స్ప్రింట్' ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం వ్యవధి 90 రోజులు ఉంటుందని, ఈ కార్యక్రమంలో భాగంగా ఇంజినీరింగ్, రోబోటిక్స్, మేనేజ్ మెంట్, సేల్స్, బిజినెస్ డెవలెప్‌మెంట్, మార్కెటింగ్ తదితర రంగాల్లో డిగ్రీ, పీజి చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని తెలిపారు. సంబంధిత పరిశ్రమల నిపుణులు మార్గనిర్దేశం (మెంటార్ షిప్) చేస్తారని, టీ వర్క్స్‌లోని అధునాతన సౌకర్యాలను విద్యార్థులు వినియోగించుకోవచ్చు అని తెలిపారు. సొంతంగా ప్రాజెక్టులను రూపొందించేలా విద్యార్థులను ప్రోత్సహిస్తాం అని అన్నారు. Yisu.in వెబ్ సైట్లో కూడా వివరాలు దొరుకుతాయి. ఈ కార్యక్రమంలో టీ వర్క్స్ సిఇఒ తనికెళ్ల జోగిందర్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఛమాన్ మెహతా పాల్గొన్నారు.

జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, జయశంకర్ భూపాలపల్లి.

ఆర్.సి.నెం. A/04/2025 (ప్రకటన) తేది: 16-01-2025

జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జయశంకర్ భూపాలపల్లి గారి ఆధ్వర్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా నందు (5) ప్రీమెట్రిక్ వసతి గృహములకు మరియు (2) కళాశాల వసతి గృహములకు 2024-25 విద్యా సంవత్సరానికి మెటీరియల్ సరఫరా గాను క్రింద తెలుపబడిన వాటికి టెండరు కోరడమైనది.

క్రమ నంబర్	టెండర్ పేరు	ఫారము ధర	ధరావతి సొమ్ము
1	వసతి గృహాలకు మెటీరియల్ సరఫరా	5000.00	100000.00

జిల్లా వెనుకబడిన తరగతుల అభివ

ప్రజాపక్షం
శుక్రవారం, జనవరి 17

క్యూబాపై తొలగిన 'టెర్రరిస్టు' ముద్ర

అమెరికా అధ్యక్షుడు జో బైడన్ తమ పదవీకాలం ముగించుకుని రిటైర్మెంట్ తీసుకునే వారం రోజులముందు – జనవరి 14న – చరిత్రలో నిలిచిపోయే ఒక మంచి నిర్ణయం తీసుకున్నారు. 2020 అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో చేసిన వాగ్దానం అమలుకు చివరిక్షణం దాకా సమయం తీసుకున్నారంటే ఆ అంశంపై అమెరికా అడ్మినిస్ట్రేషన్‌లో ఉన్న వ్యతిరేకతను ఊహించుకోవచ్చు. ''టెర్రరిజాన్ని పోషించే రాజ్యాల''(ఎస్ఎస్ఒటి) జాబితానుండి క్యూబా పేరును ఆయన తొలగించారు. క్యూబాపై ఆర్థిక దిగ్బంధనం విధించి అది కమ్యూనిస్టుపథం విడనాడేటట్లు చేయటానికై అమెరికా ఆరు దశాబ్దాలుగా ఈ నిషేధం అమలు చేస్తోంది. అంతర్జాతీయ వర్తక –వాణిజ్య లావాదేవీల్లో మారకద్రవ్యంగా ఉన్న అమెరికన్ డాలర్లు క్యూబాకు లభ్యం కాకుండా చేయటం, క్యూబాలో అమెరికన్ పెట్టుబడులను నిరుత్సాహపరచటం ధ్యేయంగా అమెరికా పాలకులు క్యూబాకు టెర్రరిస్టు ముద్ర వేశారు. అమెరికా భూభాగానికి 90 కిలోమీటర్లలో సరిహద్దు కలిగి ఉన్న దీవిదేశం క్యూబాలో కమ్యూనిస్టు విప్లవాన్ని మొగ్గలోనే తుంచటానికి అమెరికన్ సామ్రాజ్యవాదులు ఈ దిగ్బంధం అమలు చేశారు. అయితే ఫైడల్ కాస్ట్రో ఉత్తేజకర నాయకత్వంలో, నాటి సోవియట్ యూనియన్ బహుముఖ తోడ్పాటుతో క్యూబా సర్వతోముఖ అభివృద్ధి సాధించింది. సోవియట్ యూనియన్ అంతర్ధానం తదుపరి ఎదురైన కఠిన పరీక్షలను క్యూబా నాయకత్వం ఓర్పుతో, నేర్పుతో, చాకచక్యంతో అధిగమించుతూ వస్తున్నది. క్యూబాపై ఆర్థిక దిగ్బంధనం ఎత్తివేయాలని ఐరాస జనరల్ అసెంబ్లీ కొన్ని వందలసార్లు తీర్మానాలు ఆమోదించినా, ప్రపంచవ్యాప్తంగా శాంతి ఉద్యమం, కమ్యూనిస్టు, ప్రజాతంత్ర ఉద్యమం ఘోషించినా అమెరికా పెడచెవినబెట్టింది.

> క్యూబాకు వ్యతిరేకంగా సాగిస్తున్న ఆర్థిక యుద్ధాన్ని ఆపాలి. అమెరికాతో గౌరవప్రదమైన సంబంధం అభివృద్ధికి క్యూబా సుముఖంగా ఉంది. సంభాషణలు, ఒకరి వ్యవహారాల్లో మరొకరి జేజోక్యం ప్రాతిపదికగా సంబంధాలు కోరుకుంటున్నాం''అని హవానాలో క్యూబా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రకటించింది.

బైడన్ క్యూబాపై టెర్రరిస్టు ముద్ర తొలగించి ఏదో మంచిపని చేశాడని అనిపించుకున్నా, 20వ తేదీ రెండవ టరం అధికారం చేబట్టనున్న పచ్చి మితవాది డోనాల్డ్ ట్రంప్ క్యూబాను తిరిగి 'టెర్రరిస్టు రాజ్యాల' జాబితాలో చేర్చదని అనుకోలేము. ఎందుకంటే, అధ్యక్షుడు బరాక్ ఒబామా లోగడ 2017లో క్యూబాపై ఆ ముద్ర తొలగించారు. కాగా, డోనాల్డ్ ట్రంప్ తన తొలిటరం పదవీకాలం చివర్లో 2021 జనవరి 11న ఆ ముద్రను పునరుద్ధరించాడు. ట్రంప్ తమ రెండవ టరం అధికారం చేబట్టగానే బైడన్ క్యూబా నిర్ణయాన్ని తిరగతోడతారని ఊహించటం కష్టం కాదు. అయితే ఈ పర్యాయం కొన్ని ఇతర ప్రతిబంధాలున్నాయి. కొలంబియా ఒత్తిడిపై బైడన్ ఈ నిర్ణయం తీసుకున్నాడని అంటున్నారు. అమెరికా ఫస్ట్ పేరుతో తమ ఆర్థిక వ్యవస్థ రక్షణకోసం దిగుమతులపై సుంకాలు పెంచటం, కెనడా, పనామా కాల్వ స్వాధీనం, నాటో రక్షణవ్యయంలో యూరప్ దేశాల వాటా పెంపును సాధించటం, రష్యా–ఉక్రేన్ యుద్ధం ముగింపజేయటం వంటి ప్రాధాన్యతలు ట్రంప్ ముందున్నాయి. అంతేగాక, బైడన్ ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రకటించేటపుడు వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కె.జె.పీర్రీ, క్యూబా ప్రభుత్వం – కాథలిక్ చర్చి మధ్య సంభాషణలను ఆమె ప్రస్తావించారు. తమ నిర్ణయం వెనుక చర్చి పాత్ర ఉన్నట్లు సూచన ప్రాయంగా తెలిపారు. ''2025లో ఆర్డినరీ జూబిలీ'' (సార్వత్రిక క్షమాదానం పాటింపు) స్ఫూర్తితో వివిధ నేరాల కింద నిర్బంధంలో ఉన్న 553మంది ఖైదీలను తమ ప్రభుత్వం త్వరలో విడుదల చేస్తున్నట్లు అధ్యక్షుడు డియాజ్–కనల్ ఇటీవల పోప్‌కు వర్తమానం పంపారు. క్యూబా విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఈ కొత్త పరిణామాన్ని తెలియజేస్తూ, విదేశాంగమంత్రి బ్రూనో రోడ్రిగజ్, అధ్యక్షుడు డియాజ్–కనల్‌లు వరుసగా 2022, 2023 సంవత్సరాల్లో పోప్‌ను కలుసుకున్నప్పుడు తమదేశంపై అమెరికా విధించిన ఎస్ఎస్ఒటి ముద్రను ఆయన దృష్టికి తెచ్చినట్లు చెప్పారు. ట్రంప్ మద్దతుదారులు కొందరు ఇప్పటికే బైడన్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, అది మూన్నాళ్ల ముచ్చటేనంటున్నారు. కాగా అమెరికన్ కమ్యూనిస్టుపార్టీ బైడన్ నిర్ణయాన్ని స్వాగతిస్తూ ఇది ఎప్పుడో జరగాల్సిందని వ్యాఖ్యానించింది. క్యూబన్ ప్రజలు, అంతర్జాతీయ సమాజం, ప్రపంచవ్యాప్తంగా గల ప్రజాస్వామిక, కార్మిక, పౌరహక్కుల, కమ్యూనిస్టు పార్టీలు వంటి విశాల విభాగాలు అనేక సంవత్సరాలుగా చేస్తున్న పోరాట ఫలితమని సిపియుఎస్ఎ సంతోషం వ్యక్తం చేసింది. ''ఈ దిద్దుబాటు ఎప్పుడో జరగాల్సింది. క్యూబాకు వ్యతిరేకంగా సాగిస్తున్న ఆర్థిక యుద్ధాన్ని ఆపాలి. అమెరికాతో గౌరవప్రదమైన సంబంధం అభివృద్ధికి క్యూబా సుముఖంగా ఉంది. సంభాషణలు, ఒకరి వ్యవహారాల్లో మరొకరి జేజోక్యం ప్రాతిపదికగా సంబంధాలు కోరుకుంటున్నాం''అని హవానాలో క్యూబా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రకటించింది.

విద్యార్థి రాజకీయాల 'పునరుజ్జీవం' సాధ్యమేనా?

ఎస్‌కె. జకీర్
9052631212
సీనియర్ జర్నలిస్ట్

విశ్వవిద్యాలయాలు, కాలేజీలలో విద్యార్థి సంఘాలు, వాటి ఎన్నికలకు సంబంధించిన కొత్త చర్చకు రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఆయన ఈ మేరకు సంచలన వ్యాఖ్యలు చేశారు. దాదాపు నాలుగు దశాబ్దాల కిందటే విద్యా సంస్థల్లో 'విద్యార్థి రాజకీయాలు' నిషేధానికి గురయ్యాయి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మాత్రమే విద్యార్థి సంఘాల ఉనికి ఇంకా ఉంది. ఢిల్లీలో జెఎన్‌యు, డియు, వంటి చోట్ల విద్యార్థి రాజకీయాల మనుగడ ఉన్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కాలేజీలు, యూనివర్సిటీలలో గతంలో ఎన్ఎస్‌యుఐ, ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యు, ఆర్ఎస్‌యు, ఎబివిపి, డిఎస్ఒ. ఇంకా మరికొన్ని విద్యార్థి సంఘాలు క్రియాశీలంగా ఉండేవి. ఆయా విద్యార్థి సంఘాలన్నీ ఏదో ఒక 'రాజకీయ భావజాలాని' కి అనుబంధంగా పనిచేసేవి. కాలక్రమంలో 'యూనివర్సిటీలు తీవ్రవాదుల్ని తయారు చేస్తున్నాయంటూ' ఆరోపణలు రావడంతో నెమ్మ దిగా ఆయా సంస్థల్లో ఎన్నికలు లేకుండా చేశారు. కానీ విద్యార్థి రాజకీయాలు బలంగా ఉన్నంతకాలం యూనివర్సిటీలలో చైతన్యం వెల్లి విరిసేది. ప్రగతిశీల చైతన్యం పరిమళించేది. ఆ పరిమళాలు మళ్ళీ వస్తాయా? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థి రాజకీయాలను ఆమోదిస్తారా? అన్నది చూడవలసి ఉన్నది. ''విశ్వవిద్యాలయాల్లో విద్యార్థి సంఘాల రాజకీయాలు చారిత్రక అవసరం. ప్రస్తుత రాజకీయాల్లో సైద్ధాంతిక భావజా లం ఉన్నవారు లేకపోవడం వల్లనే పార్టీ ఫిరాయింపులు జరుగుతున్నాయి'' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక కార్యక్రమంలో కీలక వ్యాఖ్యలు చేశారు. సాధారణంగా ఇలాంటి వ్యాఖ్యలు వామపక్ష భావజాలంతో పనిచేస్తున్న పార్టీల నాయకుల నుంచి తరచూ వస్తుంటాయి. కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ వంటి పార్టీల నాయకులు విద్యార్థి సంఘాల గురించి సానుకూలంగా మాట్లాడడం చాలా అరుదు.

బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ కు విద్యార్థులు, సంఘాలు, యూనివర్సిటీలు, రాజకీయాలు అంటే గిట్టదు అనే విమర్శలున్నాయి. ఆయన హయాంలో పదేండ్ల పాటు విశ్వవిద్యాలయాలు ఎలా నిర్లక్ష్యానికి గురయ్యాయో విద్యార్థులు, విద్యావంతులందరికీ తెలుసు. టిఆర్ఎస్ ఏర్పడ్డాక చాలాకాలం తర్వాత టిఆర్ఎస్‌వి పేరిట ఒక విద్యార్థి యూనిట్ ను పెట్టారు. అది కూడా టిఆర్ఎస్ కు సంబంధించిన మిగతా అనుబంధ సంఘాలలాగానే 'ఖాయిలా' పడినట్లే భావించారు. టిఆర్ఎస్ పార్టీ నిర్మాత కెసిఆర్ 'సర్వాంతర్యామి' కనుక మిగతా సంఘాలు నిర్వీర్యం కావడం సహజం. ''విద్యార్థి రాజకీయా ల్లో మూడోతరంలో ఎవరూ కనిపించడం లేదు. యూనివర్సిటీ లు ఉనికి కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయి. వాటికి పూర్వవైభవం కల్పించేందుకు మా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది'' అని ముఖ్యమంత్రి రేవంత్ అన్నారు.

తెలంగాణ విద్యారంగంలో భారీ సంస్కరణలు మొదలు పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ నిర్ణయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సిఎం రేవంత్ రెడ్డి విద్యారంగంపై తనదైన ముద్ర వేసేందుకు అడుగులు వేస్తున్నారు. ఐటిఐ కాలేజీలను అప్‌గ్రేడ్ చేసేందుకు ఇప్పటికే పనులు మొదలయ్యాయి. ఇంటిగ్రేడెట్ స్కూళ్ల ఏర్పాటు కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. 'స్కిల్ యూనివర్శిటీ' పేరుతో రేవంత్ రెడ్డి ఆలోచన సృజనాత్మకమైందని పలువురు మేధావులు, విద్యావంతులు అభిప్రాయపడుతున్నారు. స్కిల్ యూనివర్శిటీ అడ్మిషన్లు ప్రారంభించే అవకాశాలున్నవి. యువతకు అధునాతన పరిజ్ఞానాన్ని అందించేందుకు, వారిలోని నైపుణ్యాలకు పదును పెట్టేందుకు స్కిల్ యూనివర్శిటీ ఏర్పాటు చేస్తున్నారు. యూనివర్శిటీలో ఏయే కోర్సులు అందుబాటులో ఉండాలి, పాఠ్యాంశాలు ఎలా ఉండాలి, ఎప్పటినుంచి బోధన మొదలు పెట్టొచ్చు అనేదానిపై అధికారులు సమగ్ర నివేదిక రూపొందిస్తున్నారు. పోటీ ప్రపంచంలో యువతకు సాధారణ విద్యా నైపుణ్యాలతోపాటు అదనంగా ప్రత్యేక నైపుణ్యాలు ఉంటేనే ఉపాధి సులువు అవుతుంది. కొన్ని సందర్భాల్లో కంపెనీలే శిక్షణ పేరుతో నామమాత్రపు జీతానికి వారితో పనిచేయించుకుంటాయి. అదే శిక్షణ ముందుగానే తీసుకుంటే ఉద్యోగ అవకాశాలు మరింత సులభంగా లభిస్తాయి. అందుకే ఈ స్కిల్ యూనివర్శిటీ ఏర్పాటు చేస్తున్నట్టు తెలంగాణ ప్రభుత్వం చెబుతోంది. తన హయాంలో స్కిల్ యూనివర్శిటీ సాకారమైతే సిఎం రేవంత్ రెడ్డికి దేశ వ్యాప్తంగా మంచి గుర్తింపు రానుంది.

విద్యార్థి రాజకీయాల్లో సిద్ధాంతపరంగా రాణించిన వారు ప్రజా ప్రతినిధులుగా అధికారంలో ఉన్నా, లేకపోయినా నమ్మిన సిద్ధాంతం కోసం దశాబ్దాలపాటు జీవితాలను త్యాగం చేస్తారని చరిత్ర చెబుతోంది. ప్రజా సమస్యలపై విద్యార్థి సంఘాలు పోరాటాలు చేయడం వల్లనే చైతన్యం వస్తుంది. రాజకీయ పార్టీల పోరాటం కంటే, ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీల విద్యార్థులు ముందుండి ఉద్యమాలు చేయడం వల్లనే 'తెలంగాణ ఏర్పాటు' డిమాండుకు ఇంకా

బలం చేకూరింది. అలాంటి విద్యార్థి రాజకీయాలను తెలంగాణలో పునరుద్ధరించాల్సిన అవసరాన్ని ముఖ్యమంత్రి రేవంత్ గుర్తించారు. అన్ని పార్టీలూ విద్యార్థి రాజకీయాలను ప్రోత్సహించాలని కూడా ఆయన పిలుపునిచ్చారు.

భారత సామాజిక ఉద్యమాల చరిత్రలో తెలంగాణ విద్యార్థి ఉద్యమం చిరకాలం గుర్తుండిపోతుంది. తెలంగాణ విద్యార్థి ఉద్యమంపై పరిశోధనలు కూడా జరిగాయి. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమానికి ఉన్న పోరాటాల చరిత్ర వలన అది వివిధ భావజాలాలకు వేదికగా ఉంటూ వచ్చింది. విశాల ప్రజారాశులను ప్రభావితం చేసి తెలంగాణ ఉద్యమంలో కలుపుకుని పోవడం ద్వారా ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమం తెలంగాణ పది జిల్లాల్లో వివిధ యూనివర్సిటీల్లో, కాలేజీల్లో చదువుతున్న విద్యార్థుల వరకు తన 'నెట్వర్క్' ను విస్తరించుకుంది. నిజానికి అన్ని సామాజిక వర్గాల సమూహంగా విద్యార్థులు ఉన్నప్పటికీ విద్యార్థి వర్గాన్ని పెట్టీ బూర్జువా వర్గమని మార్క్సిస్టు పరిభాషలో అంటారు. తెలంగాణ విద్యార్థులు, ముఖ్యంగా ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు, విద్యార్థులకు ఉండే ఈ సాధారణ లక్షణానికి భిన్నంగా పనిచేశారు. విద్యార్థులలో వ్యవసాయ కూలీల కుటుంబాల నుంచి వచ్చినవాళ్లే ఎక్కువ. అందులో 90 శాతం విద్యార్థులు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ వర్గాలకు చెందినవాళ్లే. తెలంగాణ ఉద్యమం దాదాపు పదమూడేండ్ల పాటు నిలబడగలిగిందంటే ఈ ప్రత్యేక లక్షణం వల్లనే.

1969 లలో 'నక్సల్బరీ ఉద్యమం' నుంచి బలమైన విద్యార్థి నాయకత్వం సమాజానికి అందివచ్చింది. ఆ నాయకత్వమే తరువాత ఇక్కడ వచ్చిన అనేక సామాజిక విప్లవ ఉద్యమాలకు నాయకత్వం వహించింది. బ్రాహ్మణీయ, భూస్వామ్య పెట్టుబడిదారి విధానాల సంకెళ్ల నుంచి ప్రజలను విముక్తం చేసేందుకు వారు దారులు వేశారు. తెలంగాణ జిల్లాల్లోని ప్రతి గ్రామంలో వారు నాడు వేసిన ప్రభావం ఇంకా ఉంది. పైగా అదే నాయకత్వం దేశంలోని అనేక రాష్ట్రాల్లో 'మావోయిస్టు' ఉద్యమాన్ని ముందుండి నడిపిస్తోందన్న విశ్లేషణలు ఉన్నవి. అనేక సామాజిక, సాంస్కృతిక, రాజకీయ కారణాల వల్ల 1969 ఉద్యమంతో పోల్చితే 'ప్రత్యేక తెలంగాణ విద్యార్థి ఉద్యమానికి' పరిమితులు ఏర్పడ్డాయి. 2009 డిసెంబర్ నుంచి ఉద్యమం పూర్తిగా విద్యార్థుల నియంత్రణలో నడిచిందన్న వాదన ఉన్నది. ఈ వాదనతో బిఆర్ఎస్ నాయకులెవరూ ఏకీభవించకపోచ్చు. వాళ్లకు చరిత్ర అవసరం లేదు. కేవలం కెసిఆర్ కావాలి. ఆయన అడుగుజాడల్లో నడవాలి. ఆయనను దేవునిగా పూజించాలి.అంతే !

తెలంగాణ ఏర్పడితే కోస్తాంధ్ర మధ్యతరగతి వర్గం ఆక్రమించుకున్న జీవనోపాధి అవకాశాలు తమకు దక్కుతాయని వెనుకబడిన విద్యార్థులు అనుకున్నారు. అమాయక ఆంధ్ర సెటిలర్లను, బతుకుదెరువు కోసం వచ్చిన సీమాంధ్ర ప్రాంతం వారిని విద్యార్థులు ఏనాడూ ఏమీ అనలేదు. ఆధిపత్య దోపిడీ వర్గం, సీమాంధ్రకు చెందిన పెట్టుబడిదారులపై మాత్రమే దృష్టి సారించారు.బ్రాహ్మణీయ సంస్కృతికి వ్యతిరేకంగా కుల వ్యతిరేక ఉద్యమాన్ని నడపడంపై ఉస్మానియా విద్యార్థులు ప్రత్యేక దృష్టి పెట్టారు. సైద్ధాంతికంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ అనేది ఒక 'పెట్టీ బూర్జువా' డిమాండ్. అయితే, వివిధ రకాల సమస్యలు, వివిధ సెక్షన్ల ప్రజల ఆకాంక్షలు ఇందులో మిళితమై ఉండడం వలన ఇతర ప్రాంతీయ పోరాటాలతో పోల్చినప్పుడు భిన్నమైన కోణం కనిపిస్తుంది. తెలంగాణ ఉద్యమాన్ని అర్థం చేసుకోవాలంటే ఉస్మానియా విద్యార్థి ఉద్యమాన్ని అధ్యయనం చేయవలసిన అవసరం ఉన్నది. దాదాపు 1200 మందికి పైగా యువకులు చేసిన ప్రాణత్యాగాలు, బలిదానాలకు చరిత్రలో స్థానం లేకుండా 'కెసిఆర్ చావు నోట్లోకి పోయి వస్తేనే తెలంగాణ ఏర్పడింది' అనే ప్రచారానికి టిఆర్ఎస్ పెద్దపీట వేసింది. దాన్నే జనమంతా నమ్మేటట్లు ఆ పార్టీ బహుముఖంగా పనిచేసింది. 1996 లోనే వరంగల్‌లో మలిదశ తెలంగాణ ఉద్యమానికి బీజాలు పడ్డాయనే విషయాన్ని టిఆర్ఎస్ ఉద్దేశపూర్వకంగానే ప్రజలకు గుర్తు లేకుండా చేయడానికి కెసిఆర్ ఎన్నో పన్నాగాలు పన్నారు. 'కెసిఆర్ దీక్ష విరమణ' వార్త ఉస్మానియాలో ఎలాంటి దావానలం సృష్టించిందో అందరికీ తెలుసు. ఉస్మానియా యూనివర్సిటీ ఆవరణలో కెసిఆర్ శవయాత్రలు, దిష్టిబొమ్మ దగ్ధం వంటి కార్యక్రమాలు జరిగాయి. కనుక చరిత్ర అనేది కాగితం కాదు. చింపి వేస్తే చిరిగిపోదు.

తాజాగా రేవంత్ చేసిన వ్యాఖ్యలను 'మూడో తరం విద్యార్థి రాజకీయాల' నుంచి ఎదిగి వచ్చిన ప్రస్తుత మంత్రి, మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ లాంటి వాళ్ళు ముందుకు తీసుకువెళ్ళవలసి ఉన్నది. అయితే సిఎం.రేవంత్ మాట్లాడినంత సులభంగా విద్యార్థి రాజకీయా ల పునరుద్ధరణ సాధ్యం కాదు. ముఖ్యమంత్రి రేవంత్ ఆశిస్తున్న 'ప్రజాస్వామిక చర్య' ఊహించడానికి రంగుల కలలా ఉన్నది. కానీ 'రాజ్యం' ఇలాంటి చర్యలకు ఒప్పుకుంటుందా? ఎలాంటి అడ్డంకులు కల్పించవచ్చు? ఎలాంటి నిర్బంధం అమలుచేయవచ్చు? ఎలాంటి ఆంక్షలతో 'రాజ్యం' కొనసాగుతుంది? వంటి చాలా ప్రశ్నలున్నవి. శాంతిభద్రతలకు భంగం కలుగుతుందనే వాదనను 'రాజ్యాన్ని' కాపాడే పోలీసు, ఇతర బలగాలు ముందుకు తీసుకు వస్తాయి. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం రాజకీయ నాయకత్వం తీసుకునే నిర్ణయాలే అంతిమం. కానీ ఆచరణలో రాజకీయ నాయకత్వాన్ని నియంత్రించే లేదా అదుపుచేసే లేదా ఓవర్‌టేక్ చేసే దశకు పోలీసు, గూఢచారి వర్గాలు చేరుకొని మూడు దశాబ్దాలు గడచిపోయాయి.

> రాజ్యాంగ నిర్మాతలు పక్కన పెట్టిన మనుస్మృతిని తమ న్యాయశాస్త్ర విద్యార్థులకు పాఠ్యాంశంగా పెట్టాలని ఢిల్లీ విశ్వవిద్యాలయం నిర్ణయించింది. కోర్టులలో అమలు చేసే శిక్షాస్మృతులను పాఠాలుగా చెప్పాలి, శిక్షణ ఇవ్వాలి తప్ప ఇలాంటి చర్యలు అధికారికంగా మనువాదులను తయారు చేసే వ్యవహారం తప్ప మరొకటి కాదు.

మనువాదుల మనోభావాలకు చెంపపెట్టు!

ఎం. కోటేశ్వరరావు

ఉన్నది ఉన్నట్లు చెప్పినా తమ మనోభావాలను దెబ్బతీశారంటూ దెబ్బలాటలకు దిగుతున్న రోజులివి. తరతరాలుగా జరుగుతున్నదే. భూమి చుట్టూ సూర్యుడు తిరుగుతున్నాడని నాటి క్రైస్తవ మతగ్రంథాలు, జ్యోతిష గ్రంథాలు చెప్పినది వాస్తవం కాదని సూర్యుడి చుట్టూ భూమి తిరుగుతున్నదని నిరూపించిన ఖగోళశాస్త్రజ్ఞుడు నికోలస్ కోపర్నికస్‌పై ఐదు వందల సంవత్సరాల క్రితమే నాటి క్రైస్తవ మతవాదులు దాడి చేశారు, మూర్ఖుడని నిందించారు. చరిత్రలో ఏ మతవాదీ నిజాన్ని అంగీకరించిన దాఖలా లేదు. మన దేశంలో హిందూత్వ, ఇస్లామిక్, క్రైస్తవ మతవాదులు దానికి అతీతులు కాదు. అలాంటి వారికి 2025 జనవరి మొదటి వారంలో మద్రాస్ హైకోర్టు చెంపపెట్టులాంటి తీర్పు ఇచ్చింది. తమిళనాడులో విడుతలై చిరుతాయిగల్ కచ్చి(విసికె) అనే పార్టీ ఎంపి తిరుమవలన్. అతనిమీద 2020లో ఒక ప్రైవేటు కేసు నమోదైంది. అదేమిటంటే పెరియార్ అనే యూట్యూబ్ ఛానల్‌లో ఫిర్యాదుదారు ఒక కార్యక్రమాన్ని చూశారు. తిరుమవలన్ మరొక వ్యక్తితో కలసి హిందూ మహిళల గురించి బహిరంగంగా చెప్పిన మాటలు వారి స్థాయిని దిగజార్చేవిగా ఉన్నాయని, వారి గురించి ఒక తప్పుడు కథనాన్ని చెప్పారని, వాటిని విని ఒక హిందువుగా అవమానకరంగా భావించానని, తన మనోభావాలను దెబ్బతీసేవిగా ఉన్నందున తగిన చర్యలు తీసుకొని శిక్షించాలన్నది కేసు సారం. ఆ కేసులో పసలేదని దాన్ని కొట్టివేయాలంటూ తిరుమవలన్ హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. దానిమీద విచారణ జరిపిన న్యాయమూర్తి పి. వేలుమురుగన్ కేసును కొట్టివేస్తూ తీర్పు చెప్పారు. కరోనా సమయంలో పెరియార్ మరియు భారత రాజకీయాలు అనే అంశంపై యూరోపియన్ పెరియార్ అంబేద్కర్ కామ్రేడ్స్ ఫెడరేషన్ నిర్వహించిన అంతర్జాతీయ అంతర్జాల సమావేశంలో తిరుమవలన్ ప్రసంగించారు. దానిలో మనుస్మృతిలో ఉన్న కొన్ని అంశాలను ప్రస్తావించారు. అవి తమ మనోభావాలను దెబ్బతీశాయన్నది కేసు. అయితే తిరుమలన్ మనుస్మృతిలో ఉన్న అంశాలను ప్రస్తావించి వాటికి అర్థం చెప్పారు తానుగా కొత్తగా చెప్పిందేమీ లేనందున ఎలాంటి చర్య తీసుకోవనవసరం లేదంటూ న్యాయమూర్తి కేసును కొట్టివేశారు. తిరోగామి భావజాలం గురించి గతంలోనే అనేకమంది చీల్చి చెండాడారు. వాటిని పునశ్చరణ చేయవచ్చు, మరింతగా వివరించవచ్చు. అంతే కాదు ఈ తీర్పుతో ఒకటి స్పష్టమైంది. ఎవరినీ కొట్టావద్దు తిట్టావద్దు, పురాతన సంస్కృత గ్రంథాల్లో ఉన్న వాటి అసలు అర్థాలను చెబుతూ వాటిని జనంలోకి మరింతగా తీసుకువెళితే చాలు. ముంజేతిని చూసుకొనేందుకు అద్దాలు అవసరం లేదు.

ఇదే అంశంపై మద్రాస్ హైకోర్టులో దాఖలైన ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని 2020 నవంబరులో జస్టిస్ ఎం. సత్యనారాయణన్, జస్టిస్ ఆర్. హేమలత డివిజన్ బెంచి కొట్టివేసింది. ఎస్. కాశీరామలింగం దాఖలు చేసిన ఈ వ్యాజ్యంలో బిజెపి నేత, న్యాయవాది ఆర్‌సి పాల్ కనకరాజ్ వాదించారు. ఉనికిలో లేని మనుస్మృతిని నిషేధించాలని పార్లమెంటు సభ్యుడు కోరుతూ చేసిన ప్రసంగం అశాంతికి, వివిధ తరగతులను రెచ్చగొట్టటానికి దోహదం చేసినందున సభ్యత్వానికి అనర్హుడిగా ప్రకటించాలని కోర్టును కోరారు. ప్రసంగం చేయటమే గాక దాన్ని నిషేధించాలని కూడా డిమాండ్ చేశారన్నారు. మనుస్మృతి రాజ్యాంగబద్ధమైనదేమీ కాదని, అందువలన దాన్ని ఫలాన విధంగానే చదవాలనే నిబంధనేమీ లేదని, రెండువేల సంవత్సరాల నాటి గ్రంథానికి భాష్యాలు చెప్పవచ్చని అందువలన ఎంపిపై చర్య తీసుకోవాల్సిన అవసరం లేదని కోర్టు తీర్పు చెప్పింది. దానిలో చెప్పిన నైతిక నియమావళి రాజ్యాంగబద్ధం కాదని, వాటిని అమలు జరపలేమని న్యాయమూర్తులు పేర్కొన్నారు. వాద ప్రతివాదనల సందర్భంగా తమ పిటీషన్‌ను ఉపసంహరించుకొని రాజ్యాంగాన్ని ఉల్లంఘించిన అంశాలతో మరొక పిటీషన్ దాఖలు చేసేందుకు అనుమతించాలని న్యాయవాది పాల్ కనకరాజ్ కోర్టును కోరారు. చివరికి పిల్‌ను కోర్టు కొట్టివేసింది. ఈ అంశం మీదే జిల్లా కోర్టులో ఒక ప్రైవేట్ కేసును దాఖలు చేశారు. దాన్ని ఈ నెలలో హైకోర్టు కొట్టివేసింది.

బహుశా ఆ తమిళనాడు పిటీషనర్ మనుస్మృతిలో ఏమి రాసి ఉందో చదివి, అర్థం చేసుకొని ఉంటే నిజంగానే సిగ్గుపడి ఆ కేసు దాఖలు చేసి ఉండేవారు కాదు. ఆ గ్రంథాన్ని పరమ పవిత్రంగా పూజించేవారు ఉన్నారు. మద్రాస్ హైకోర్టు తీర్పు మరో ఉదంతాన్ని గుర్తుకు తెచ్చింది. కర్ణాటకలో మైసూరు విశ్వవిద్యాలయ విశ్రాంత ప్రొఫెసర్, ప్రముఖ రచయిత, హేతువాది కెఎస్.భగవాన్. రామాయణం ఉత్తరకాండలో ఉన్న వాటిని గురించి చెప్పినందుకు హిందూత్వవాదులు అంతుచూస్తామని బెదిరించారు. గత కొద్ది సంవత్సరాలుగా ఆయన ఈ అంశాలను చెబుతున్నారు. ఉత్తరకాండలో ఉన్నదాని ప్రకారం రాముడు పదకొండువేల సంవత్సరాలు పాలించలేదని, పదకొండు ఏళ్లు మాత్రమే రాజుగా ఉన్నట్లు, అడవుల్లో తాను మద్యం తాగుతూ సీతాదేవిని కూడా తాగమని కోరినట్లు, కొందరు రామరాజ్యం తెస్తామని చెబుతున్నారని, రాముడు ఆదర్శప్రాయుడేమీ కాదని భగవాన్ చెప్పిన అంశాలు తమ మనోభావాలను గాయపరచినట్లు కొందరు ప్రైవేటు కేసును దాఖలు చేశారు. సీతాదేవిని అడవుల పాల్జేసి పట్టించుకోని, శూద్రుడైన శంబుకుణ్ని వధించిన రాముడిని ఎలా సమర్థిస్తారని భగవాన్ ప్రశ్నించారు.'' ప్రొఫెసర్ కల్‌బుర్గి, గోవింద్ పన్సారే, నరేంద్ర దబోల్కర్‌లను హత్యచేసినవారు ఇప్పుడు నన్ను కూడా చంపుతామని బెదిరిస్తున్నారు, వారికి నేను చెప్పదలచుకున్నది ఒక్కటే, మీరు మా మీద దాడి చేయవచ్చు, ముక్కలుగా నరకవచ్చు కానీ మా రచనలు సజీవంగానే ఉంటాయి. వారు నన్ను చంపవచ్చు తప్ప నా వైఖరిని మార్చలేరు '' అని భగవాన్ స్పష్టం చేశారు. ఈ వివాదం తరువాత కొంతమంది అసలు ఉత్తరకాండను వాల్మీకి రాయలేదని, తరువాత కొందరు దాన్ని చేర్చారని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. రామాయణాలు అనేకం ఉన్నాయి. దేన్ని సాధికారికంగా తీసుకోవాలో చెప్పినవారెవరూ లేదు. ఎవరికీ అలాంటి సాధికారత లేదు. ఎవరైనా ఉంటే దానితో అంగీకరించాలని కూడా లేదు. మనుస్మృతిలో రాసినవి, వాటి ఆచరణ చూసి తన మనోభావాలు తీవ్రంగా గాయపడిన కారణంగానే బాబా సాహెబ్ అంబేద్కర్ వంద సంవత్సరాల క్రితమే దాన్ని తగులబెట్టి నిరస న వెల్లడించారు. సదరు మనువాదాన్ని మరింతగా ముందుకు తీసుకుపోవాలని, అది లేకుండా రచించిన రాజ్యాంగాన్ని విమర్శిస్తూ ఆర్ఎస్ఎస్ పత్రిక సంపాదకీయాలు రాసింది. ఆ చర్య మనోభావాలను దెబ్బతీయటమే కాదు, రాజ్యాంగాన్ని వ్యతిరేకించటం నేరం. రాజ్యాంగ నిర్మాతలు పక్కన పెట్టిన మనుస్మృతిని తమ న్యాయశాస్త్ర విద్యార్థులకు పాఠ్యాంశంగా పెట్టాలని ఢిల్లీ విశ్వవిద్యాలయం నిర్ణయించింది. కోర్టులలో అమలు చేసే శిక్షాస్మృతులను పాఠాలుగా చెప్పాలి, శిక్షణ ఇవ్వాలి తప్ప ఇలాంటి చర్యలు అధికారికంగా మనువాదులను తయారు చేసే వ్యవహారం తప్ప మరొకటి కాదు.

నూతన ఆర్థిక విధానాల పేరుతో కాంగ్ర

భారత గణతంత్ర వేడుకలకు ఇండోనేషియా అధ్యక్షుడు

న్యూఢిల్లీ : భారత 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవా సుబియాంటో ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈ విషయాన్ని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారికంగా గురువారం ప్రకటించింది. ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు ఇండోనేషియా అధ్యక్షుడు రిపబ్లిక్ వేడుకలకు హాజరవుతున్నట్లు తెలిపింది. ఈ క్రమంలో ఇండియాలో ఇండోనేషియా ప్రెసిడెంట్ జనవరి 25, 26 తేదీల్లో పర్యటించనున్నారు. 2024 అక్టోబర్‌లో ప్రబోవా సుబియాంటో ఇండోనేషియా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత.. భారత్‌లో ఆయన అడుగుపెట్టడం ఇదే తొలిసారి అని విదేశాంగ శాఖ ప్రకటించింది. ఈ పర్యటన రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మెరుగు పరిచేందుకు దోహద పడుతుందని తెలిపింది. ప్రాంతీయ, ప్రపంచ సమస్యలను చర్చించడానికి అవకాశాన్ని కల్పిస్తుందని విదేశాంగ శాఖ పేర్కొంది. సుబియాంటో 2020లో ఇండోనేషియా రక్షణ మంత్రిగా న్యూఢిల్లీని సందర్శించారు. కాగా 1950 నుంచి భారత్ తన మిత్ర దేశాల అధినేతలను గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆహ్వానించడం ఆనవాయితీగా వస్తోంది. 1952, 53, 66ల్లో మాత్రమే విదేశీ అతిథులు లేకుండా రిపబ్లిక్ డే వేడుకలను నిర్వహించారు. 2024లో ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మక్రాన్ ముఖ్య అతిథిగా రాగా.. 2023లో ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫట్టా ఎస్‌సిసిని అతిథిగా వచ్చారు. 2021, 2022 సంవత్సరాల్లో కరోనా కారణంగా గణతంత్ర దినోత్సవ వేడుకలకు అతిథులను ఆహ్వానించలేదు. అంతకు ముందు 2020లో బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారో, 2019లో దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2018లో ఆసియా దేశాలకు చెందిన 10 మంది నాయకులు వచ్చారు. 2017లో అబుదాబి క్రౌన్ ప్రిన్స్ షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ రాగా.. 2016లో ఫ్రెంచ్ అప్పటి అధ్యక్షుడు ఫ్రాంకోయిస్ హోలాండే, 2015లో అప్పటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా భారత గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. 2007లో పుతిన్(రష్యా), 2008లో నికోలస్ సర్కోజీ(ఫ్రాన్స్) హాజరయ్యారు.

శ్రీలంకలో చైనా భారీ పెట్టుబడి

3.7 బిలియన్ డాలర్లతో ఆయిల్ రిఫైనరీ
చైనాలో శ్రీలంక అధ్యక్షుడి పర్యటనలో ఎంఒయు

కొలొంబొ : చైనాలో నాలుగు రోజుల పర్యటనలో ఉన్న శ్రీలంక అధ్యక్షుడు అనుర దిసనాయకె భారీ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను సాధించారు. శ్రీలంకలో అత్యాధునిక చమురు శుద్ధి కర్మాగారం ఏర్పాటుకు 3.7బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టేందుకు చైనా సంస్థలు అంగీకరించాయి. ఇప్పటివరకు ఆ దేశంలో ఇదే అది పెద్ద ఎఫ్‌డిఐ. హంబన్‌టొట ప్రాంతంలో 2 లక్షల బ్యారల్స్ సామర్థ్యంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చమురు శుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటు చేసేందుకు ఒప్పందం కుదురింది. ఈ మేరకు ప్రముఖ చైనా అంతర్జాతీయ పెట్రోలియం కార్పొరేషన్ సినోపెక్‌తో శ్రీలంక ఇంధన మంత్రిత్వ శాఖ గురువారం నాడు ఒప్పందంపై సంతకాలు చేసింది. ఉత్పత్తి చేసిన చమురులో అత్యధిక భాగం ఎగుమతి చేయడం ద్వారా శ్రీలంక విదేశీ మారకం నిల్వలను పెంచుకునేందుకు ప్రణాళికలు రూపొందించబడింది. చైనాకు చెందిన ఈ భారీ పెట్టుబడి ద్వారా శ్రీలంక ఆర్థికాభివృద్ధి పెంపొందడంతో పాటు హంబన్‌టొటా ప్రాంతంలో స్వల్ప ఆదాయ వర్గాల జీవనోపాధి మెరుగవుతుందని, అలాగే భవిష్యత్తులో మొత్తం శ్రీలంక ఆర్థికాభివృద్ధిపై సానుకూల ప్రభావం చూపుతుందని శ్రీలంక అధ్యక్ష కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించింది. ఒప్పందంపై సంతకాల కార్యక్రమంలో శ్రీలంక విదేశాంగ , కార్మిక, పర్యాటక మంత్రి విజిత హిరాత్, రవాణా, హైవేలు, పోర్టులు, పౌర విమానయాన మంత్రి బిమల్‌రత్ననాయకె తదితరులు పాల్గొన్నారు.

శ్రీలంక సార్వభౌమత్వానికి కట్టుబడి ఉన్నాం : చైనా

శ్రీలంక సార్వభౌమత్వం, సరిహద్దు సమగ్రత, స్వాతంత్రానికి మద్దతు కొనసాగించేందుకు చైనా కట్టుబడి ఉన్నదని నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్‌ఆఫ్ చైనా స్టాండింగ్ కమిటీ చైర్మన్ జావో లెజీ అన్నారు. శ్రీలంక అధ్యక్షుడు అనుర దిసనాయకెతో గురువారం నాడు ఆయన సమావేశమైన సందర్భంగా ఈ ప్రకటన చేశారు. శ్రీలంకతో నిరంతరం, సమన్వయ విధానంలో పని చేయడం చైనా నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ జావో తెలిపారు. అలాగే చైనాలో ప్రముఖ కంపెనీలతో దిసనాయకె గురువారం నాడు సమావేశమయ్యారు. చైనాకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు ఏర్పాటు చేసిన ఇన్వెస్ట్‌మెంట్ ఫోరమ్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో చైనా కమ్యూనికేషన్స్ కన్స్‌ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్(సిసిసిసి), చైనా పెట్రోకెమికల్ కార్పొరేషన్ (సినోపెక్‌గ్రూప్), మెటలర్జికల్ కార్పొరేషన్ ఆఫ్ చైనా లిమిటెడ్ (ఎంసిసి), హ్యూవావై, బివైడి ఆటో కంపెనీలు హాజరయ్యాయి. శ్రీలంకలో పెట్టుబడులకు గల అవకాశాలను దిసనాయకె ఈ సందర్భంగా ఆ కంపెనీలకు వివరించారు. తమ ప్రభుత్వం నుంచి అవసరమైన అని వసతులు కల్పిస్తామని, పెట్టుబడిదారులకు మద్దతివ్వడం ద్వారా వ్యాపార అనుకూల వాతావరణం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

చైనా అధ్యక్షుడితో భేటీ : కాగా నాలుగు రోజుల (జనవరి 14–17 తేదీలలో) పర్యటననిమిత్తం చైనాకు వెళ్ళిన శ్రీలంక అధ్యక్షులు అనుర దిసనాయకెకు బుధవారం నాడు చైనా అధ్యక్షుడు జీ జిన్ పింగ్ ఘన స్వాగతం పలికారు. సంప్రదాయగన్ సెల్యూట్‌తో ఆయనను సాదరంగా ఆహ్వానించారు. వారిరువురు గ్రేట్ హాల్ ఆఫ్ పీపుల్స్‌లో సమావేశమయ్యారు. శ్రీలంక నూతన అభివృద్ధి శకంలో కలిసి పని చేసేంపదకు చైనా కట్టుబడి ఉందని జీ జిన్ పింగ్ ఈ సందర్భంగా తెలిపారు. ఇరు దేశాల మధ్య సుదీర్ఘకాలం సంబంధాలను గుర్తు చేస్తూ, దశాబ్దాలుగా సన్నిహిత స్నేహం ఉన్నదని పేర్కొన్నారు. అధికారిక సమావేశం అనంతరం ఇరు పక్షాలు పలు కీలక అవగాహన పత్రాలపై సంతకాలు చేశాయి. ఆర్థిక,ం, సామాజిక అభివృద్ధి, పరిశ్రమల రంగాలలో సహకారాన్ని బలోపేతం చేసే ఒప్పందాలు అందులో ఉన్నట్లు శ్రీలంక అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది.

రూ.500కే గ్యాస్ సిలిండర్

న్యూఢిల్లీ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఓటర్లపై హామీల వర్షం కురిపించింది. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఢిల్లీ వాసులకు రూ.500కే వంట గ్యాస్ సిలిండర్, 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఉచితంగా రేషన్ కిట్స్‌ను అందిస్తామని వాగ్దానం చేసింది. ఈ విషయాన్ని ఎఐసిసి ఢిల్లీ ఇన్‌ఛార్జ్ ఖాజీ నిజాముద్దీన్, కాంగ్రెస్ చీఫ్ దేవేందర్ యాదవ్ కలిసి తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి గురువారం విలేకరుల సమావేశంలో ప్రకటించారు. హామీలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అన్నీ హామీలను నెరవేరుస్తుందని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని, ఢిల్లీలో కూడా అదే జరుగుతుందని తెలిపారు. అందుకు కాంగ్రెస్ పార్టీకి ఢిల్లీ ప్రజలు ఒక అవకాశం ఇవ్వాలని రేవంత్ రెడ్డి కోరారు. తెలంగాణలోని తన ప్రభుత్వం ఒక సంవత్సరంలో రూ.21,000 కోట్ల రైతు రుణాలను మాఫీ చేసిందని కూడా ఆయన అన్నారు. 'ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ మధ్య ఎటువంటి తేడా లేదని, వారు దేశ రాజధానికి ఏమీ చేయలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. కాగా, కాంగ్రెస్ పార్టీ గురువారం మరో రెండు హామీలను ప్రకటించింది. దీంతో హామీల సంఖ్య ఐదుకు చేరుకుంది.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు

ఢిల్లీలో మహిళల కోసం 'ప్యారీ దీదీ యోజన'ను కాంగ్రెస్ జనవరి 6న ప్రకటించింది. తాము అధికారంలోకి వస్తే ప్రతినెలా రూ.2,500 మహిళలకు ఆర్థిక సాయంగా ఇస్తామని హామీ ఇచ్చింది. ఢిల్లీ ప్రజల కోసం 'జీవన్ రక్ష యోజన'ను ఈ నెల 8న కాంగ్రెస్ ప్రకటించింది. దీని కింద రూ.25 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా ఇస్తామని పేర్కొంది. ఢిల్లీలోని నిరుద్యోగ యువత కోసం 'యువ ఉడాన్ యోజన'ను ప్రకటించింది. నిరుద్యోగ యువతకు ప్రతి నెలా రూ. 8,500 చొప్పున ఒక ఏడాది పాటు ఇస్తామని జనవరి 12న హామీ ఇచ్చింది. మరోవైపు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ ఐదో జాబితాను గురువారం విడుదల చేసింది. తద్వారా, మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. ఇక దిల్లీ శాసనసభకు ఫిబ్రవరి 5న ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. ఫిబ్రవరి 8న ఫలితాలు వెలువడనున్నాయి. ఆప్, బిజెపి మధ్య ప్రధానంగా పోటీ నెలకొనగా సత్తా చాటేందుకు కాంగ్రెస్ తన వంతు ప్రయత్నాలు చేస్తోంది.

'హస్తిన' ఆశాదీపం ఎవరు?

ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీస్తున్న తరుణంలో నగరవాసులు ఆందోళన
కాలుష్య తీవ్రత, సవాలక్ష సమస్యల చెరలో ఢిల్లీ ప్రజలు- చేతులెత్తేసిన ప్రభుత్వాలు

న్యూఢిల్లీ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పరిష్కారానికి నోచుకోకుండా అస్తవ్యస్తంగా ఉన్న పౌర సమస్యలపై ప్రజలు ఆందోళనలు చేపట్టారు. పేరుకే దేశ రాజధాని కానీ ఢిల్లీపై పాలకులు 'సవతితల్లి ప్రేమ'ను ప్రదర్శిస్తున్నారని దుమ్మెత్తి పోస్తున్నారు. ఢిల్లీ ప్రజలకు కాలుష్య సమస్య తీవ్రతలనొప్పిగా మారుతోంది. కాలుష్యనియంత్రణలో ప్రభుత్వాలు చేతులెత్తేయడం ప్రజలను తీవ్రంగా కలచివేస్తోంది. ఫిబ్రవరి 5న ఢిల్లీ శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో దేశ రాజధాని అంతటా ఢిల్లీ నివాసితులు అధ్వాన్న రహదారి పరిస్థితులు సహా అనేక పౌర సమస్యలు, నీటి నాణ్యత, కాలుష్య తీవ్రత సమస్యలపై ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈశాన్యఢిల్లీలోని సీలంపూర్ నివాసి మహమ్మద్ సాదిఖ్ ప్రస్తుతం తీవ్రసమస్యగా ఉన్న కలుషిత నీటి సమస్యను ఎత్తిచూపారు. 'మాకు కరెంట్ ఉంది. కానీ నీటి నాణ్యత చాలా తక్కువగా ఉంది. మేము తాగునీటికోసం, వంట చేయడానికి నీటిని కొనుక్కోవాలి. రోజుకు రూ.30నుండి రూ. 50వరకు నీటికోసమే ఖర్చు చేయాల్సి వస్తోంది. మా ప్రాంతంలోని రోడ్లు అధ్వాన్నంగా ఉండటం మరొక సమస్య. రానున్న ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరిస్తుంది' అని మేం భావిస్తున్నాం అని సాధిక్ చెప్పారు.ఈశాన్య ఢిల్లీలోని హర్‌దేవ్ పురి, దుర్గాపురికి చెందిన మరొక నివాసి హర్ష్‌త్యాగి మాట్లాడుతూ ఢిల్లీలో తమకు అనేక సమస్యలు ఉన్నాయన్నారు. ఇరుకైన వీధులు, పార్కింగ్ లేకపోవడం, పచ్చదనం ఏమాత్రం లేకపోవడం తదితర సమస్యలను ఆయన ఏకరువు పెట్టారు. త్యాగి మాట్లాడుతూ కాలుష్యస్థాయిలు తమ ప్రాంతంలో తీవ్ర స్థాయిలోనే ఉందని, అందుకు చెట్లు లేకపోవడమే కారణం అన్నారు. ఇరుకైన వీధుల వల్ల పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉన్నదన్నారు. అంతేకాకుండా సరైన డ్రైనేజీ విధానం లేక కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. వాయవ్య ఢిల్లీకి చెందిన నిషాశర్మ మాట్లాడుతూ దెబ్బతిన్న రహదారుల వల్ల ప్రజలు తీవ్ర కష్టాలను ఎదుర్కొంటున్నారని, రోడ్లపై పశువులు కూడా విచ్చలవిడిగా తిరగడం ప్రమాదాలకు కారణమవుతున్నాయని చెప్పారు. విద్యుత్, స్వచ్ఛమైన నీటి లభ్యత ఉన్నప్పటికీ, రహదారుల పరిస్థితి చాలా దారుణంగా ఉన్నదని, అడుగడుగునా గుంతలతో ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతమని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రధాన రహదారులు బాగానే ఉన్నప్పటికీ త్రినగర్, వజీర్‌పూర్‌లోని రోడ్లు చాలా దారుణస్థితిలో ఉన్నాయన్నారు. విచ్చలవిడిగా కెమెరాలు ఒక సవాల్‌గా మారింది. ఈ ప్రాంతం గుండా నావిగేట్ చేయడం కష్టతరంగా మారిందని నిషాశర్మ వివరించారు. న్యూఢిల్లీ నేచర్ సొసైటీ వ్యవస్థాపకుడు, పర్యావరణ న్యాయవాది వెర్నియన్ ఖన్నా మాట్లాడుతూ వ్యర్థాలను బాగాబాగా తగ్గించి, చెట్లను పెంచినట్లయితే కాలుష్యాన్ని అధికశాతం మేరకు నియంత్రించవచ్చని ఆయన పచ్చదనం ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. 'మేం తక్కువ మొత్తంలో చెత్తను ఉత్పత్తి చేయాలి. ప్రత్యేకించి ప్లాస్టిక్ వ్యర్థపదార్థాలను నివారించాలి. కొన్ని రకాల చెత్తను మనం ఎలాగూ నివారించలేం. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను పారవేసేందుకు మాకు సరైన, ప్రత్యేక మార్గాలు అవసరం. బయోడీగ్రేడెబుల్ వ్యర్థాలను ఎరువులుగా మార్చవచ్చు' అని ఖన్నా చెప్పారు. 'మా కాలనీలో, పార్కులో మూడు గుంతలు ఏర్పాటు చేశాం. ఆ ప్రాంత ప్రజలనుంచి సేకరించిన బయోడీగ్రేడెబుల్ వ్యర్థాన్ని మేం ఎరువులుగా మారుస్తున్నాం' అని ఆయన తెలియజేశారు.వర్షాకాలంలో డ్రైనేజీ తీవ్రస్థాయిలో పొంగిపొర్లుతున్నదని ఛాత్రపూర్‌కు చెందిన ఖుష్బూ తివారీ ఆందోళన వ్యక్తం చేశారు. మెహ్రౌలీగుర్‌గావ్ రోడ్డులో ముఖ్యంగా ప్రధాన సమయాలలో పెద్దయెత్తున ట్రాఫిక్ అంతరాయం ఏర్పడటం వల్ల నరకయాతన అనుభవిస్తున్నామని , దానికితోడు డ్రైనేజీ విధానం దెబ్బతిని వర్షాకాలంలో మురుగునీరు రోడ్లపైకి ప్రవహిస్తున్నదని, దీంతో నివాసుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉన్నదని ఆమె చెప్పారు. ఇండ్ల దగ్గర విద్యుత్ స్తంభాలు, వైర్లు వేలాడుతున్నాయని, అందువల్ల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోందని ఆమె ఆవేదన వ్యక్తంచేశారు. నివాసులకు అందుబాటులో పార్కులే లేవని ఆరోపించారు. దేశరాజధాని ఢిల్లీలో ఆనంద్‌విహార్ తర్వాత విమానాశ్రయం ఉన్నటువంటి పాలం అత్యంత కాలుష్య ప్రాంతమని చెప్పారు.జనసాంద్రత పెరుగుతున్న కారణంగా అనేకరూపాలలో వ్యర్థాల సృష్టికి దారితీస్తోందని ఇది గణనీయమైన నష్టాన్ని కలిగిస్తోందని సెంటర్ ఫర్ హోలిస్టిక్ డెవలప్‌మెంట్ (సిహెచ్‌డి) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్ కుమార్ అలేడియా తెలియజేశారు.వాతావరణ మార్పు సమస్యను సక్రమంగా పరిష్కరించకపోవడం వల్ల సమాజంపై తీవ్రప్రభావం పడుతున్నదని ఆయన అన్నారు.దేశరాజధాని ఢిల్లీలో వామనాలకు సంబంధించి సరైన ప్రణాళికను ప్రభుత్వం రూపొందించని ఫలితంగావాహనదారులతోపాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సునీల్‌కుమార్ అలేడియా ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఫిబ్రవరి 5న జరుగనున్నాయి. ఓట్ల లెక్కింపు ఫిబ్రవరి 8న జరుగనుంది. ఆ తర్వాత ఢిల్లీలో కొత్త ప్రభుత్వం కొలువుతీరనుంది.

బొగ్గు కుంభకోణం కేసుల విచారణ నుంచి...
తప్పుకున్న జస్టిస్ కెవి.విశ్వనాథన్ !

బెంచ్ పునర్నిర్మాణానికి భారత ప్రధానన్యాయమూర్తి(సిజెఐ)కి మార్గంసుగమం

న్యూఢిల్లీ : బొగ్గు కుంభకోణం కేసుల విచారణ నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కెవి.విశ్వనాథన్ గురువారం తనకు తానుగా తప్పుకున్నారు. అప్పీళ్లను స్వీకరించకుండా హైకోర్టును నిరోధించే గత ఉత్తర్వుల నుండి ఉత్పన్నమయ్యే కీలకమైన సమస్యను నిర్ణయించడానికి తాజా ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనానికి మార్గం సుగమం చేస్తుంది. బొగ్గు కుంభకోణం నిందితులు హైకోర్టును ఆశ్రయించకుండా 2014, 2017సంవత్సరాలలో అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు రెండు ఉత్తర్వులను జారీ చేసింది. బొగ్గు కుంభకోణం కేసుల్లో ట్రయల్ కోర్టు విచారణకు వ్యతిరేకంగా అప్పీళ్లను మాత్రమే దాఖలు చేయాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఆలస్యాలను నివారించడం ద్వారా విచారణప్రక్రియను వేగవంతం చేయడం,నిందితులు హైకోర్టులలో ఉపశమనం కోరుతూ చేసే విచారణను నిలిపివేయడం ఈ ఉత్తర్వులు జారీచేయడం వెనుక ఉన్న ముఖ్యోద్దేశం. గతంలో ఇచ్చిన ఆదేశాలను సవరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని న్యాయమూర్తులు సంజయ్‌కుమార్, కెవి.విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఫిబ్రవరి 10వ తేదీనుంచి ప్రారంభమయ్యే వారంలో ఈ అంశంపై నిర్ణయం తీసుకోవడానికి తాజా ధర్మాసనాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. జస్టిస్ విశ్వనాథన్ కామన్ కాజ్‌లో (బొగ్గు కుంభకోణం కేసుల్లో పిల్ (పిఐఎల్) దాఖలు చేసిన ఎన్‌జిఓలో) ఉన్నారని చెప్పారు. ఈ కేసు ఇడి (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కు)చెందింది. కానీ ఇప్పటికీ అప్పీల్ల పరిధిని ఈ కేసులను విచారించకుండా హైకోర్టులను ఆశ్రయిస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులు వర్తింపుపై చర్చించిన ధర్మాసనం 2014, 2017లో హైకోర్టు నిషేధించకుండా విధించిన తీర్పులకు సంబంధించిపెండింగ్‌లో ఉన్నటువంటి అన్ని పిటీషన్ల సంకలనాన్ని సిద్ధం చేయాలని సుప్రీంకోర్టు రిజిస్ట్రీని కోరింది. రిజిస్ట్రీ 2014, 2017లో ఈ కోర్టు తీర్పుపరంగా ప్రత్యేక సెలవు పిటిషన్లపై (ఎస్‌ఎల్‌పి)దాఖలు చేయబడిన అన్ని కేసుల సంకలనాన్ని సిద్ధం చేస్తుంది. తాజా బెంచ్ జస్టిస్ కెవి.విశ్వనాథన్‌ను మినహాయించి 2025, ఫిబ్రవరినుండి ప్రారంభమయ్యే వారంలో ఏర్పడుతుంది. కీలకమైన ప్రశ్న, విచారణను నిలిపివేయాలని కోరుకునే వ్యక్తి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సిఆర్‌పిసి) సంబంధించిన విధానానికి వెళ్లరు. బదులుగా సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటీషన్ (ఎస్‌ఎల్‌పి) దాఖలు చేస్తారా అని తన ఉత్తర్వుల్లో పేర్కొంది. విచారణ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) తరపున హాజరైన సీనియర్ అడ్వకేట్ మణిందర్ సింగ్ మాట్లాడుతూ పిఎంఎల్‌ఎ కింద 45ఫిర్యాదులు, సప్లిమెంటరీలు పెండింగ్‌లో ఉన్నాయని కోర్టుకు తెలియజేశారు. ఆయనపై 20 కేసులు సుప్రీంకోర్టులో ఉన్నాయి. సిబిఐ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది ఆర్‌ఎస్.చీమా మాట్లాడుతూ సిబిఐ ప్రాసిక్యూట్ చేస్తున్న 50 కేసుల్లో 30కేసులను ఖరారు చేశామని తెలియజేశారు. అప్పీళ్లను హైకోర్టుకు లేదా సుప్రీంకోర్టుకు వెళ్లాలా ? అనే దానిపై స్పష్టత అవసరమని చీమా నొక్కిచెప్పారు. విధివిధానాలను క్రమబద్ధీకరించాల్సిన ఆవశ్యకతను బెంచ్ నొక్కిచెప్పింది. డిశ్చార్జ్ ఉత్తర్వులపై అప్పీళ్ల వద్ద పేర్కొంటూ హైకోర్టుకు వెళ్లాలని పేర్కొంది. ఎన్‌జిఒ 'కామన్ కాజ్'తరపున హాజరైన సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ ఉన్నత న్యాయస్థానానికి సంబంధించిన అధికార పరిధి ప్రాథమికంగా ట్రయల్స్‌పై ఉన్నటువంటి స్టేలను పరిష్కరించాలని, ఇతర విషయాలను ఉన్నతస్థాయిలో పరిష్కరించవచ్చని నొక్కిచెప్పారు. దీనికిముందు ధర్మాసనం సిబిఐని ప్రశ్నించింది. 'అవన్నీ మావద్దకు రావాలనే సిబిఐ స్టాండ్ ఇదేనా?' అని ధర్మాసనం ప్రశ్నించింది.'ఈ కేసుల్లో ఢిల్లీ హైకోర్టు ఆదేశాల ప్రయోజనాలను కూడా పొందాలని మేం కోరుకుంటున్నాం' అని ధర్మాసనం తెలిపింది.1993, 2010మధ్యకాలంలో కేంద్రం కేటాయించిన 214బొగ్గు బ్లాక్‌లను ప్రజాప్రయోజన వ్యాజ్యాలను (పిల్)లను పరిగణనలోనికి తీసుకున్న తర్వాత 2014లో సుప్రీంకోర్టు రద్దు చేసింది. ప్రత్యేక సిబిఐ న్యాయమూర్తి ద్వారా ట్రయల్‌కు ఆదేశించింది. స్టే కోసం లేదా దర్యాప్తు లేదా విచారణకు ఆటంకం కలిగించే ప్రార్థనలు సుప్రీంకోర్టు ముందు మాత్రమే చేయవచ్చని బెంచ్ ఆదేశించింది. ఇతర కోర్టులు అటువంటి అభ్యర్థనలను స్వీకరించకుండా సమర్థవంతంగా నిషేధించాయి. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా నేతృత్వంలోని మరో ధర్మాసనం అంతకుముందు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)కు నోటీస్ జారీ చేసింది. దాని పూర్వ నిర్ణయం ద్వారా విధించిన నిషేధం ఏదైనా ప్రార్థనపై స్టే కోసం నిషేధించబడుతుందా ? లేదా? అని ప్రశ్నించింది. సుప్రీంకోర్టుకు బొగ్గు క్షేత్రాల కేటాయింపు కేసుల్లో దర్యాప్తు లేదా విచారణ పురోగతికి ఆటంకం కలిగిస్తుందా అనే దానిపై స్పష్టత ఇవ్వాలని కోరింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ) కింద దాఖలైన ఫిర్యాదులకు మాత్రమే వర్తిస్తుందనివర్తిస్తుందని పేర్కొంది.

ఒఎంఆర్ పద్ధతిలో
'నీట్ యుజి'

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్ యుజి పరీక్షలు నిర్వహణపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. పెన్, పేపర్ పద్ధతిలోనే నిర్వహించనున్నట్లు ప్రకటించింది. దేశమంతా ఒకే రోజు.. ఒకే షిఫ్టులో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. కేంద్ర విద్య, ఆరోగ్యశాఖల మధ్య సుదీర్ఘ సంప్రదింపుల అనంతరం చివరకు ఒఎంఆర్ పద్ధతిలో నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపింది. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసి) నిర్ణయం ప్రకారం.. నీట్ యుజి పరీక్ష పెన్, పేపర్ పద్ధతిలో నిర్వహిస్తాం. ఒకేరోజు, ఒకే షిఫ్టులో ఈ పరీక్ష ఉంటుంది అని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) అధికారి వెల్లడించారు. దేశంలో అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు హాజరయ్యే పరీక్షగా నీట్ యుజి నిలుస్తోంది. 2024లో 24 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్ష రాశారు. జెఇఇ మెయిన్ తరహాలోనే ఈసారి (2025) కూడా నీట్ యుజిని ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలని ఎన్‌టిఎ భావిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఇస్రో మాజీ చైర్మన్ కస్తూరి రంగన్ చైర్మన్‌గా నియమించిన నిపుణుల కమిటీ సైతం ఆన్‌లైన్ విధానం (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సిబిటి)లో నీట్ నిర్వహించాలని సిఫారసు చేసింది. అయితే, తాజాగా కేంద్ర విద్య, ఆరోగ్యశాఖలు జరిపిన విస్తృత చర్చల్లో ఓఎంఆర్ పద్ధతికే మొగ్గుచూపుతూ నిర్ణయం తీసుకున్నారు.

కేరళలో పూజారి సజీవ సమాధి
మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు

తిరువనంతపురం: కేరళలోని ఆలయ పూజారి గోపన్ స్వామి.. ఇటీవల సజీవ సమాధి అయ్యారు. అయితే ఆ పూజారి మృతదేహాన్ని గురువారం సమాధి నుంచి పోలీసులు వెలికితీశారు. తిరువనంతపురం జిల్లాలోని నెయ్యటింకర గ్రామంలో ఆ పూజారి సమాధి అయినట్లు కుటుంబసభ్యులు చెబుతున్నారు. పూజారి సజీవ సమాధి అయినట్లు జనవరి 10వ తేదీన పోస్టర్లు వెలిశాయి. దీంతో గ్రామస్థులు ఆ సమాధిపై అనుమానాలు వ్యక్తం చేశారు. గోపన్ స్వామి కోరిక మేరకు సమాధి కట్టినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కానీ గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసును పోలీసులు నమోదు చేశారు. గురువారం భారీ సంఖ్యలో పోలీసులు ఆ సమాధి వద్దకు వచ్చి .. దాంట్లో నుంచి శవాన్ని బయటకు తీశారు. కూర్చుని ఉన్న పూజారి దేహాన్ని.. పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని వెలికి తీయరాదు అని కుటుంబం వేదుకున్నా.. కేరళ హైకోర్టు ఆదేశాల ప్రకారం సమాధి నుంచి పూజారి శవాన్ని బయటకు తీశారు. ఫోరెన్సిక్, వేలిముద్ర నిపుణులు సమాధి సైట్ వద్దకు చేరుకున్నారు. జనవరి 9వ తేదీన రాత్రి తన తండ్రి సజీవ సమాధి అయినట్లు రాజసేనన్ తెలిపారు. ప్రైవేటుగా ఆ కార్యక్రమాన్ని నిర్వహించ

పార్వతమ్మకు పలువురు నివాళులు

ప్రజాపక్షం/మునుగోడు: సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం తల్లి నెల్లికంటి పర్వతమ్మ అనారోగ్యంతో మృతి చెందారు గురువారం ఎలుగలగూడెం గ్రామంలో ఐఎఎల్ జాతీయ జనరల్ సెక్రెటరీ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, 'ప్రజాపక్షం' దినపత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ బొమ్మగాని కిరణ్, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్ నేత, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నారి అయిలయ్య, నల్లగొండ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పంకజ్ యాదవ్, ఎల్‌వి యాదవ్, మునుగోడు మాజీ జెడ్పిటిసి జాజుల అంజయ్య గౌడ్, తదితరులు పార్వతమ్మ చిత్రపటానికి పూలమాల లేసి నివాళులర్పించారు.అనంతరం జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు తీర్పరి వెంకటేశ్వర్లు, జిల్లా సమితి సభ్యులు సురిగి చలపతి, కట్కూరి లింగస్వామి పాల్గొన్నారు.

తప్పలు దొర్లకుండా రైతుభరోసా సర్వే

ప్రజాపక్షం/మునగాల: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా పథకంలో భాగంగా ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా సర్వే చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. గురువారం మండలంలోని మాధవరం, రేపాల, కలకోవ, గణపవరం రెవిన్యూ గ్రామాల్లో రెవిన్యూ అధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు, పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సర్వేను ఆయన మాధవరం గ్రామాన్ని సందర్శించి సర్వేను పరిశీలించారు. వ్యవసాయానికి యోగ్యం కాని భూములను గుర్తించే ప్రక్రియలో ఫీల్డ్ సర్వే విచారణ చేయాలన్నారు. ఈ సర్వే ఈనెల 20వ తేదీలోగా పూర్తి చేయాలని, 21 నుండి 24వ తేదీ వరకు వ్యవసాయ యోగ్యంకాని భూములను జాబితాను అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రచురించి తుది జాబితా తయారు చేయాలన్నారు. ఈ సర్వే పరిశీలనలో కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, మండల స్పెషల్ ఆఫీసర్, డిప్యూటి సిఈవో శీరిష, తహసిల్దార్ ఆంజనేయులు, ఎంపీడీఓ రమేష్ దీన్‌దయాల్, వ్యవసాయాధికారి రాజు, ఎఇవో భవాని, నాగు, రమ్య, రేష్మా, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే నిర్వహించాలి

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి: రైతు భరోసా కోసం చేపడుతున్న వ్యవసాయ భూముల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి అధికారులకు సూచించారు. సర్వే నెంబర్ వారిగా సర్వే చేసి వ్యవసాయ యోగ్యం కాని భూములను, సాగు భూములను రెవెన్యూ అధికారులు, వ్యవసాయ అధికారులు మండల వ్యాప్తంగా గుర్తిస్తున్నారు. ఈ సర్వేను గురువారం ఆర్డీవో మండల పరిధిలోని దోనియాల, చెన్నారం, చెన్నమనేనిపల్లి గ్రామాలకు వెళ్ళి అధికారులు చేస్తున్న సర్వేను పరిశీలించారు. గతంలో వ్యవసాయ యోగ్యంగా ఉండి, తర్వాత వెంచర్లుగా మారిన భూములను, వ్యవసాయ యోగ్యంలో లేని భూములను గుర్తించి పారదర్శకంగా రిపోర్టు ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో జానకిరాములు, ఏఈవో సురేష్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు సెలవులో వెళ్తే సమాచారం అందించాలి

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, అధికారులు సెలవుల్లో వెళ్తే సమాచారం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలం అన్నారు. గురువారం పట్టణంలోని గిరినగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. డాక్టర్ గిరి ప్రసాద్ సెలవులో ఉండి సెలవు పత్రం లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ గిరి ప్రసాద్ సెలవులో ఉండడంతో మరో వైద్యులు డాక్టర్ శశాంక్ విధులు నిర్వహిస్తున్నట్లు తన దృష్టికి రాలేదన్నారు. వైద్యాధికారులు ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

ఊట్కూరులో మంచినీటి సమస్య

ప్రజాపక్షం/ఉండవెల్లి: ఎండాకాలం సమీపక ముందే గ్రామాల్లో నీటి సమ స్య మొదలైంది. సంక్రాంతి పండుంగకు సెలవులు రావడంతో గ్రామాల్లో సందండి ఏర్పడిన అధికారులు మంచినీళ్లు సరఫరా లో ఇబ్బందులు ఏర్పడడం వలన నీటి సమస్య ఏర్పడింది. మిషన్ భగీరథ నీళ్లు సరపర చేయడం లో ఆర్డబ్ల్యూఎస్ అధికారులు అందుబాటులో లేకపోవడం వలన మిషన్ భగీరథ నీళ్లు అనుకున్నంత రాకపోవడం వలన గ్రామాల్లోని నీటి సమస్య తీవ్రంగా ఏర్పడింది. ఎండాకాలం ముందే గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడడంతో అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడం ప్రణాళిక లేకుండా సరఫరా కావడం వలన నీటి సమస్య సంభవిస్తుందని చెప్పవచ్చును. వివరాల్లోకి వెళితే అలంపూర్ మండల పరిధిలోని ఊట్కూరు గ్రామంలో వారం రోజుల నుంచి మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో ఆ గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేతిపంపులు ట్యాంకర్లు కూడా పని చేయకపోవడంతో ప్రేవేటు వ్యక్తులు ద్వారా నీళ్లు సరఫరా తీసుకొని నీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నత అధికారులు స్పందించి ఎండాకాలం ముందే ప్రణాళికతో నీటి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పవచ్చును.

సాగర్ సందర్శించిన అంతర్జాతీయ కైట్ ఫ్లయర్స్

ప్రజాపక్షం/నందికొండ: అంతర్జాతీయ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్‌ను గురువారం పలు దేశాలకు చెందిన కైట్ ఫ్లయర్స్ సందర్శించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం అంతర్జాతీయ గాలిపటాల సంబరాలను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఫెస్టివల్‌కు భారత దేశంలోని 14 రాష్ట్రాల నుంచే కాక జపాన్ ,థాయిలాండ్ ,మలేషియా, ఇండోనేషియా ,కంబోడియా ,వియత్నం ,శ్రీలంక ,పోలాండ్ ,కెనడా ,సింగపూర్ ,ఫ్రాన్స్ ,ఉక్రెయిన్ సుమారు 20 దేశాల నుండి కైట్ ఫ్లయర్స్ పాల్గొన్నారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈ కైట్ ఫెస్టివల్‌లో పాల్గొన్న వారు గురువారం తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో నాగార్జునసాగర్‌ను సందర్శించారు. ముందుగా బుద్ధవనం చేరుకున్న ఈ బృందం బుద్ధవనంలోని మహాస్తూపం అంతర్భాగంలోని ధ్యాన మందిరం, బుద్ధ చరిత వనం, ధ్యానవనం ,స్తూపవనాలను సందర్శించారు. వీరికి బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన్ ,ఎస్టేట్ ఆఫీసర్ రవిచంద్ర లు ఘనంగా స్వాగతం పలికారు. ఈ బృందానికి మహాస్తూపం సమావేశ మందిరంలో బుద్ధవనం విశేషాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం వీరు లాంచీలో నాగార్జున కొండను సందర్శించారు. వీరితోపాటు టూరిజం అధికారులు లోకేష్, స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ ఉన్నారు.

అర్హులు ఆందోళన చెందొద్దు

సంక్షేమ పథకాలు ప్రతీ నిరుపేదకూ అందేలా

క్షేత్రస్థాయిలో కృషి

కలెక్టర్ హనుమంతరావు

ప్రజాపక్షం/యాదాద్రి : నాలుగు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి నిరుపేదలకు అందేలా క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎంపిక చేయడం జరుగుతుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. గురువారం ఆత్మకూర్ మండలంలోని రాయిపల్లి, కాప్రాయిపల్లి గ్రామం, మోత్కూర్ మండలంలోని మసిపట్ల గ్రామపంచాయతీ పరిధిలో శివనగర్ హేమ్లెట్ గ్రామం, గుండాల గ్రామంలో నిర్వహిస్తున్న నాలుగు సంక్షేమ పథకాల (రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు) సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ హనుమంత రావు సందర్శించి, క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సర్వే తీరుని పరిశీలిస్తూ ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మీకు ఎన్ని ఎకరాల భూమి ఉందని, ఆ భూమిలో వ్యవసాయం చేస్తున్నారా, వ్యవసాయ యోగ్యమైన భూమి వుందా లేక రాళ్లు రప్పలు ఉన్నాయా అని తదితర వివరాలను సేకరించారు. అలాగే ప్రజాపాలనలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల పథకాలకు ప్రజలు దరఖాస్తు చేసుకోగా, ఆ దరఖాస్తులను ప్రభుత్వం తెలిపిన మార్గదర్శకాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో అధికారులు సర్వే చేసి లబ్ధిదారులను గుర్తిస్తున్నారని పేర్కొన్నారు. మొదటి విడతలో నిరుపేదలకు ప్రాధాన్యం ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కాకపోతే విడతల వారీగా లబ్ధిదారులను గుర్తించడం జరుగుతుందన్నారు. అర్హులెవరూ కూడా ఎటువంటి ఆందోళన చెందవద్దన్నారు. అదే విధంగా ఈ సర్వే ప్రక్రియ ఈ నెల 20 కొనసాగుతుందని, కుటుంబాల సమగ్ర వివరాలను తెలుసుకొని, ఆయా పత్రాలను పరిశీలించి, ఫార్మ్‌లో నమోదు చేయాలని, ఈ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని, అయోమయానికి గురికాకుండా తప్పులకు ఆస్కారం ఇవ్వకుండా పారదర్శకంగా అత్యంత జాగ్రత్తగా నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండల తహసీల్దార్‌లు ప్రత్యేక అధికారి, ఆయా మండలాల, గ్రామాల ఎంపిడిఓలు, ఎంపీఓలు, ఆర్ఐలు, పంచాయతీ కార్యదర్శులు, సర్వేయర్‌లు, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో సిఎంఆర్‌ను చెల్లించని మిల్లర్లపై చర్యలు : అదనపు కలెక్టర్

ప్రజాపక్షం /నల్లగొండ : కస్టం మిల్లింగ్ రైస్ (సి ఎం ఆర్) ను సకాలంలో చెల్లించడంలో వైఫల్యం చెందిన మిల్లర్లపై చర్యలు తీసుకోవడమే కాకుండా, అలాంటి మిల్లులను బ్లాక్ లిస్టులో ఉంచడం జరుగుతుందని అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ అన్నారు. గురువారం అయన తన చాంబరాలి రైస్ మిల్లర్లతో 2024 25 ఖరీఫ్ ,రబీ సీఎంఆర్ పై సమీక్షించారు. రబీ సీఎంఆర్ ను ఈనెల 25 లోగా నూటికి నూరు శాతం చెల్లించాలని చెప్పారు. మిల్లర్లకు రబీలో 3 లక్షల 26 వేల 99 మెట్రిక్ టన్నులు ఇవ్వడం జరిగిందని, ఇందుకుగాను మిల్లర్లు 2 లక్షల 21 వేల 747 మెట్రిక్ టన్నుల సిఎంఆర్ చెల్లించాల్సి ఉండగా, ఇప్పటివరకు 2 లక్షల 1892 మెట్రిక్ టన్నులు మాత్రమే చెల్లించారని, తక్కిన 19856 మెట్రిక్ టన్నులను ఈనెల 25 లోపు చెల్లించాలని ఆదేశించారు .జిల్లాలో రబి సి ఎం ఆర్ మొత్తం 91 శాతాన్ని చెల్లించడం జరిగిందని తెలిపారు.2024/25 ఖరీఫ్ సీఎంఆర్ రైస్ మిల్లర్లు అందరూ నిర్దేశించిన సమయంలో గా చెల్లించాలని ఆయన ఆదేశించారు. సీఎంఆర్ చెల్లింపులో వైఫల్యం చెందిన మిల్లర్లపై చర్యలు తీసుకోవడమే కాకుండా, అలాంటి మిల్లులను బ్లాక్లిస్టులో ఉంచడం జరుగుతుందని హెచ్చరించారు.ఈ సమావేశానికి జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్ష ,కార్యదర్శులు హాజరయ్యారు.

పోలీస్‌శాఖ గౌరవాన్ని పెంచేలా పనిచేద్దాం

ప్రజాపక్షం/నల్లగొండ : పదోన్నతి పొందిన ఎస్ఐ లకు పదవితో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని క్రమ శిక్షణతో, బాధ్యతగా పని చేస్తూ ప్రజల మన్ననలు పొందుతూ పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకం పెరిగే విధంగా పని చేయాలని జిల్లా ఎస్పి శరత్ చంద్రపవార్ సూచించారు. పదోన్నతి పొందిన11 మంది ఎస్ఐ లకు గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పి స్టార్ లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోన్నతితో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని, ప్రజలతో మమేకం అవుతూ బాధ్యతతో పని చేసి ప్రజల యొక్క మన్ననలు పొందే విధంగా పని చేయాలి అన్నారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులతో మర్యాద పూర్వకంగా ఉంటూ వారి యొక్క సమస్యల అడిగి తెలుసుకొని బాధితులకు సరిఅయిన న్యాయం జరిగే విదంగా పనిచేయాలని అన్నారు. అప్పుడే పోలీస్ శాఖకు గౌరవం వస్తుందని, దానిని పెంపొందే దిశగా పనిచేసి నల్లగొండ జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకరావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు జయరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

మోటార్ సైకిళ్ల చోరీలో నిందితుల అరెస్ట్

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఆంధ్రప్రదేశ్‌తోపాటు, తెలంగాణాలోని మిర్యాలగూడ పట్టణం పరిధిలో మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న శీలం నాగరాజు, వాటిని కొన్నత మునుకుంట్ల కృష్ణలను అరెస్ట్ చేసినటు డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. గురువారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం పట్టణంలోని హనుమాన్‌పేట ఫ్లై ఓవర్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా శీలం నాగరాజు అనే వ్యక్తి నెంబర్ ప్లేట్ లేని బుల్లెట్ బైక్‌పై వస్తుండగా ఆ బైక్ టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగలించబడిందని గుర్తించి స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించగా అతను గత రెండేళ్లుగా ఏపీలోని నర్సారావుపేట, వినుకొండ, అదేవిధంగా మిర్యాలగూడలో రాత్రి సమయంలో పార్క్ చేసి ఉన్న ఐదు మోటార్‌సైకిళ్లను చోరీ చేశారన్నారు. వాటిని మిర్యాలగూడ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న మునుకుంట్ల కృష్ణకు తక్కువ ధరకు విక్రయించాడని తెలిపారు. అతని నుంచి సుమారు రూ.6లక్షల విలువైన నాలుగు పల్సర్ మోటార్ సైకిళ్లను, ఒక బుల్లెట్ బైక్ స్వాదీనం చేసుకున్నామని తెలిపారు. చోరీ చేసిన నాగరాజు ఏపీ రాష్ట్రం పల్నాడు జిల్లా రెంటచింతల మండలం పాల్వాయి జంక్షన్‌కు చెందినవాడని, కొనుగోలు చేసిన కృష్ణ మిర్యాలగూడపట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన డీసీఎం డ్రైవర్ అని అన్నారు. కేసును సీఐ పి.నాగార్జున ఆధ్వర్యంలో ఎస్ఐలు హరీష్‌రెడ్డి, బి.రాంబాబు, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు బాలకృష్ణ, కల్యాణ్, హోంగార్డు సాయిరెడ్డిలను డీఎస్పీ అభినందించారు.

బాధ్యతాయుతంగా సర్వే చేయాలి

రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి

ప్రజాపక్షం/బీబీనగర్ : ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్దేశించిన గడువులోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వెరిఫికేషన్ టీంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతు భరోసా, రేషన్ కార్డుల సర్వే తీరును పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. సర్వే ప్రక్రియలో అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, ప్రభుత్వ నిబంధన తప్పనిసరిగా అనుసరించాలని సూచించారు. రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారు దారిద్ర రేఖకు దిగువన ఉన్న నిరుపేదలను గుర్తించాలని, భూములు ఆదాయం వంటి వివరాలు తప్పులు లేకుండా ఫారంలో నమోదు చేయాలని ఆదేశించారు. రైతు భరోసా కింద వ్యవసాయ యోగ్యమైన భూములకు పంట పెట్టుబడి సాయం కింద భూభారతి(ధరణి) పోర్టర్‌లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమికి మాత్రమే రైతు భరోసా వర్తిస్తుందని అన్నారు. గ్రామపంచాయతీ మున్సిపాలిటీ రెవెన్యూ రికార్డులో క్రోడీకరించిన వాటితో పాటు గ్రామాల మ్యాప్‌లను పరిశీలించాలన్నారు. యోగ్యం కాని భూముల జాబితాను ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా అత్యంత జాగ్రత్తగా పర్యవేక్షణ జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ వై.శ్రీనివాసులురెడ్డి, మండల తహసీల్దార్ ఎం. శ్రీధర్, మండల ప్రత్యేక అధికారులు, అగ్రికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

ఘోర రోడ్డుప్రమాదం

భార్య, కూతురు దుర్మరణం

తీవ్రగాయాలపాలైన భర్త ఆసుపత్రికి తరలింపు

ప్రజాపక్షం/భువనగిరి : సంక్రాంతి సంబరాలు ముగించుకొని సంతోషంగా వెను తిరిగిన ఆ కుటుంబంలో విషాదం నిండింది. హైద్రాబాద్ వరంగల్ హైవేపై భువనగిరి బైపాస్ రోడ్డులో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. భువనగిరి బైపాస్ వద్ద రాయగిరి సమీపంలోని పల్లె రుచులు హోటల్ వద్ద ముందుగా వెళ్తున్న లారీ డీజిల్ అయిపోయి సడెన్‌గా ప్రెట్రోల్ బంక్‌లోకి తిప్పడంతో వెనక నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న తల్లి కూతుళ్లు అక్కడికక్కడే మృతిచెందారు. వివరాల్లోకి వెళితే మహబూబాబాద్ జిల్లా కే సముద్రం మండలం వెంకట్రామ్ తండాకు చెందిన బుక్యా సంతోష్ తన భార్య అనుష (28), కుమార్తె చైత్ర (7) మరి కొంత మందితో కలిసి సంక్రాంతి పండుగకు తన స్వత కారులో స్వగ్రామానికి వెళ్లారు. సంక్రాంతి పండుగ అనంతరం గురువారం తెల్లవారుజామున వెంకట్రమ్ తండా, కేసముద్రం నుండి తిరిగి హైదరాబాద్‌కి వెళ్తుండగా ముందు వెళ్తున్న లారీని కారు బలంగా ఢీ కొట్టడంతో కారులో ఎడమ వైపు కూర్చున్న సంతోష్ భార్య అనుష, కూతురు చైత్ర ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ఉన్న భూక్య సంతోష్ దవడకు రక్తగాయాలు, అతని అక్క భవానీ కుడి భుజం, భావ రవి తలకీ, కుడి భుజాన్నికి, రక్తపు గాయాలు వారి కుమార్తె మోక్ష ముక్కుకీ రక్తపు గాయాలు కావడం జరిగడంతో, గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు, ఎస్ఎచ్ఓ సంతోష్ కుమార్, భువనగిరి రూరల్ పోలీసులు సంఘటన స్థలంలో తీవ్రంగా గాయపడిన బుక్యా సంతోష్ తోపాటు స్వల్పంగా గాయపడిన భవానీ, రవి, మోక్షలను జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. సంతోష్‌కి తీవ్ర గాయలు కావడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. మృతి చెందిన ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. సంతోష్ బంధువులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భువనగిరి రూరల్ ఎస్ఎచ్ఓ సంతోష్ కుమార్ తెలిపారు.

అంబరాన్నంటేలా చెర్వుగట్టు బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు

అధికారులు, దేవాలయ సిబ్బంది

సమన్వయంతో పనిచేయాలి

భక్తులకు సకల సౌకర్యాల ఏర్పాట్లపై దృష్టి: ఎంఎల్ఎ

ప్రజాపక్షం/నార్కట్‌పల్లి : భక్తులకు కొంగు బంగారంగా నిలుచే శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించి సంబరాలు అంబరాని అంటేలా అధికారులు సమన్వయంతో పని చేయాలనీ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. మండలం పరిధిలో ని చెర్వుగట్టు లోని దేవస్థానం ప్రాంగణంలో గురువారం శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రాహ్మతవాలను ఫిబ్రవరి 2 నుండి 9వరకు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు నల్లగొండ ఆర్‌డిఓ వై .అశోక్ రెడ్డి అధ్యక్షతన దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. భక్తులు దేవస్థానం చేరుకునే విధంగా ఏ పి లింగోటం నుండి, ఉన్న రహదారిని ఎల్లారెడ్డి గూడెం నుండి వచ్చే రహదారులను మంత్రి కోమటిరెడ్డి రెడ్డి వెంకట్ రెడ్డి సహకారం తో విస్తరణ పనులు చేపడుతమన్నారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ప్రముఖ పుణ్యక్షేత్రం చెరువుగట్టు శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవోపేతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 2న ప్రారంభమై, ఫిబ్రవరి 9న ముగుస్తాయని, బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 2 న నల్గొండ పట్టణ పురవీధుల్లో నగరోత్సవం తో ప్రారంభమవుతాయని, ఫిబ్రవరి 4న స్వామి వారి కళ్యాణ మహోత్సవం, 5 న స్వామి వారి శేష వాహన సేవ, ఫిబ్రవరి 6న స్వామి వారి అగ్నిగుండాలు, 7న దీపోత్సవ సేవ, శేష వాహన సేవ, 8 న మహా పూర్ణాహుతి, ధ్వజారోహణం 9న గ్రామోత్సవం ఉంటాయని వివరించారు.శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ సన్నాహక సమావేశంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస చారీ, ఇంచార్జ్ డిఎస్పి జీ. రమేష్, దేవాదాయ శాఖ కమిషనర్ కే. భాస్కర్, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సిరికొండ నవీన్ కుమార్,మండల ప్రత్యేక అధికారి చరిత,ఎంపిడిఓఉమేష్, తహసిల్దార్ వెంకటేశ్వర రావు,సిఐ నాగరాజు,ఎస్సై క్రాంతికుమార్, ఆలయ ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వర శర్మ లతో పాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, జిల్లా నాయకులు దూదిమెట్ల సత్తయ్య, సట్టు సత్తయ్య, వడ్డే భూపాల్ రెడ్డి, గడుసు శశిధర్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, నల్ల వెంకటేశ్వర్లు, మాజీ డైరెక్టర్ రేగట్టే నరసింహారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఇడుకుల్ల సంపత్, తదితరులు పాల్గొన్నారు.

అదానీ సిమెంట్ పరిశ్రమ నివారించేందుకు రాష్ట్రవ్యాప్త పోరాటం : తమ్మినేని

ప్రజాపక్షం/ రామన్నపేట: అదాని అంబుజా సిమెంట్ పరిశ్రమను ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే సహించేది లేదని అదాని యాజమాన్యం తట్టా, బుట్టా సదురుకోని వెళ్లాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో రామన్నపేటలో అదాని సంస్థ ఏర్పాటు చేయతలపెట్టే అంబుజా సిమెంట్ పరిశ్రమ ప్రతిపాదిత స్థలాన్ని స్థానిక మండల నాయకులతో కలిసి భారీ బైక్ ర్యాలీగా వెళ్లి పరిశీలన చేసి అనంతరం విలేకరులతో మాట్లాడుతూ దేశాన్ని దోచుకు తింటున్న అదాని సంస్థ సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేస్తే పరిసర గ్రామాల ప్రజల జీవన వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతుందన్నారు. ప్రజలంతా రాజకీయాలకు అతీతంగా ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని వ్యతిరేకించి నాలుగు నెలలు గడిచినా ఇప్పటివరకు రద్దు చేయడంలో ప్రభుత్వం ఎందుకు చోద్యం చూస్తుందో ప్రజల ముందు తెలపాలన్నారు. రామన్నపేట మరో లగచర్లగా మార్చొద్దని అన్నారు. అనంతరం సీపీఎం పార్టీ కార్యకర్తలతో కలిసి పరిశ్రమను వ్యతిరేకిస్తూ భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహా, పైళ్ల ఆశయ్య, బట్టుపల్లి అనురాధా, రైతు సంఘం రాష్ట్ర నాయకులు బొంతల చంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, బాలరాజు, పర్యావరణ పరిరక్షణ వేదిక మండల కన్వీనర్ పెంటయ్య, సీపీఎం మండల కార్

ప్రభుత్వం మారిందే తప్ప ప్రజల జీవితాలు మారలేదు

ఎంపి రఘునందన్‌రావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో ప్రభుత్వం మాత్రమే మారింది తప్ప ప్రజలజీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదని మెదక్ ఎంపి రఘునందన్ రావు విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రఘునందన్ రావు మీడియాతో మాట్లాడారు. చట్టంలోని లొసుగులను అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వంలోని కొంత మంది మంత్రులు హైదరాబాద్ రింగ్ రోడ్డు చుట్టూ ఉన్నా ఖాళీ స్థలాలు, పేదల స్థలాలు కాజేస్తున్నారని ఆయన ఆరోపించారు. సంగారెడ్డి జిల్లాలోని రామచంద్రాపురం మండలం వెలిమెల, రంగారెడ్డి జిల్లాలోని శంకర్ పల్లి మండలం కొండకల్, గ్రామాల మధ్య మిగిలిన సూమారు రూ.1500 కోట్ల విలువైన 85 ఎకరాలకు సంబంధించి చాలా కాలంగా భూవివాదం నడుస్తోందన్నారు. ఈ భూమిని ప్రభుత్వంలోని ఓ మంత్రి రింగ్ రోడ్డు సమీపంలోని 85 ఎకరాల బిలా దాఖలా భూమిని తన కుటుంబ సభ్యుల పేరుమీదకు మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. భూములు కాపాడేందుకు ధరణి స్థానంలో భూమాత చట్టాన్ని తీసుకువచ్చామని అసెంబ్లీలో పెద్ద పెద్ద ఉపన్యాసాలు చేసిన మంత్రే ఇప్పుడు పేద ప్రజల భుములను లాక్కునేందుకు పోలీసులను అడ్డంపెట్టుకుని మహిళలు, గిరిజనులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. సిఎం రేవంత్ రెడ్డికి చేతనైతే మూడు తరాలుగా అక్కడే ఉంటున్న ఆ గిరిజన రైతులకు పట్టాలు ఇప్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా ఎన్.రమేష్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ట్రాక్ కిలోమీటర్లు, రైళ్ల కార్యకలాపాల నిర్వహణ ఆదాయాపరంగా భారతదేశంలోని అతిపెద్ద రైల్వే జోన్లలో ఒకటైన దక్షిణ మధ్య రైల్వేకు ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్(పి.సి.సి.ఏం)గా ఎన్. రమేష్ సికింద్రాబాద్‌లోని రైలు నిలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ రైల్వేస్ ట్రాఫిక్ సర్వీస్ 1992 బాచ్‌కు చెందిన రమేష్ బ్యాచిలర్ ఆఫ్ సైన్స్, లా (బి.ఎస్సీ,బి.ఏ.,ఎల్.ఎల్.బి) లలో పట్టభద్రులయ్యారు. ప్రస్తుత నియామకానికి ముందు నైరుతి రైల్వేలో చీఫ్ క్లెయిమ్స్ ఆఫీసర్‌గా విధులను నిర్వర్తించారు. 30 సంవత్సరాల తన రైల్వే కెరీర్ లో, భారతీయ రైల్వేలలో బెంగళూరు డివిజన్లో సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్‌గా, న్యూఢిల్లీలోని రైల్వే మంత్రికి డైరెక్టర్,పబ్లిక్ గ్రీవెన్స్ వంటి అనేక కీలక పదవులను నిర్వహించారు. భాగస్వామ్య ప్రాతిపదికన రైల్వే ప్రాజెక్టులను చేపట్టడానికి భారత రైల్వేలతో ఒక ఏం.ఓ.యు (అవగాహన ఒప్పందం)పై సంతకం చేయడానికి ఆయన అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను సమన్వయం చేయడంలో కీలక పాత్ర పోషించారు.

వ్యవసాయానికి శాస్త్ర సాంకేతికతను జోడించాలి

రైతు కమిషన్ సభ్యురాలు భవానీ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : వ్యవసాయం మూసధోరణిలో సాగు చేయడం మానేసి వినూత్న పద్ధతులను అవలంభించాలని రైతు కమిషన్ సభ్యురాలు భవానీరెడ్డి రైతులకు సూచించారు. తక్కువ పెట్టుబడితో అతి తక్కువ విస్తీర్ణంలోను సైతంఅధిక దిగుబడి వచ్చే పంటలు వేసే దిశగా అడుగులు వేయాలన్నారు. ఇందుకు శాస్త్ర సాంకేతికతను వ్యవసాయ సాగులో జోడించాలని భవానీరెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో రైతు సంక్షేమం కోసం నిరంతం పాటు పడుతోందని తెలిపారు..మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగంలో మార్పులు చేర్పులు జరగాలని, నూతన విధానాలను అవలభించాలంటే యువత సాగుపై దృష్టి సారించినప్పుడే సాధ్యమౌతుందని తెలిపారు. విదేశాల్లో ఐటీ కంపెనీల్లో లక్షల్లో జీతాలు తీసుకునే వారుసైతం వ్యవసాయంపై ఫోకస్ చేస్తున్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. యువత వ్యవసాయంపై మక్కువ పెంచుకుంటే వ్యవసాయ రంగం మరింత అభివృద్ధి చెందుతుంది. తెలంగాణ యువ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత నివ్వడానికి సిద్ధంగా వున్నదని తెలిపారు. లిపారు. వ్యవసాయ రంగంపై ఆసక్తి ఉన్న యువతకు వ్యవసాయ రంగంలో మెళుకువలు, సాగుపై అవగాహన కల్పించడానికి వ్యవసాయ శాఖ, కమిషన్ పూర్తి సహాయ సహకారాలను అందించనుందని వెల్లడించారు. అంతేకాకుండా వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ యువ రైతుల సమ్మేళనం ఏర్పాటు చేసే ఆలోచనలో ఉందని కమిషన్ సభ్యురాలు భవానీ రెడ్డి తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం విద్యుత్ బస్సుల పథకంలో మార్పులు చేయాలి

టిజిఎస్ ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యూయు ప్రధాన కార్యదర్శి కె.రాజి రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం విద్యుత్ బస్సుల పథకంలో మార్పులు చేయాలని టిజిఎస్ ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాజిరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. విద్యుత్ బస్సుల నిర్వహణను ఆర్‌టిసిలకు కాకుండ విద్యుత్ బస్సుల తయారి, నిర్వహణ విధానాన్ని కార్పోరేట్ సంస్థలకు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అన్నారు. విద్యుత్ బస్సుల పేరుతో కోట్లాది రుపాయల ప్రజల డబ్బులను సబ్సిడీల పేరుతో ప్రైవేట్ పెట్టుబడిదారులకు దోచిపెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 2030 వరకు పూర్తి స్థాయిలో విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టితే ఆర్‌టిసిలో పనిచేస్తున్న డ్రైవర్, మెకానిక్, శ్రామిక్, 50 శాతం కండక్టర్లు ఉద్యోగాలు కోల్పోయి, రోడ్డు పాలవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కేంద్ర ప్రభుత్వం జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం పథకం ద్వారా బస్సులను గ్రాంట్‌గా ఆర్‌టిసిలకు ఇచ్చిన విధంగానే విద్యుత్ బస్సులను కూడా కేంద్ర ప్రభుత్వం గ్రాంట్‌గా ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ బస్సుల పథకంలో మార్పులు చేస్తూ, ఆర్‌టిసిలే నేరుగావిద్యుత్ బస్సులను కొనుగోలు చేసి నిర్వహించుకునే విధంగా కొత్త పాలసీ తీసుకు రావాలని రాజి రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

'ఎక్స్' వేదికగా కెటిఆర్‌పై రాజాసింగ్ వ్యంగ్యాస్త్రాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : కర్మ ఎవరిని వదిలి పెట్టదంటూ ఎక్స్ వేదికగా మాజీ మంత్రి కెటిఆర్‌పై బిజెపి ఎంఎల్ఎ రాజాసింగ్ వ్యంగ్యాస్త్రాలను సంధించారు. ఫార్మలాఈ రేసు కేసులో ఎసిబి, ఈడిల విచారణను ఎదుర్కొంటున్న కెటిఆర్‌జీ, జైలుకు వెళ్లే ముందు ప్యాక్ చేయాల్సిన చిన్న చెక్ లిస్టును పెడుతున్నంటూ సెటైరికల్ ట్విట్ చేశారు. బిఆర్ఎస్ హాయంలో నన్ను అక్రమంగా జైల్లో పెట్టారు.. ఇప్పుడు మీకు కూడా అదే గతి పట్టబోతోందని ట్విట్‌లో పేర్కొన్నారు. జైలుకు వెళ్లే ముందు 4 జతల బట్టలు, హాయిగా ఉండే దుప్పటి , రుమాలు , సబ్బు,ఒక ప్యాకెట్ ఊరగాయతో పాటు వెచ్చని స్వెటర్ను మర్చిపోవద్దు అంటూ ట్విట్ చేశారు.ఇతరులను లక్ష్యంగా చేసుకోవడానికి అధికారాన్ని దుర్వినియోగం చేసేవారు చివరికి అనుభవించక తప్పదని,...కర్మ ఎవరిని మర్చిపోదని, అది సరైన సమయం కోసం వేచి చూస్తుందని ఇప్పుడు ఆ సమయం వచ్చిందంటూ రాజాసింగ్ పేర్కొన్నారు.

విద్యారంగంలో సంస్కరణలు సాధ్యమే

డిఫెన్స్ పరిశోధన సంస్థ పూర్వ కార్యదర్శి డాక్టర్ సతీష్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : క్యాలికులేటర్లు వచ్చిన మొదట్లో ఇక మనిషి తెలివితేటలకు పని ఉండదని విమర్శించిన రోజుల్లోనే కంప్యూటర్లు వచ్చాయని, వీటితో మనుషులకు ఉద్యోగాలు దొరకవని అన్నారని ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్, రక్షణశాఖ పరిశోధన అభివృద్ధి సంస్థ మాజీ కార్యదర్శి డాక్టర్ సతీష్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (కృత్రిమ మేధ) ద్వారా ప్రపంచంలో అద్భుతాలు సృష్టించే రోజులు వచ్చాయని, తక్కువ అంచనా వేసుకునేదానికన్నా మనిషి ఎప్పుడూ ప్రగతివైపు ఆలోచిస్తూ ముందడుగు వేయాలన్నారు. లో, మిడిల్ ఇన్ కమ్ దేశాల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా విద్యారంగంలో తీసుకుని రావాల్సిన సంస్కరణలపై ప్రపంచబ్యాంక్ ప్రతినిధులు గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ సహకారంతో గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రపంచ బ్యాంకు అనలిటిక్స్, రీసర్చ్ టీమ్ ఆర్థికవేత్త డాక్టర్ శారదా శ్రీనివాసన్ పాల్గొని ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా విద్యారంగంలో తీసుకుని రావాల్సిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సతీష్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోనే భారతదేశం యువత జనాభాలో అగ్ర భాగాన ఉందని, ఏటా సుమారు నాలుగున్నర కోట్ల మంది హై స్కూల్ వరకు చేరుకుంటున్న విద్యార్థులకు టక్నాలజీ ప్రాధాన్యాలను వివరించడంతో విద్యారంగంలో గొప్ప ప్రగతిని సాధించవచ్చునన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని సుమారు 1500 ఇంజనీరింగ్ కళాశాలల్లో ఏటా ఒకటిన్నర లక్షల మంది ఇంజనీరింగ్ విద్యార్థులు చదువుతున్నారని, టెక్నాలజీ రంగంలో విద్యార్థులు అవగాహన ఏర్పరుచుకున్నపుడు ప్రపంచంలోనే భారతదేశానికి ఏ దేశం పోటీ రాదన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజన్స్ ద్వారా టీచింగ్, లెర్నింగ్‌లో సమూల మార్పులు తీసుకురావచ్చన్నారు. కేవలం బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లోనే సుమారు 20 వేల మంది ఆర్టిఫిషియల్ ఇంటెలిజిజిన్స్ రంగంలో పనిచేస్తున్న సిబ్బంది ఉన్నారని, వీరి సేవలు కూడా విద్యారంగ సంస్కరణలకు ఉపయోగించుకోవాలని డాక్టర్ సతీష్ రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ మాజీ విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ గ్రామాల్లో చదివే పిల్లలకు కంప్యూటర్ అవగాహన కల్పించి, తెలుగుతో పాటుగా అద్భుతమైన ఇంగ్లీష్ మాట్లాడగలిగే విద్యార్థులుగా ఆ రాష్ట్ర విద్యార్థులను తక్కువ కాలంలో తయారు చేయగలిగామన్నారు. కృత్రిమ మేధ ద్వారా టీచర్ ట్రైనింగ్, సిలబస్ మార్పులు, బోధనా పద్ధతులు అన్నింటిలో కూడా మార్పులు సాధ్యమని నిరూపించామన్నారు. డాక్టర్ మృత్యుంజయప్ప మాట్లాడుతూ విద్యార్థుల్లో 40 శాతం మంది సాంకేతికత వైపు మొగ్గు చూపుతున్నప్పటికీ ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకోలేక పోతున్నారన్నారు. కృత్రిమ మేధ ద్వారా ఆపరేషనల్ ఎఫిషియన్సీ అంటే, ప్రశ్నా పత్రాల రూపకల్పనలో, హైపర్ పర్సనలైజ్డ్ లర్నింగ్, బిజినెస్ మోడల్ తదితర వాటి ద్వారా మార్పులు సాధ్యమన్నారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా డైరెక్టరో డాక్టర్ జి. రామేశ్వర్ రావు మాట్లాడుతూ బోధనారంగంలో కృత్రిమ మేధను ఉపయోగించుకుని ప్రాథమిక విద్యా దశలోనే ఎన్ రోలెమెంట్ శాతాన్ని పెంచవచ్చని, క్వాలిటీ ఎడ్యుకేషన్ కూడా సాధ్యమన్నారు. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ యు. చంద్ర శేఖర్ పర్యవేక్షణలో జరిగిన ఈ సమావేశంలో వివిధ రాష్ట్రాల నుండి ప్రతినిధులు డాక్టర్ బాల సుబ్రహ్మణ్యం, డాక్టర్ ఓరా, డాక్టర్ మృత్యుంజయప్ప, డాక్టర్ సత్య, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ లోహిత్, శశిధర్, సునీత ఆనంద్, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

శిక్షలపై దృష్టి పెట్టండి

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్

ప్రజాపక్షం/హైదరాబాద్: గంజాయి, డ్రగ్స్ ఎక్సైజ్ కేసుల్లో నిందితులకు శిక్షలు పడే విధంగా అధికారులు దృష్టి సారించాలని రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్ అధికారులను ఆదేశించారు. గురువారం నాంపల్లిలోని ఆబ్కారీ భవన్‌లో రంగారెడ్డి డివిజన్ ఎక్సైజ్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దశరథ్ అధికారులతో మాట్లాడుతూ..రంగారెడ్డి డివిజన్ పరిధిలోని 20 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో చాల కేసుల్లో పట్టుబడిన గంజాయి, డ్రగ్స్‌ను ఎక్కువ కాలం నిల్వ చేయకుండా వెంటనే డిస్పోజల్ చేయాలని, ఆయా కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలాన్ని వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. 2700 కిలోల గంజాయితోపాటు డ్రగ్స్‌ను వెంటనే డిస్పోజల్ చేయాలని, 650 వాహనాలను వెంటనే వేలం వేయాలని సూచించారు. వీటితోపాటు ఎక్సైజ్ యంత్రాంగానికి ఉద్యోగ నియమాల పరిధిలోనే పని చేయాలని, ఎవ్వరు నిబంధలను అతిక్రమించిన సంస్థకు చెడ్డ పేరు వస్తుందనే విషయాన్ని మరచిపోవద్దన్నారు. నమోదు చేసిన కేసుల్లో చార్జీషీట్లను సక్రమంగా వేస్తే శిక్షలు పడడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. శిక్షలు పడినప్పుడే నిందితుల్లో భయం పుడుతుందాన్నారు. నిర్ధారించిన టార్గెట్స్‌ను పూర్తి చేయాలని, టార్గెట్స్ రావాలంటే నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్ను అరికట్టాలని, డ్రగ్స్ వినియోగంపై గట్టి నిఘా పెట్టి పట్టుకోవాలన్నారు. క్రైమ్ కంట్రోల్‌కు ఎన్ ఫోర్స్మెంట్ టీమ్లు బాగా పని చేయాలన్నారు. స్టేషన్ల వారిగా క్రైమ్, డిస్పోజల్ సామాగ్రిపై సమీక్షించారు. అసిస్టేంట్ కమిషనర్ ఆర్.కిషన్, శంషాబాద్, మేడ్చల్, మాల్కాజ్‌గిరి, సరూర్‌నగర్, వికారాబాద్ ఎక్సైజ్ సూపరిండెంట్లు కృష్ణ ప్రియ, ఫయాజోద్దీన్, కె.నవీన్కుమార్, ఉజ్వల రెడ్డి విజయభాస్కర్‌తో పాటు అన్ని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల సిఐలు పాల్గొన్నారు.

అసైన్డ్‌భూములకు 'భరోసా' దక్కేనా..?

సాగు చేస్తున్న వారిలో పేద, మధ్యతరగతి రైతులు

పట్టాలున్నా దక్కని భరోసా

గత ప్రభుత్వ నిర్లక్ష్యం : భట్టి హామీ నెరవేరేనా ?

ప్రజాపక్షం/ఖమ్మం : రైతు భరోసాకు సంబంధించి లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది. సాగు చేస్తున్న భూమికి రైతు భరోసా వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్న తరుణంలో అసైన్డ్ భూముల వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ప్రస్తుత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు అప్పటి ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేసిన సందర్భంలో పలు జిల్లాల్లో జరిగిన సభల్లో అసైన్డ్ భూముల వ్యవహారాన్ని ప్రస్తావించడంతో పాటు పలు చోట్ల భూములను పరిశీలించారు. అసైన్డ్ భూములు చేతులు మారితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ భూములను స్వాధీనం చేసుకుంటామని పేదల ఆధీనంలో ఉంటే సర్వ హక్కులు కల్పిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాకు సంబంధించి సాగులో ఉన్న భూములన్నింటికి వర్తింపజేయాలని భావిస్తున్నది. ఆ దిశగా అధికార యంత్రాంగం సాగు భూములకు సంబంధించి సర్వే కూడా నిర్వహిస్తున్నది. కాని గత ప్రభుత్వం అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వకపోగా రైతు భరోసాను కూడా వర్తింపజేయలేదు. అసైన్డ్ భూములను కొనుగోలు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, ధనవంతులకు రైతు భరోసాను వర్తింపజేసి పట్టాలు చేతిలో పెట్టిన ప్రభుత్వం పేదల పట్ల మాత్రం తీవ్ర వివక్ష ప్రదర్శించింది. అసైన్డ్ భూములు అన్యాక్రాంతమైన ప్రభుత్వం పట్టించుకోలేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు అసైన్డ్ భూములను కొనుగోలు చేసి వెంచర్లు వేసినా డొంకలు, ఇతరత్రా మిగులు భూములను కలిపేసుకున్నా అధికార యంత్రాంగం గత ప్రభుత్వంలో చేష్టలూడిగి చూస్తుండిపోయింది తప్ప చర్యలు తీసుకోలేదు. 1977కు ముందు అసైన్డ్ భూములు ప్రభుత్వ భూములు, ఇతరత్రా భూములు ధనవంతులు, వ్యాపారుల చేతుల్లోకి వెళ్తున్నాయని అప్పటి ప్రభుత్వం 1977లో భూ పరిరక్షణ, బదిలీ చట్టాన్ని తీసుకువచ్చింది. అసైన్డ్ భూములను అర్హత లేని వ్యక్తులు కొనుగోలు చేసినా, ఆక్రమించినా చర్యలు తీసుకోవడంతో అసైన్డ్ భూములకు రక్షణ ఏర్పడింది. 1970 నుంచి 1980 మధ్య కాలంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం బంచరాయి, అసైన్డ్, దేవాలయ భూములు, ప్రభుత్వ మిగులు భూములను భూమి లేని నిరుపేదలకు పంపిణీ చేసి సాగును ప్రోత్సహించింది. ఓ దశలో అసైన్డ్ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు ప్రోత్సాహకాలను కూడా ఇచ్చింది. 2018లో రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం 4233 మెమోను 2018 మార్చి 19న జారీ చేసింది. దీనితో అంతకు ముందు అసైన్డ్ కొనుగోలు చేసిన బడా వ్యాపారులు, భూస్వాములకు సైతం పట్టాలు చేసుకునే అవకాశం లభించింది. దీనితో ఒక్కసారిగా అసైన్డ్ భూములు పెద్ద మొత్తంలో చేతులు మారాయి. లక్షల ఎకరాల అసైన్డ్ భూమి పట్టా భూమిగా మారిపోయింది. అటువంటి వారికి రైతు భరోసా వర్తిస్తుంది కాని అసైన్డ్ సాగు చేసుకుంటున్న చిన్న, సన్నకారు రైతులకు మాత్రం వర్తించడం లేదు. సాగులో ఉన్న భూములకు అసైన్డ్, పట్టా లేదా ఇతరత్రా భూముల మధ్య తేడాలు చూడకుండా సాగులో ఉన్న ప్రతి భూమికి రైతు భరోసా వర్తింపజేయాలని అసైన్డ్ భూములు, బంజర భూములు, దేవాలయ భూములు సాగు చేసుకుంటున్న రైతులు కోరుతున్నారు.

ఈ ఏడాది బలంగా భారత్ ఆర్థిక వృద్ధి

చైనా, యూరప్ సహా ప్రపంచ ఆర్థికస్థితి బలహీనం

డబ్ల్యుఎఫ్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ : కొత్త ఆర్థిక సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక పరిస్థితులు బలహీనంగా ఉన్నప్పటికీ భారతదేశ వృద్ధిమాత్రం ఎంతో బలంగా అభివృద్ధిబాటలో కొనసాగుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రధాన ఆర్థికవేత్తలు ఎక్కువమంది ఇదే అంచనాతో ఉన్నారు. ప్రపంచ ఆర్థిక వేదిక (వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్) గురువారం విడుదల చేసిన కొత్త దార్శనిక నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ ఏడాది చైనా ఆర్థిక వ్యవస్థ బలహీనంగానే కొనసాగుతుంది. ఆమెరికా ఆర్థిక వ్యవస్థ 2025లో బాహుబలిస్థాయిలో వృద్ధి సాధిస్తుంది. దక్షిణ ఆసియా ప్రత్యేకించి భారతదేశంలో వృద్ధి బలంగా కొనసాగుతుంది. యూరప్ ఖండంలోని దేశాల్లో వృద్ధిపై మబ్బులు కమ్ముకుని ఉంటాయి. 74 శాతం మేరకు ఈ ఏడాది యూరప్‌లో వృద్ధి అవకాశాలు మసక మసకగానే ఉంటాయి. భారత్‌లో వినియోగదారుల వ్యయాలు గణనీయంగా వృద్ధి చెందుతాయని, వినియోగదారుల కొనుగోళ్ళతో మార్కెట్లు కళకళలాడిపోతాయని నివేదిక పేర్కొంది. సర్వేయర్లు, ఆర్థిక సంప్రదింపుకర్తలు, ప్రైవేటు, ప్రభుత్వరంగంలో ఉన్న నిపుణులను, ఆర్థికవేత్తల అభిప్రాయాలు సేకరించడంద్వారా వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ఈ నివేదికను రూపొందించింది. దక్షిణాసియా ప్రాంతం ఇతర ప్రాంతాల ఆర్థిక వ్యవస్థలకంటే మెరుగైన ఫలితాలను ఈ కొత్త ఆర్థిక సంవత్సరంలో కూడా కొనసాగిస్తాయని నివేదిక వెల్లడించింది. 61 శాతంమంది ప్రధాన ఆర్థికవేత్తలు చాలా బలమైన వృద్ధి ఫలితాలు వస్తాయని అంచనావేశారు. ''దక్షిణాసియా ప్రాంతం పనితీరు ప్రధానంగా ఎక్కువగా భారత్ వృద్ధిపైనే ఆధారపడి ఉంటుంది, భారతదేశం ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధిచెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా ముందుకు వచ్చింది, ఐనప్పటికీ కూడా కొంత మేరకు వేగ గతి కోల్పోయిన సంకేతాలు కనిపిస్తున్నాయి'' అని నివేదిక పేర్కొంది. భారత్‌కు సంబంధించి తాజా జాతీయ గణాంకాల ప్రకారం, స్థూలజాతీయోత్పత్తి వృద్ధిని గత ఏడాదితో పోల్చి చూస్తే, 2024 మూడో త్రైమాసికంలో 5.4 శాతం గానమోదైంది. అంటే దాదాపు రెండు సంవత్సరాలలో అతి తక్కువ మందగమనం ఈ వృద్ధిరేటులో కనిపించింది. గడచిన డిసెంబరునెలలో భారత రిజర్వుబ్యాంకు తన వార్షిక ముందస్తు వృద్ధి అంచనాలలో కూడా అవరోహణనే చూపించింది. చైనాలో వినియోగదారుల డిమాండ్ తక్కువగా ఉండటంతో ఉత్పాదకత బల హీనంగా ఉంది. వాణిజ్య అంచనాలు చూసినప్పుడు 2025లో ప్రపంచ వాణిజ్యస్థాయి, పరిమాణాలు పెరుగుతాయని 48 శాతంమంది ప్రపంచ ప్రధాన ఆర్థికవేత్తలు అంచనావేశారు. ఐతే ఈ అంచనాలకు పూర్తి భిన్నంగా ఆర్థికరంగంలో రక్షణవాదం మార్పులు తెస్తోందని, ప్రపంచ వాణిజ్యంలో తీరుతెన్నుల్లో మార్పులు వస్తున్నాయని, రాబోయే మూడు సంవత్సరాలలో వాణిజ్యంలో ప్రాంతీయీకరణ భారీగా ఉంటుందని 82 శాతంమంది ప్రతివాదులు అంచనావేశారు.

యోల్ అరెస్టుపై కొరియా కోర్టు పునరాలోచన!

సియోల్ : దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ (64) అరెస్టు ఉదంతంపై ఆ దేశ సుప్రీంకోర్టు సందిగ్ధంలో పడింది. ఐతే ఆయన అరెస్టుపై రెండోసార విచారణ జరపాలని నిర్ణయాన్ని కూడా వాయిదా వేసింది. దీంతో గురువారం మధ్యాహ్నం అధికారులు యోల్‌ను తిరిగి ప్రశ్నించేందుకు సిద్ధమయ్యారు. ఆయన తరపు న్యాయవాదులు మాత్రం యోల్ అనారోగ్యంగా ఉన్నారని వారికి నచ్చజెప్పారు. ఆయన అరెస్టును సమీక్షించాలా? వద్దా? సమర్థించాలా? అనే విషయపై దక్షిణ కొరియా సుప్రీంకోర్టు సందిగ్ధంలో ఉంది. మరోవైపు యోల్ అరెస్టుకు వ్యతిరేకంగా దేశంలో నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. ప్రతిపక్షాలు మాత్రం యోల్ అరెస్టుతో హర్షాతిరేకాలు వ్యక్తం చేశాయి. దేశంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఇదే సరైన సమయమని ప్రతిపక్షాలు ప్రకటించాయి. యోల్ ఇంటి పరిసర ప్రాంతాలు ఒక తీర్థంలా మారాయి. యోన్‌కు మద్దతు ఇచ్చే ఒక మహిళ ఆయన ఇంటివద్ద గురువారంనాడు కన్నీళ్ళుపెట్టుకున్నారు. భోరున విలపించారు. ''మా దేశం సంక్షోభంలో ఉంది'' అని ఆమె అన్నారు. గడచిన 45 రోజులుగా దక్షిణకొరియాలో రాజకీయ అస్థిరత కొనసాగుతూ ఉండటంతో ఆర్థిక సమస్యకు పక్కకు పోయాయి. దేశంలో ప్రజలు తీవ్ర ద్రవ్యోల్బణంతో బాధపడుతున్నారు.

బంగారు గనిలోంచి బయటపడిన 240 మంది కార్మికులు

87 మృతదేహాలు వెలికితీత

స్టిల్‌ఫోన్‌టైన్ : దక్షిణాఫ్రికాలోని స్టిల్‌ఫోన్‌టైన్ బంగారు గని లోంచి ఎట్టకేలకు 240 మంది కార్మికులు బయటకు వచ్చారు. వీరిలో 13 మంది బాలకార్మికులు కూడా సురక్షితంగా బయటకు వచ్చారు. అదేవిధంగా గురువారంవరకూ 87 మంది కార్మికుల మృతదేహాలను బంగారు గనుల లోంచి బయటకు తీశారు. ఇక సహాయ కార్యక్రమాలు ముగిశాయని, గనిలో ఎవ్వరూలేరనీ ప్రభుత్వం ప్రకటించింది. ఐతే మరోచోట బఫెల్స్‌ఫోన్‌టైన్‌లోని బంగారు గనిలో మాత్రం 2000 మంది కార్మికులు అక్రమ తవ్వకాల పనిలో ఉండి ఉంటారని ప్రభుత్వం భావిస్తున్నది. బయట నుండి సహాయం లేకుండా కార్మికులు తమంతట తాముగా బంగారు గనుల్లోంచి బయటకు వచ్చే అవకాశం లేకపోవడంతో అనేక వారాలుగా కార్మికులు తిండి, నీళ్ళు లేక అలమటించి స్టిల్‌ఫోన్‌టైన్ గని లోపలే మరణించారు. మానవ హక్కుల సంఘాలు, వివిధ అసోసియేషన్లు ఒత్తిడి చేయడంతో ఎట్టకేలకు ప్రభుత్వం సహాయ చర్యలు చేపట్టింది. కార్మికుల బంధువులు, మానవహక్కుల సంఘాలు గని వెలుపల నిరసన ప్రదర్శనలు చేస్తున్నాయి. దక్షిణాఫ్రికా వాయువ్య ప్రాంత రాష్ట్రం స్టిల్‌ఫోన్‌టైన్‌లో అనేక బంగారు గనులు ఉన్నాయి. ఈ గనుల్లో అక్రమ తవ్వకాలను ప్రభుత్వం నిషేధించింది. ఐనప్పటికీ అక్రమ తవ్వకాలు స ర్వసాధారణంగా మారాయి. ఈ ఆటలో కార్మికులు బలిపశువులుగా మారుతున్నారు. ప్రభుత్వం తీవ్ర ఆంక్షలు విధించినప్పటికీ పేదరికంవల్ల అక్రమంగా ల్లో

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాపక్షం/అడ్డాకుల : అడ్డాకుల మండల పరిధిలోని పెద్ద మునగల్చేడ్‌లో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ఎండి జాంగిర్ కుటుంబానికి ఆయన స్నేహితులు రూ.26,000 సాయం అందజేశారు. గురువారం పెద్దమునగల చెడ్ ఎండి జాంగిర్ ఇంటిదగ్గర పూర్వ విద్యార్థుల 2003–2004 ఏం చంద్రశేఖర్, డి.శ్రీనివాసులు, శ్రీను నాయక్, రాజు, నరేష్ సాగర్, ఆధ్వర్యంలో మిత్రులు ఎండి జాంగిర్ భార్య నసియా బేగంకు 26000 రూపాయలు అందజేశారు. నాసియా బేగం మాట్లాడుతూ ఆర్థిక సాయం చేసినందుకు ప్రతి ఒక్కరికి హృదయపూర్వకు ధన్యవాదాలు తెలిపారు. పూర్వ విద్యార్థులు, రవీందర్ రెడ్డి, శ్రీకాంత్, మల్లేష్, రాజ్ కుమార్, వహీద్, సాయి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయానికి గ్రానైట్ విరాళం

ప్రజాపక్షం/జడ్చర్ల : గంగాపూర్ గ్రామ శివారులో గల కోడుపర్తి ఆంజనేయ స్వామి వారి దేవాలయ అభివృద్ధిలో భాగంగా స్వామి వారి గర్భాలయం, ముఖ మండపంలో గ్రానైట్ టైల్స్ నిర్మాణ పనులకు గాను గంగాపూర్ వాస్తవ్యులు కీ.శే శ్రీ నందిపేట జనార్ధనాచారి ధర్మపత్ని రాజమణెమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు నందిపేట విష్ణుమూర్తి ధర్మపత్ని సరోజ ఆలయ అర్చకులు నందిపేట లక్ష్మణాచార్యులు ప్రత్యేక పూజలు చేపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నందిపేట విష్ణు మూర్తి కుటుంబ సభ్యులు బ్రహ్మయ్యాచారి, జగదీష్ చారీ, కృష్ణయ్య చారి, శ్రీధరాచారి, శ్రీనివాస్ చారి, సత్యం చారీ, ఆలయ కమిటీ అధ్యక్షులు టి.శ్రీనివాసులు, సభ్యులు భాస్కర్, గౌరీశంకర్, బాబూగౌడ్, చెన్నప్ప, శ్రీరివాస్ చారి, మహేష్ చారి, రవికుమార్ చారి శివ కేశవులు, పాపయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్, టిఆర్ఎస్ మధ్య వాగ్వివాదం

ప్రజాపక్షం/అచ్చంపేట : అచ్చంపేటలో బుధవారం రాత్రి స్థానిక భ్రమరాంబదేవాలయ ప్రాంగణంలో ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజు అనుచరుల మధ్య వాగ్వివాదం జరిగి తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. దేవాలయంలో ప్రభపేరుతో ఉత్సవం నిర్వహిస్తుంటారు. ఈ కార్యక్రమానికి పూజ నిమిత్తం స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆలయంలో ప్రవేశించారు. అదేసమయంలో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజు రావడంతో డిఎస్‌పి శ్రీనివాసులు ఆధ్వర్యంలో దేవాలయంలో స్థలభావం ఉందని ఆగమని గువ్వల బాల్‌రాజును నిలిపివేశారు. దీంతో గువ్వలబాల్‌రాజు అతని వర్గం పది సంవత్సరాలు ఎమ్మెల్యేని నన్ను నిలిపివేస్తావా అని పోలీసులపై దాడికి దిగాడు. డిఎస్‌పి శ్రీనివాసులు ఉద్రిక్తతకు తావు లేకుండా చేశారు. అయినప్పటికి మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజు అతని అనుచరులు పోలీసులపై ముష్టిఘాతానికి దిగారు. పరిస్థితిని గమనించి స్థానికులు వారించడంతో వారు వెళ్లిపోయారు. అనంతరం పూజలు నిర్వహించి కార్యక్రమం నిర్వహించారు.

మాజీ ఎమ్మెల్యేపై కేసు నమోదు

బుధవారం రాత్రి పోలీసులపై దాడి చేసిన సంఘటనలో కేసు నమోదు చేసినట్లు అచ్చంపేట ఎస్ఐ రాములు తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పోలీసులపై చేయి చేసుకున్న వీడియోలు తమ వద్ద ఉన్నాయని వీడియోల ఆధారంగా అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజు అనుచిత వ్యాఖ్యలు చేసినందున కొందరిపై బెదిరింపు వ్యాఖ్యలు చేసినందుకు కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈకేసు సుమోటోగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైతు భరోసాకు సర్వే నెంబర్ల సర్వే, రేషన్‌కార్డుల దరఖాస్తులు పరిశీలన

ప్రజాపక్షం/ఊర్కొండ : నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలో గురువారం ఊర్కొండ రైతువేదిక యందు అందరూ పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రెవెన్యూసిబ్బంది, వివోఎలతో సమావేశం నిర్వహించి ఈనెల 20వతేదివరకు రైతుభరోసా మంజూరుకు సర్వే నెంబర్లవారిగా సర్వే, రేషన్‌కార్డుల దరఖాస్తుల పరిశీలనకు మార్గనిర్దేశనం చేయడం జరిగింది. తదుపరి నర్సంపల్లి, ఇప్పపహాడ్ గ్రామాల్లో వ్యవసాయభూముల సర్వే, రేషన్‌కార్డుల సర్వేను పరిశీలించడం జరిగింది. కార్యక్రమంలో రాంకోటి , తహసీల్దార్ కుమారిదీప్తి, వ్యవసాయ అధికారి లక్ష్మణ్, ఎంపిఓ సంతోష్, ఏపిఎం నర్సింహ్మ, ఏపిఓ , ఎంపిడిఓ, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈదమ్మ మాందాతలకు ప్రత్యేక పూజలు

ప్రజాపక్షం/వెల్దండ : మండల పరిధిలోని చెరుకూర్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ ఈదమ్మ మాందాత బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమీషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి విజితారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా దేవాలయానికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈదమ్మమాందాత మాతంగి జాతరగ్రామ ప్రజలు కలిసికట్టుగా అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. అదేవిధంగా ఈదమ్మ బోనాలు ,ముగ్గుల పోటీలు, సవరమ్మ బోనాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ జాతరకు జిల్లా నలుమూలలనుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ జాతర ఈ సంవత్సరం ఘనంగా నిర్వహిస్తున్నారు. కన్నులపండుగగా సాగుతుంది. గ్రామప్రజలు చల్లగా ఉండాలని ఆయురారోగ్యాలతో పాడిపంటలతో చల్లగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి భీమయ్యగౌడ్, మాజీ ఉపసర్పంచ్‌లు పురుగుల నర్సింహ, నిరంజన్, రైతు అధ్యక్షుడు భాస్కర్‌రావు, మండలయాత్ అధ్యక్షుడు జంగిలి యాదగిరి, బచ్చలకూరశ్రీను, మైసయ్య, లాలయ్య, భాష, అలీల్, నాగయ్య, ప్రసాద్, పోలేఅశోక్, జంగ య్య, కొండల్, సందీప్, రామచంద్రయ్య, ప్రవీన్, శేఖర్, గణేష్, దశరథం, రవికుమార్, నర్సింహ, యాదగిరి, సాయి పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

ప్రజాపక్షం/ఊర్కొండ : నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ముచ్చర్లపల్లిలో ప్రీమియర్ లీగ్ సీజన్ 5 క్రికెట్ టోర్నమెంటులో భాగంగా మొదటి బహుమతి గెలుపొందిన జట్టుకు రూ.15016, రన్నర్‌కు రెండో బహుమతి రూ.7516 టోర్నమెంట్ ప్రధాత బహుమతులు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కరాటే అసోసియేషన్ చైర్మన్ ముచ్చర్ల జనార్ధన్‌రెడ్డి అందజేశారు. అదేవిధంగా మహబూబ్‌నగర్ జిల్లా కౌన్సిల్ మెంబర్ ముచ్చర్ల లక్ష్మారెడ్డి మండల అధ్యక్షులు రాజేందర్ గౌడ్, మాజీ అధ్యక్షులు ఆంజనేయులు, పరుష రాములు, పూర్ణదీప్, జయరాములుగౌడ్, నీలకంఠంరెడ్డి, రాఘవేందర్‌గౌడ్, అనిల్‌రెడ్డి, సురేష్, వెంకటేష్, లవకుశ, ఆర్గనైజర్స్ శ్రీనివాసులు, ఆనంద్ పాల్గొన్నారు.

మారుతున్న కాలంలో.. మారనివిలువల కోసం పరితపించిన జైపాల్ రెడ్డి

ఘనంగా జైపాల్ రెడ్డి 83వ జయంతి వేడుకలు : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : మారుతున్న కాలంలో మారని విలువల కోసం తపించిన వ్యక్తి సూదిని జైపాల్ రెడ్డి అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మాజీ కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి 83వ జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని ధర్మాపూర్ జేపిఎన్‌సి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన జైపాల్ రెడ్డి జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జైపాల్‌రెడ్డి దేశంలో ఉత్తమ పార్లమెంటేరియన్‌గానే కాకుండా తెలంగాణ ప్రజలకు ఆకాంక్ష కోసం దేశంలోని అన్ని రాజకీయ పార్టీలతో సమన్వయం చేసి అత్యంత కీలకపాత్ర పోషించిన మహబూబ్‌నగర్ మట్టి బిడ్డ అని ఆయన చెప్పారు. మచ్చలేని వ్యక్తిత్వం అద్భుతమైన వాగ్ధాటి, ఎవరితోనైనా కలిసిపోయే గొప్ప వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి ఈ కాలంలో మన మధ్యలో ఉండడం మన అదృష్టం అన్నారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి స్ఫూర్తి పురస్కారం 2025ను దుప్పల్లి శ్రీరాములుకు, వరకవుల నరహరి రాజుకు అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జేపీఎన్సి చైర్మన్ కేఎస్ రవి కుమార్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, కె.యాదవ రెడ్డి, ఎక్స్ ఎమ్మెల్సీ, వి.మనోహర్‌రెడ్డి, కేవిఎన్ఆర్, బలగం ఫేం మధు, యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అవేజ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అద్భుతమైన కార్యక్రమం

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అద్భుతమైన కార్యక్రమం అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఐడిఓసిలో జరిగిన రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు అమలుపైన జరిగిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సమన్వయ సమావేశంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావుతో పాటు ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, సహచర ఎమ్మెల్యేలు మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్), వాకిటి శ్రీహరి, అనిరుధ్ రెడ్డి మేఘా రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి, రాజేష్ రెడ్డి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌లో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 వేల కోట్ల రూపాయలతో 25లక్షల మంది రైతులను రుణ విముక్తులను చేశామని, అదే స్థాయిలో ఈ రైతు రుణమాఫీ పథకాన్ని అధికారులు ప్రచారం చేయలేదని ఆయన మండి పడ్డారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా రావాలంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం 20 పనిదినాలు పని చేయాలని, అలాంటి వారికి మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వస్తుందని, కాబట్టి గ్రామాల్లో గ్రామసభల ద్వారా ఘంటాపథంగా తెలియజేయాలని ఆయన స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు విషయంలో సైతం అర్హులైన వారికి మాత్రమే కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్లాటు లేని, కిరాయి ఇంట్లో ఉండే ఇందిరమ్మ ఇండ్లు కేటాయింపు విషయంలో కూడా ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను వివరంగా వారికి వివరించాలని, ప్రతి ఈ ప్రభుత్వ పథకాన్ని ప్రచారం విరివిరిగా చేయాలని, ఈ పథకాలు అమల్లో ఎక్కడా పొరపాట్లు జరుగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.

మైనింగ్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలి

బ్లాస్టింగ్ ధాటికి ఇండ్లకు బీటలు : బిసి పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్

ప్రజాపక్షం / శ్రీరంగాపూర్ : అక్రమ మైనింగ్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలని బీసీ పొలిఇటికల్ జేఏసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం శ్రీరంగాపూర్ మండలం తాటిపాముల గ్రామంలో అక్రమంగా బ్లాస్టింగ్ చేస్తున్న ప్రాంతాన్ని, బ్లాస్టింగ్ వల్ల దెబ్బతిన్న ఇండ్లను గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రషర్ యజమానులు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా యథేచ్ఛగా బ్లాస్టింగ్ చేస్తున్నా కూడా అధికారులు చూసి చూడన్నట్లు వ్యవహరిస్తూ అక్రమ మైనింగ్ వ్యాపారులకు కొమ్ము కాస్తున్నారని మండిపడ్డారు. గ్రామంలో సంవత్సరాలుగా అక్రమంగా బ్లాస్టింగ్ చేస్తున్నారని, దీంతో ఇండ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని గ్రామంలోని ప్రజలు ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక భయంతో జీవిస్తున్నారన్నారు. బ్లాస్టింగ్ శబ్దానికి పిల్లలు, గర్భిణులు, వృద్ధులు, గుండె జబ్బులు ఉన్న వారు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అక్రమ మైనింగ్, బ్లాస్టింగ్ కార్యకలాపాలు స్థానిక పర్యావరణ వ్యవస్థకు కోలుకోలేని నష్టాన్ని కలిగించే అవకాశం ఉందన్నారు. అనుమతుల గురించి జిల్లా మైనింగ్ అధికారి, స్థానిక తహసీల్దార్ , ఎస్ఐలకు ఫోన్ చేసి అడగగా బ్లాస్టింగ్ చేయడానికి తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారని అన్నారు. సరైన అనుమతులు లేకుండా భద్రతా చర్యలు లేకుండా నిర్వహిస్తున్న అనధికార బ్లాస్టింగ్ కార్యకలాపాలను నిలిపివేసి, తాటిపాముల గ్రామంలోని నివాసితుల జీవితాలకు ఆస్తులకు రక్షణ కల్పించాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసి జిల్లా అధ్యక్షుడు వనం తిరుపతయ్యయాదవ్, రాష్ట్ర కార్యదర్శి వివిగౌడ్ , నాయకులు మహేందర్ నాయుడు, రాఘవేందర్ గౌడ్ , దేవర శివ, జితేందర్, మాజీ సర్పంచ్ బజారయ్య, నాగరాజు యాదవ్, వెంకటయ్య, పోషన్న, సుబద్రమ్మ, వెంకటమ్మ, సుశీలమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతి సభల గోడ పత్రిక ఆవిష్కరణ

ప్రజాపక్షం / మక్తల్ : జనవరి 21న హైదరాబాద్‌లో జరిగే , కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతి సభను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ సిపిఐ మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో మక్తల్ టౌన్‌లో కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతి సభల గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు ఎస్. కిరణ్ , సబ్ డివిజన్ కార్యదర్శి భగవంతులు మాట్లాడుతూ మహోపాధ్యాయుడు కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతి ముగింపు సభ లెనిన్ కృషిని రచనలను మననం చేసుకోవాలని 21 జనవరి 2025న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే వంద సంవత్సరాల ముగింపు సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మాస్ లైన్ పార్టీ నాయకులు పంచదేవుపాడు రాజు, వెంకటేష్ , భూమనంద, ఆనంద్ , నర్సింహ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ఎమ్మెల్యే పూజలు

ప్రజాపక్షం / పెద్దమందడి : పెద్దమందడి మండలం జంగమయ్యపల్లి గ్రామ శివారులో గల కొముల గట్టు వెంకటేశ్వర స్వామి వారికి శుక్రవారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యేకి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సంక్రాంతి పండుగ కనుమ మరుసటి రోజున కొముల గట్టు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా ఆయన ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రమేష్ గౌడ్, మాజీ సర్పంచ్ సతీష్ సుభాష్ గౌడ్, బాల్‌రాజ్, ఆంజనేయులు గౌడ్ , కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలపట్ల నిర్లక్ష్యం తగదు

ప్రజాపక్షం / వీపనగండ్ల : గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు అందించే వైద్య సేవలు పట్ల ఆరోగ్య ఆశా కార్యకర్తలు నిర్లక్ష్యం వహించొద్దని మండల వైద్యాధికారి డా.వంశీకృష్ణ, డా. రాజశేఖర్‌లు అన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉమ్మడి వీపనగండ్ల చిన్నంబాయి మండలాల్లోని ఆశా కార్యకర్తలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని, ప్రతి నెల ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్యులతో ఆరోగ్య సమస్యలను చూయించుకోవాలని, బలవర్తకమైన పోషక ఆహారాన్ని భుజించాలని అప్పుడే పుట్టిన బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. గ్రామాలలో పరిసరాల పరిశుభ్రతపై ఆశా కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని, గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజల ఆరోగ్యం కూడా బాగుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్స్ శ్వేత, కరుణశ్రీ, భాగ్యశ్రీ, సూపర్వైజర్ దయామణి, కళమ్మ, విజయకుమారి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

భరతనాట్యంలో దేదీప్య అద్భుత ప్రదర్శన వెల్లువెత్తిన అభినందనలు

ప్రజాపక్షం / వీపనగండ్ల : భాగ్యనగరంలోని బంజారా హిల్స్ పూరి జగన్నాథ్ ఆలయంలో కళింగ కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో వీపనగండ్ల గ్రామానికి చెందిన విద్యార్థి దేదీప్య అద్భుతమైన ప్రదర్శన ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళింగ కల్చరల్ ట్రస్ట్ చైర్మన్ మాట్లాడుతూ ప్రపంచ ఆధునిక సంగీతానికి అలవాటు పడుతున్న నేటి సమాజంలో శాస్త్రీయ కళలు భరతనాట్యం, కూచిపూడి విద్యార్థులు అద్భుతంగా ప్రదర్శించారని అభినందించారు. అద్భుతమైన ప్రదర్శన కనిపించిన విద్యార్థులకు జ్ఞాపికను ఇచ్చి సత్కరించారు. తన శిష్యులు అద్భుతమైన ప్రదర్శన చేసినందుకు గురువు నేహను ట్రస్ట్ చైర్మన్ సభ్యులు శాలువాతో సత్కరించారు.

ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

ప్రజాపక్షం / నారాయణపేట : జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వినియోగించకపోతే వాహనాలను సీజ్ చేయడం జరుగుతుంది. నారాయణపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రదాన రహదారిపై ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించి హెల్మెట్ లేని 23 వాహనాలను సీజ్ చేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కార్ నడిపే వారు సీట్ బెల్ట్ తప్పకుండా ధరించాలని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో వాహనానికి సంబంధించిన ఆర్సి డ్రైవింగ్ , లైసెన్స్ , ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. మద్యపానం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. వాహనాలకు నంబర్ ప్లేటు తప్పనిసరిగా వేయించుకోవాలని, నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపరాదని లేనియెడల చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ట్రిబుల్ రైడింగ్ వాహనాలు నడుపరాదని , రాష్ డ్రైవింగ్ చేయరాదని, మైనర్లు వాహనాలు నడుపురాదని సూచించారు. ఆటోలలో పరిమితికి మించి ప్రజలను విద్యార్థులను ఎక్కించుకోరాదని తెలిపారు.

జనసంద్రంగా మారిన ఊర్కొండ

ప్రజాపక్షం/ఊర్కొండ : నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ఊర్కొండ మండలకేంద్రంలో మాదారం మాజీ సర్పంచ్ కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ధ్యాప నిఖిల్‌రెడ్డి జన్మదిన వేడుకలు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అభిమానుల మధ్య ఘనంగా జన్మదినవేడుకలు జరుపుకున్నారు. అండగా ఉంటూ భరోసా ఇస్తూ ప్రజల హృదయాలలో నాటుకుపోయిన జనహృదయనేత ధ్యాప నిఖిల్ రెడ్డికి ఘనస్వాగతం పలికి కేక్ కట్ చేశారు. అనంతరం మండల రిపోర్టర్లు అందరూ కలిసి సన్మానం చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల జిల్లా, రాష్ట్రనాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పంట కాలువలో పారిశ్రామిక వ్యర్థ విష రసాయనాల విడుదల

ప్రజాపక్షం / పెబ్బేరు : జూరాల ప్రధానా ఎడమ కాలువకు అనుసంధానంగా ఉన్న డిస్ట్రిబ్యూటరీ 19 కాలువలో గుర్తు తెలియని వ్యక్తులు పారిశ్రామిక విషవ్యర్థ జలాలను విడుదల చేస్తున్నదుతో తమ వ్యవసాయ పొలాలు బునాదిపురం రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలే కాకుండా చెరువులో ఉన్న మత్స్య సంపదకు కూడా పారిశ్రామిక విష వ్యర్థ జలాలతో నష్టం జరుగుతుందని వారన్నారు. ఇప్పటికి రెండు సార్లు విష విడత జలాలను ఈ విధంగా జూరాల కాలంలో కలుపుతున్నారని, దీంతో భూగర్భ జలాలు విషతుల్యంగా మారుతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకొని చట్టపరంగా శిక్షించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంపొందిస్తాయి

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

ప్రజాపక్షం / పెద్దమందడి : క్రీడలు మనలో సంకల్ప శక్తిని, ఒడిదుడుకులను అధిగమించే సామర్థ్యాన్ని పెంచి ఆత్మవిశ్వాసాన్ని మరింత బలపరుస్తాయని ఎమ్మెల్యే టి. మెగారెడ్డి అన్నారు. పరిధిలోని వెల్టూరు గ్రామంలో గురువారం జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సీఎం కప్ 2025 క్రీడా పోటీలలో గెలుపొందిన క్రీడా కారులను మెమెంటోళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని, ఈ క్రమంలో నూతన స్టేడియాలను నిర్మిస్తూ , క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించి వారికి కావాల్సిన సదుపాయాలు సమకూర్చిన ఆర్. పెద్ద శ్రీనివాస్ రెడ్డిని ప్రత్యేకంగా శాలువాతో సన్మానించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామంలో గత 5 రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ క్రీడా పోటీల విజేతలకు ఆయన గురువారం బహుమతులను ప్రధానం చేశారు. ఉన్నత విద్యతో పాటు క్రీడలపై దృష్టి సారించి యువత సన్మార్గంలో నడవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు కె. రామకృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ ఆర్. శ్రీనివాస్ రెడ్డి, డిఎస్. మహేష్ , పెద్ద శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కొమ్ము వెంకటస్వామి, తహసీల్దార్ సరస్వతి, ఎంపిఓ పుష్ప, పంచాయతీరాజ్ ఏఈ, గ్రామ సెక్రటరీ వెంకటస్వామి, మాజీ ఎంపీటీసీలు వెంకటయ్య, దామోదర్ రెడ్డి, సత్యరెడ్డి, శివశంకర్ , సర్పంచులు తిరుపతిరెడ్డి, రమేష్, బాల్ చంద్రయ్య, రామచంద్రయ్య, రవి యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, వెంకటేష్, పట్నం సత్తన్న, శేఖర్, వివేక్ సాగర్, డీలర్ శ్రీనివాసులు, కర్ణాకర్ రెడ్డి, బాలు, క్రీడాకారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అండర్ డ్రైనేజ్ నిర్మాణానికి శంకుస్థాపన

పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామ వీవర్స్ కాలనీలో అండర్ డ్రైనేజీ నిర్మాణానికి గురువారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పారిశుద్ధ్య లోపానికి ప్రధాన కారణమయ్యే డ్రైనేజీ వ్యవస్థను పటిష్ట పర్చేందుకు వెల్టూరు గ్రామ వీవర్స్ కాలనీలో జిల్లా పరిషత్ నిధుల నుంచి 7 లక్షలు ఖర్చు చేసి అండర్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పనులను నాణ్యవంతంగా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంల

ఫోకస్

వ్యవసాయం

విత్తనాల సంరక్షకురాలు హర్షిత

ఒడిశాలోని కోలాపుట్‌కు చెందిన హర్షిత ప్రియదర్శిని మొహంతి పేరు ఇప్పుడు దేశ వ్యాప్తంగా మారుమోగుతున్నది. తొమ్మిదో తరగతి చదువుతున్న ఆమె 2023లో 'రైతుల హక్కులు.. విత్తనాల్లో జీన్యువైవిధ్యం' అనే అంశంపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొనే అరుదైన అవకాశాన్ని దక్కించుకుంది. ఆ గుర్తింపు సంపాదించడం వెనుక ఆమె పట్టుదల, కృషి ఉన్నాయి. సేంద్రియ వ్యవసాయానికి పెద్దపీట వేసి, నిరంతరం ఆ తరహా విధానాలను ప్రచారం చేసిన కమలా పుజారీ స్ఫూర్తితో హర్షిత కూడా వ్యవసాయ రంగంపై దృష్టి పెట్టింది. ఒకవైపు చదువును కొనసాగిస్తూనే, మరోవైపు సంప్రదాయ వ్యవసాయ విధానాలను అధ్యయనం చేస్తున్నది. ప్రత్యేకించి విత్తనాల్లో జీన్యువైవిధ్యాన్ని ఆమె నిసితంగా పరిశీలిస్తున్నది. ఇప్పటికే 180 రకాల దేశీయ వరి వంగడాలను సంరక్షించే కార్యక్రమాన్ని చేపట్టింది. అంతేగాక, 80 ఎక్కువ రకాల తృణ ధాన్యాలను కూడా హర్షిత గుర్తించి, వాటిని సంరక్షిస్తూనే, సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నది. సేంద్రియ వ్యవసాయ పరిరక్షణకు కంకణం కట్టుకొని, 2024 జులై 20న తుది శ్వాసవరకూ కృషి చేసిన కమలను హర్షిత మార్గదర్శిగా ఎంచుకుంది. 2022లో పద్మశ్రీ

అవార్డును స్వీకరించిన కమల మార్గాన్నే అనుసరిస్తూ, సేంద్రియ ఎరువులు, సాంప్రదాయ విధానాలు, మేలికరమైన వంగడాల ఉత్పత్తి వంటి పలు భారతీయ వ్యవసాయ పద్ధతులను హర్షిత ప్రోత్సహిస్తున్నది. విత్తనాలను సంరక్షిస్తున్నది. కమల తనకు అందించిన నాలుగు రకాల వరి విత్తనాలను ఆమె అసక్తికి బీజం వేశాయి. కనుమరుగవుతున్న దేశీయ రకాలను భవిష్యత్ తరాలకు అందించాలంటే, ముందుగా వాటిని సంరక్షించాలన్న ఆమె సూత్రాన్ని మనసవా, వాచా ఆచరిస్తున్నది. సుమారు ఏడాదిన్నర కాలంలో ఆమె విత్తనాల సంరక్షణకు విశేష కృషి చేసింది. ఇప్పుడు ఆమె విత్తన భాండాగారంలో వివిధ రకాల మిల్లెట్లతోపాటు, కలబడి, తులసి భోగ వంటి విభిన్న వరి రకాలు కూడా ఉన్నాయి. హర్షిత విత్తనాలను ప్లాస్టిక్ డబ్బాలు, మట్టి కుండలలో నిలువ చేస్తుంది. చీడ పీడల నుంచి రక్షించడానికి వేప మాత్రలను ఉపయోగిస్తున్నది. ఇప్పటి వరకూ 50 రైతులకు విత్తనాలను పంపిణీ చేసింది. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, దేశీయ పంటలను సంరక్షించడం ఆమెకు నిత్యకృత్యమయ్యాయి. భవిష్యత్తులో వ్యవసాయ శాస్త్రవేత్త కావాలన్న హర్షిత సంకల్పం నెరవేరుతుందని ఆశిద్దాం.

మానవ తప్పిదాలతోనే కార్చిచ్చు!

కాలిఫోర్నియా కార్చిచ్చు దాదాపుగా అదుపులోకి వచ్చినా, అది సృష్టించిన బీభత్సం నుంచి అమెరికా కోలుకోవడానికి కొన్ని దశాబ్దాలు పట్టడం ఖాయం. ఇంత వరకూ 25 మంది మరణించారని అధికారిక ప్రకటన వెలువడింది. అయితే, ఆచూకీ లేకుండాపోయిన మరికొంత మంది పరిస్థితి ఏమిటనే ఆందోళన వ్యక్తమవుతున్నది. కాలిఫోర్నియా ప్రాంతంలో దావాగ్ని ప్రజ్వలించడం, వేలాది ఎకరాల అటవీ సంపద ఆహుతికావడం ఇదే మొదటిసారి కాదు. ఆఖరిసారి అనుకోవడానికి కూడా వీల్లేదు. ఈ విధంగా కార్చిచ్చులు తరుచు ఎగిసిపడడానికి సహజ ప్రకృతి ప్రకోపంతో పాటు మానవ తప్పిదాలు కూడా కారణం అవుతున్నాయి. ప్రతికూల వాతావరణ మార్పులతో

సగటు ఉష్ణోగ్రతలు పెరగడం, భూ ఉపరితలం పూర్తిగా ఎండలకు ఎండుతూ పొడిబారడం జరుగుతోంది. వరుసగా రెండేళ్లు (2023, 2024) ఏడాది అత్యంత వేడి కలిగిన వడ గాలులను చవిచూసాయి. అటు తీవ్రమైన వడగాలులు, ఇటు పచ్చదనం ఎండిపోయి పొడిబారడంతో అగ్నికి ఆజ్యం పోసినట్లు కార్చిచ్చు వేగంగా ఇతర ప్రాంతాలకు విస్తరిస్తూ, అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నాలకు సహితం లొంగడం లేదు. ప్రతికూల వాతావరణ మార్పుల కారణంగా కార్చిచ్చులు గంటకు 70 మైళ్ల వేగంతో వీస్తున్న వడగాలులు తోడవడం, అడవుల్లో ఎండిపోయిన వృక్ష సంపదకు మంటలు సులభంగా వ్యాప్తి చెందడానికి ఊతం ఇవ్వడం, కరువుకాటకాలు వెంటాడడం, గాలిలో తేమ తగ్గడం, వర్షపాతం సగటు కన్న చాలా తక్కువగా నమోదు కావడం, ఉష్ణోగ్రతలు అతిగా రికార్డు కావడం, అటవీ ప్రాంతాలకు దగ్గరగా అర్బన్ కాలనీలు నిర్మింపబడడం (వైల్డ్‌ఫ్లాండ్‌అర్బన్ ఇంటర్‌ఫేజ్) లాంటి పలు కారణాలతో నేటి కార్చిచ్చు ప్రభావంతో తీవ్రమైన నష్టం వాటిల్లుతున్నది. సాధారణంగా మేఅక్టోబర్ వరకు కనిపించే కార్చిచ్చులు నేడు ఏడాది కాలం పాటు కనిపించడం రాబోయే ప్రమాదానికి హెచ్చరికగా తీసుకోవాలి. ఈ సీజన్లో తక్కువగా కనిపించే కార్చిచ్చులు నేడు తీవ్ర స్థాయిలో ఎగిసి పడడంతో అమెరికన్లు సహితం ఆశ్చర్యపోతూ, నిస్సహాయంగా చూస్తూ నిలబడవలసి వస్తున్నది. 2020, 2021లో నమోదైన కార్చిచ్చుల ఫలితంగా ఇప్పటికే దాదాపు 7 లక్షల హెక్టార్ల ప్రాంతం కాలి బూడిదగా మారిపోతూ బిలియన్ డాలర్ల ఆస్తి నష్టమై కాకుండా ప్రాణ నష్టం కూడా చవిచూడడం గమనించారు. కార్చిచ్చుల ప్రభావం కాలిఫోర్నియా ప్రాంతానికే పరిమితం కాలేదని గమనించాలి. ప్రపంచ వ్యాప్తంగా పలు సందర్భాల్లో అనేక దట్టమైన కారడవులు అడవులు అగ్నికి ఆహుతి కావడం చూసాం. వాతావరణ మార్పులతో ప్రతి ఏడాది సగటు ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగడం, వర్షపాతం తగ్గడం, వడగాలులు వీచడం, గాలిలో తేమలు తగ్గడం లాంటి పలు కారణాలతో రోజు రోజుకు ప్రపంచ దేశాలు కార్చిచ్చుల రూపంలో అగ్ని ప్రమాదాలకు దగ్గర అవుతున్నట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు. వాతావరణ ఉష్ణోగ్రతలు పెరిగిన కొద్దీ కార్చిచ్చుల ప్రమాదాలు కూడా పెరుగుతున్నాయి. నేడు అభివృద్ధి పేరుతో అభివృద్ధి చెందిన దేశాలు విడుదల చేస్తున్న విచక్షణారహిత కార్బన్ ఉద్గారాలతో వాతావరణ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగడం, కార్చిచ్చులను ఉసిగొల్పడం కొనసాగుతున్నది. ఎవరు తీసిన గోతిలో వారే పడుతున్నారు.

వ్యవసాయంలో సమాచార సాంకేతికత

సాంకేతిక పరిజ్ఞానం అన్ని రంగాల్లోనూ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతున్నది. వ్యవసాయ రంగంలోనూ సరికొత్త వ్యవస్థలు అందుబాటులోకి వచ్చాయి. వీటిలో ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసిటి) అత్యంత కీలకమైనది. వ్యవసాయ రంగంలో ఈ సాంకేతికతను ఇ–అగ్రికల్చర్‌గా పిలుస్తారు. ఇది మెరుగైన సమాచార ప్రక్రియలపై దృష్టి సారించి, వ్యవసాయాభివృద్ధికి ఊతమిస్తుంది. ఇ–వ్యవసాయం అనేది వ్యవసాయంపై ప్రాథమిక దృష్టితో గ్రామీణ ప్రాంతంలో సమాచార, కమ్యూ నికేషన్ టెక్నాలజీలను (ఐసిటిలు) ఉపయోగించ డానికి వినూత్న మార్గాల రూపకల్పన, అభివృద్ధి, మూల్యాంకనం, అనువర్తనానికి ఉపయోగిస్తారు. ఐసిటిలో పరికరాలు, నెట్‌వర్క్ మొబైల్స్, సేవలు, అప్లికేషన్లు ఉంటాయి. మరో రంగా చెప్పాలంటే, వినూత్న ఇంటర్నెట్ సాంకేతికత, సెన్సార్ల నుంచి టెలిఫోన్ల వరకూ.. రేడియోల నుంచి ఉపగ్రహాల వరకూ అనేక రకాలైన సమాచార సేవలను వ్యవసాయదారులు వినియోగించుకునే వీలుంది.

తద్వారా వ్యవసాయ సంబంధ విధివిధానాలు, సలహాలు, సూచనలను ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం లభిస్తుంది. వ్యవసాయం లో అనేక ఐసిటి లేదా ఇ–వ్యవసాయం ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చెందుతున్నది. వాతావరణ పరిస్థితుల నుంచి చీడలు.. తెగుళ్ల వరకూ వ్యవసాయానికి అవసరమైన సమస్త సమాచారం రైతులకు క్షణాల్లో అందుతున్నది. వ్యవసాయ అధికారులతో సంప్రదించడం, వారి సూచనలు పొందడం ఇప్పుడు సులభతరమైంది. వ్యవసా యంలో నష్టాలు తగ్గి, లాభాలు పెరగడం ఆరం భమైంది. వ్యవసాయ రంగంలో జీవనోపాధి కూడా మెరుగుపడుతుంది. దిగుబడిని పెంచడం నుంచి ఆహార భద్రతను మెరుగుపరచడం వరకూ అనేక రకాలుగా సమాచార సాంకేతికత రైతులకు అందుబాటులో ఉంది. దీనిని విప్లవాత్మక మార్పుగా పేర్కోవాలి.

నీటి వనరుల సరరక్షణ ప్రస్తుతావసరర

భూగర్భ జలాలు క్రమంగా తగ్గిపోవడం, తీవ్రమైన ఉష్ణోగ్రతల కారణంగా జలావనరులు క్షీణించడం వంటి కారణాలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, ప్రత్యేకించి వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతింటున్నది. నీటి వనరుల సంరక్షణ ఆవశ్యకతను గుర్తు చేస్తున్నది. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ పది ఉత్తమ పనితీరు కనబరుస్తున్న రాష్ట్రాల్లో ప్రధాన మంత్రి సంచా యీ యోజన (పిఎంకెఎస్‌వై) కింద వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కాంపోనెంట్ (డబ్ల్యుడిసి) 2.0 ప్రాజెక్టును చేపట్టడం ఆహ్వానించతగిన పరిణామం. రాజస్థాన్, మధ్యప్రదేశ్, కర్ణాటక , ఒడిశా, తమిళనాడు, అస్సాం, నాగాలాండ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, సిక్కిం రాష్ట్రాలను ఈ ప్రాజెక్టు కోసం ఎంపిక చేసి, 56 కొత్త వాటర్‌షెడ్ అభివృద్ధి ప్రాజెక్టులు మంజూరు చేశారు. 2.8 లక్షల హెక్టార్లలో పునరుజ్జీవనం సాధ్యమవుతుందని అంచనా. పిఎంఎస్‌కెవై డబ్ల్యుడిసి 2.0 అనేది నీరు, నేల వనరులను రక్షించుకోవడం కోసం చేపట్టిన విస్తృత ప్రాజెక్టు. ఈ పథకం 2009–10లో ఇంటిగ్రేటెడ్ వాటర్షెడ్ మేనేజ్మెంట్ ప్రోగ్రామ్ (ఐడబ్ల్యుఎంపి) గా ప్రారంభమైంది. 2015–16లో పిఎంకెఎస్‌వై వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కాంపోనెంట్‌లో విలీనమైంది. పిఎంకెఎస్‌వై డబ్ల్యుడిసి 2.0ను 2021–2026 కోసం మెరుగైన లక్ష్యాలు, మార్గదర్శకాలతో రూపొందించారు. సమీకృత వాటర్షెడ్ నిర్వహణ ద్వారా వర్షాధార, క్షీణించిన భూమి ఉత్పాదకతను మెరుగుపరచడం, జీవనోపాధి, వాటర్‌షెడ్ స్థిరత్వం కోసం కమ్యూనిటీ సంస్థలను బలోపేతం చేయడం, క్రాస్ లెర్నింగ్ మరియు ప్రోత్సాహకాల ద్వారా వాటర్షెడ్ ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని పెంచడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యాలు.

2021–2026 మధ్యకాలంలో 49.50 లక్షల హెక్టార్ల క్షీణించిన భూమిని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా చేసుకుంది. స్ప్రింగ్‌షెడ్ల పునరుజ్జీవనాన్ని కొత్తగా జోడించారు. హార్టికల్చర్, ఫిషరీస్, ఎపికల్చర్, పశుపోషణ వంటి పంటల వైవిధ్యం, సమీకృత వ్యవసాయ వ్యవస్థలను ప్రోత్సహించడానికి ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుంది. ఇది అనుకున్న లక్ష్యాలను చేరితే, దేశంలోని మిగతా ప్రాంతాల్లోనూ అమలు చేయడానికి అవకాశం ఏర్పడుతుంది.

ఇందిరమ్మ భరోసా పథకాన్ని షరతులు లేకుండా అందరికీ అందించాలి

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నేత ధనుంజయ నాయుడు

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ భరోసా పథకాన్ని ఎలాంటి షరతులు లేకుండా అందరికి అందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ధూళిపాళ ధనుంజయ నాయుడు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం కామ్రేడ్ ధర్మభిక్షం భవన్‌లో ఆయన మాట్లాడారు. వ్యవసాయం యాంత్రీకరణ అయిన నేపథ్యంలో అనేక మంది వ్యవసాయ కూలీలు గ్రామాల్లో ఉపాధి లభించక దగ్గరలోని పట్టణాలకు వలసలు వెళ్తున్నారన్నారు. ఆటో డ్రైవర్లుగా, సెక్యూరిటీ గార్డులు, హోటల్‌లో పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష రైతు సంఘాల నాయకుల అభిప్రాయాలను పరిగణలో తీసుకొని ఇందిరమ్మ భరోసా పథకాన్ని అందించాలన్నారు. ఆయన వెంట రెమిడాల రాజు ఉన్నారు.

జిఒ ప్రకారమే వేతనాలు

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్

ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని డిఎంఇ ఆసుపత్రుల్లో పనిచేయుచున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు గత 4 నెలలుగా జీతాలు అందక అనేక ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారని పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. గురువారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో ఆసుపత్రి సూపరిండెంట్ ప్రవీణ్‌కు వినతిపత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ పేషంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి జిఒ నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, డిఎంఇ పరిధిలోని ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పని చేస్తున్న కార్మికులకు బడ్జెట్ రాలేదనే నెపంతో కాంట్రాక్టర్లు గత 4 నెలలుగా జీతాలు ఇవ్వకుండా ఉన్నారని, వెంటనే బడ్జెట్ విడుదల చేసి కార్మికులకు జీతాలు అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రతినెల బ్యాంకు ధర వేతనాలు ఐదవ తేదీ లోపు చెల్లించాలని పండుగ సెలవులను ఇవ్వాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు పిడుగు శంకర్, హాస్పిటల్ ప్రెసిడెంట్ శ్రీశైలం, సిబ్బంది గుణవంతురావు, మారుతి, నీల కమలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి
రాజీలేని పోరాటాలు

సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతురావు

ప్రజాపక్షం/కొణిజర్ల : రైతన్నల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేయనున్నట్లు సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. మండల పరిదిలోని తనికెళ్లలో రైతుసంఘం గ్రామశాఖ మహాసభ సిపిఐ కార్యాలయంలో గుమ్మిడెల్లి సైదారావు అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ నరేంద్రమోడీ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయరంగం కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తూ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేందుకు నిరంతరం కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను పాలకులు విస్మరిస్తున్నారని విమర్శించారు. రైతు ఉద్యమాన్ని ఆపాలని చూసే కుట్రలను మానుకోవాలని లేకుంటే గల్లీ నుంచి ఢిల్లీ దాకా రైతుల ఐక్య ఉద్యమాలు కొనసాగిస్తామని ఆయన హెచ్చరించారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు సమగ్ర వ్యవసాయ పంటలకు మద్దతు ధర చట్టం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సాదాబైనామాద్వారా రైతులందరికి పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని, పంటల భీమా పథకం ఏర్పాటు చేసి అమలు చేయాలన్నారు.

గ్రామగ్రామాన వ్యవసాయ గోదాములు నిర్మించాలని రైతులకు హెల్త్ ఇన్సూరెన్స్ పది లక్షల వరకు వర్తించేలా కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మహాసభలో రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరా వు, సిపిఐ జిల్లా నాయకులు యర్రా బాబు, పివిరావు, కూచిపూడి రవి, సిపిఐ తనికెళ్ల గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు, రైతుసంఘం మండల కార్యదర్శి తండు సోమయ్య, ఎస్‌టియు నాయకులు గడల భాస్కర్‌రావు, లేడిబోయిన గోపాల్‌రావు, రైతునాయకులు పెదమల్ల రత్తమయ్య, లకావత్ రాములు, బాసా నాగరా జు, తదితరులు పాల్గొన్నారు.

తనికెళ్ల గ్రామ రైతుసంఘం అధ్యక్ష, కార్యదర్శి ఎన్నిక

తనికెళ్లలో నిర్వహించిన రైతుసంఘం గ్రామశాఖ మహాసభలో రైతుసంఘం అధ్యక్షుడిగా గుమ్మిడెల్లి సైదారావు, ప్రధాన కార్యదర్శిగా లకావత్ రాములు, ఉపాధ్యక్షులుగా ఆకుతోట శంకర్ రావు, జి రామారావు, బి రామారావు, కోశాధికారిగా పొట్లపల్లి నరేష్, ఆర్థనైజింగ్ కార్యదర్శిగా శ్రీనివాసరావుతో పాటు 13 మంది కమిటి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

'భవన నిర్మాణ' కార్మికులు ఐక్య పోరాటం

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : భవన, నిర్మాణ కార్మిక సంఘం నిర్మల్ జిల్లా సమావేశం సిపిఐ కార్యాలయంలో కామ్రేడ్ ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ మాట్లాడుతూ భవనిర్మాణ కార్మికుల సమస్యలు రోజురోజుకు తీవ్రతరం అవుతున్నాయని అన్నారు. నిర్మల్ జిల్లాలో యుపి, ఎంపి, రాజస్థాన్‌ల నుండి వచ్చే కార్మికులు ఇక్కడ కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారని,కార్మిక చట్టాలు గాని, యూనియన్ నియమ నిబంధనలు పాటించడం లేదన్నారు. కార్మిక చట్టం ప్రకారము 8 గంటల పని చేయాలని, యూనియన్‌లో సభ్యత్వం తీసుకుని నిబంధనలు పాటించాలని అన్నారు. జిల్లాలోని భవననిర్మాణ కార్మికులు ఐక్యమత్యంతో పోరాటం చేయాలన్నారు.

మండల మహాసభలు నిర్వహించడానికి తేదీలు బైంసాలో 21, ఖానాపూలర్‌లో ఫిబ్రవరి 1న నిర్మల్‌లో ఫిబ్రవరి 05న జరపడానికి తీర్మానించారు. అదేవిధంగా జిల్లా మహాసభలు ఫిబ్రవరి 24న నిర్వహించడానికి నిర్ణయించమన్నారు. మండల మహాసభలు విజయవంతం చేయాలని, పిలుపునిచ్చారు. భవనిర్మాణ కార్మికులు మేస్త్రీలు, పేయింటర్లు, పిఒప్, వడ్రంగులు, వర్ధర్లు, కార్పెంటర్లు, ప్లంబర్, ఎలక్ట్రిషన్లు, అదేవిధంగా 19 రకాల భవనిర్మాణ కార్మికులు ఈ మహాసభలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండల మాసభలు, జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని, సభ్యత్వం కూడా చెల్లించాలని భవనిర్మాణ కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుమార్, నజీర్, అంబదాస్, ఉపాలి, చిలుకూరిస్తారి,లతీఫ్, బాలు,కడకుంట్ల నర్సింలు, భూక్య రమేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఎన్ని కుట్రలు చేసినా ఎర్రజెండా రెపరెపలు...

ప్రజాపక్షం/బోథ్ : భారత కమ్యూనిస్టు పార్టీ పేద ప్రజల పక్షాన, కార్మికుల పక్షాన అలుపెరుగని పోరాటాలు నిర్వహించిందని చరిత్ర కలిగిన బోథ్ సిపిఐ పార్టీ కొన్ని శక్తులు కావాలని కుట్రతో పార్టీ జెండాపై దాడి చేయడం పిరికితనమని కుట్రలకు సిపిఐ ఏనాడు భయపడలేదని సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. గురువారం బోథ్‌లో స్థానిక ఎఐటియుసి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పన్నుల పేరుతో ప్రజలను దోచుకుంటుందని దేశం కొందరు వ్యక్తుల ద్వారా నడుస్తుందని ఈ సందర్భంగా ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వంద శాతం రుణమాఫీ చేయాలని అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు, నూతన బీడీ కార్మికులకు పెన్షన్ అందించాలని, రేషన్ కార్డులు జారీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కుంటాల రాములు, గోవర్ధన్, నరేష్, మున్సిఫ్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 30, 31తేదీల్లో బీడీ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలు

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : బీడీ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండని యూనియన్ జిల్లా అధ్యక్షులు ఓమయ్య అన్నారు. గురువారం ఎఐటియుసి ఆధ్వర్యంలో రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ ఈనెల 30, 31లలో కోరుట్లలో జరిగే రాష్ట్ర 2వ మహాసభలను జయప్రదం చేయాలని ఎఐటియుసి కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించి ఓమయ్య మాట్లాడారు. బీడీ కార్మికుల సంక్షేమం కోసం గత 50 సంవత్సరాలుగా నిరంతరం పోరాడుతూ కార్మికుల చట్టాలు సాధించి పెట్టిన ఏకైక ఫెడరేషన్ ఎఐటియుసికి సంబంధించి డివర్కర్స్ ఫెడరేషన్ అని ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలు కోరుట్లలో జరుగుతున్నందున జిల్లాలోని బీడీ కార్మికులు, టేకేదారులు, బట్టి కార్మికులు, గుమాస్తాలు ఈ సహాసభలో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ మహాసభల్లో బీడీ పరిశ్రమపై జిఎస్‌టి నెత్తివేయాలని 26 రోజుల పని నాణ్యమైన తునికాకు, తంబాకు వేయాలని ఇపిఎఫ్ ద్వారా రాజీనామా చేసిన కార్మికులకు 6 వేల కనీస పెన్షన్ అమలు చేయాలని, 100 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని, ఎన్నికల హామీలో భాగంగా 4016 జీవనభృతి ఇవ్వాలని, అర్హులైన కార్మికులందరికి ఇళ్ల స్థలాలు కేటాయించిన ఇల్లు నిర్మించి ఇవ్వాలని, తదితర డిమాండ్లపై చర్చించి పోరాట కార్యక్రమాన్ని తీసుకోవటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి భానుచందర్, గౌరవ అధ్యక్షులు చక్రపాణి, మహేష్, మల్లుబాయి, సాబేరబేగం, తస్లీమా బేగం పాల్గొన్నారు.

మహానగరి

నేడు షాబాద్‌కు కెటిఆర్!

ప్రజాపక్షం/షాబాద్ : నేడు షాబాద్‌కు బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ వస్తున్నట్లు మాజీ జడ్‌పిటిసి పట్నం అవినాష్ రెడ్డి గురువారం ఒ ప్రకటనలో తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో రైతులకు పంట పెట్టుబడి సహాయం అందరికి వచ్చేంది. అధికరారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని ప్రభుత్వానికి కనువింపు కలిగే విధంగా షాబాద్‌లో రైతు నిరసన దీక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం వరకు షాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో మాజీ మంత్రి కెటిఆర్ రైతు నిరసన దీక్ష చేస్తున్నట్లు తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల పరిశీలన

ప్రజాపక్షం/నార్సింగి: రంగారెడ్డి జిల్లా పాలనాధికారి ఆదేశాల మేరకు మణికొండ పురపాలక సంఘం పరిధిలోనీ వార్డులలో ఇందిరమ్మ ఇండ్ల , రేషన్ కార్డు లబ్ధిదారులను మునిసిపల్ కమీషనర్ ప్రదీప్ కుమార్ ,మేనేజర్ శ్రీధర్ పరిశీలిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కోదండరామ్‌ను కలిసిన గ్రంథాలయ కమిటీ నూతన పాలకవర్గం

ప్రజాపక్షం/షాద్‌నగర్: తెలంగాణ ఉద్యమనేత, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కొదండరాంను గురువారం హైదారాబాద్‌లో షాద్‌నగర్ గ్రంథాలయ కమిటీ నూతన పాలకవర్గం నాయకులు కలిశారు. ఈ నెల 20వ తేదీ సోమవారం నిర్వహించే షాద్‌నగర్ గ్రేడ్1 గ్రంథాలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరుకావాలని ఎమ్మెల్సీని కోరారు. కార్యక్రమంలో కె మదన్ మోహన్‌రెడ్డి, టిజి శ్రీనివాస్, ఎన్ బాల్‌రాజ్ యాదవ్, కె చంద్రశేఖర్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలపై పెరిగిన ఆసక్తి

ప్రజాపక్షం/షాద్‌నగర్: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలపై ఆసక్తి పెరిగిందని మహాబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌కుమర్‌రెడ్డి అన్నారు. గురువారం ఫరూక్‌నగర్ మండల పరిధిలోని కొంగగూడలో క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదగాలని కోరారు. టోర్నమెంట్ విజేతగా నిలిచిన ఆర్సిబి జట్టుకు, రన్నర్‌గా నిలిచిన గుజరాత్ జట్లకు షీల్డ్‌లను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్ నాయక్, అజయ్ నాయక్, పాపయ్య యాదవ్, రవి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ మున్సిపాలిటీ అన్ని రంగాల్లో ముందంజ

ప్రజాపక్షం/నార్సింగి: రాజేంద్రనగర్ నియోజకవర్గంలోనే శంషాబాద్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ముందు ఉంచామని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్. గురువారం శంషాబాద్ మున్సిపాలిటీ లోని రాళ్లగూడ, ఇంద్రరెడ్డి నగర్ కాలనీలో రూ.70 లక్షల టియుఎఫ్ఐడిసి నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌కు ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంషాబాద్ మున్సిపాలిటీ ఏర్పడిన నాటి నుండి నేటి వరకు దాదాపు రూ.200 కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులను చేపట్టి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ముందంజలో ఉంచడం జరిగిందని ఆయన అన్నారు. రానున్న రోజుల్లో కూడా పార్టీలకతీతంగా మున్సిపల్ అభివృద్ధికి అందరం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో చైర్మన్ సుష్మా మహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, కమిషనర్ సుమన్ రావు, సీనియర్ నాయకులు గణేష్ గుప్తా , దూడల వెంకటేష్ కౌన్సిలర్లు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు...

సర్వే ప్రక్రియ పరిశీలించిన కమిషనర్

ప్రజాపక్షం/రాజేంద్ర నగర్ : రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డుల లబ్ధిదారుల సర్వే ప్రక్రియను బండ్లగూడ జాగీర్ మున్సిఫల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్ చంద్ర అధికారులతో కలిసి పరిశీలించారు. గురువారం ఆయన 1వ డివిజన్‌లోని విద్య నగర్ కాలనీలో,2వ డివిజన్ పరిధిలోని గంధగూడ,3వ డివిజన్‌లోని మాధవి నగర్ కాలనీలో సర్వే ప్రక్రియను పరిశీలించారు. దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం సర్వే చేసి లబ్ధిదారులను గుర్తించాలని ఫీల్డ్ వేరిఫికేషన్ ఆఫీసర్లకు తెలియజేశారు. ఈకార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు,ఫీల్డ్ వెరిఫికేషన్ ఆఫీసర్లు,మున్సిఫల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థినిపై అత్యాచారం?

ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం : ఇంజినీరింగ్ విద్యార్థినీపై ఓ రియల్ ఏస్టేట్ యజమాని డ్రైవర్ అత్యాచారం చేసిన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోనికి వచ్చింది. ఈ సంఘటనకు సంబందించిన వివరాలు తల్లిదండ్రుల తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజక వర్గం పరిధిలో ఆదిభట్ల మున్సిపాలిటీ మంగల్‌పల్లి గ్రామం సమీపంలో సాయిబాబా దేవాలయం ప్రక్కన ఓ ప్రవేట్ హస్టల్‌లో మొదటి సంవత్సరం విద్యార్థినీ నివాసం ఉంటున్నట్లు పేర్కొన్నారు. అయితే హస్టల్ గదిలో ఒంటరిగా ఉన్న విద్యారిని(18)పై ఓ రియల్‌ఏస్టేట్ యజమాని డ్రైవర్(22) అత్యాచారం చేసినట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ సంఘటనపై విషయం తెలుసుకున్నా తల్లిదండ్రులు హూటాహుటిన ఆదిభట్ల పోలీసులకు ఫిర్యాదు చేయటంతో తక్షణమే అమ్మాయిని వైద్యా చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ఆసుపత్రికి తరలించి తల్లిదండ్రుల ఫిర్యాదు మెరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

ఘనంగా రథోత్సవం

ప్రజాపక్షం/కొందుర్గు: మండల పరిధిలోని వెంకిర్యాల శివారులోని సంజీవపురం శ్రీవెంకటేశ్వర స్వామి బ్రహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం 5 గంటలకు రథోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం ఆవరణలో రథాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో లాగారు. అనంతరం స్వామి వారి పల్లకి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాఘవేందర్ గౌడ్, విశ్వనాథ్‌పూర్ మాజీ సర్పంచ్ లంకాల రామకృష్ణారెడ్డి, వెంకిర్యాల మాజీ సర్పంచ్ లింగమయ్య గౌడ్, నాయకులు మాసయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 'పోలీస్ స్టాల్'

ప్రాంభించిన సిపి సివి ఆనంద్

ప్రజాపక్షం/హైదరాబాద్: ట్రాఫిక్ భద్రత, మహిళల భద్రత, సైబర్ క్రైమ్‌లపై అవగాహన కల్పించేందుకు నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో హైదరాబాద్ సిటీ పోలీస్ స్టాల్‌ను పోలీసు కమిషనర్ సి.వి.ఆనంద్ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ కమిషనర్ పి.విశ్వ ప్రసాద్, ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి సురేందర్ రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.హైదరాబాద్ సిటీ పోలీసులు ట్రాఫిక్ మేనేజ్మెంట్, ఇతర ముఖ్యమైన సేవలకు ఉపయోగించే అధునాతన సాంకేతికతలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ స్టాల్ ఏర్పాటు చేసినట్లు సి.వి.ఆనంద్ తెలిపారు. ప్రతి ఏటా పెద్ద సంఖ్యలో సందర్శకులను ఆకర్షిస్తున్న ఈ ఎగ్జిబిషన్ చారిత్రక ప్రాధాన్యతను పోలీస్ కమిషనర్ హైలైట్ చేశారు. ఈ పోలీసు ఎగ్జిబిషన్‌ను ప్రజలు ముఖ్యంగా తమ పిల్లలతో సందర్శించి ట్రాఫిక్ భద్రత, ట్రాఫిక్ నియమాలను పాటించడంపై అవగాహన పెంచుకోవాలని సిపి కోరారు. రోడ్డు భద్రతా విద్యను చిన్న వయస్సులోనే ప్రారంభించాలని ఉద్ఘాటించారు. 45 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ రద్దీ ,సాధారణ ట్రాఫిక్‌ను నిర్వహించడంలో ట్రాఫిక్ పోలీసు అధికారుల కృషిని కమిషనర్ అభినందించారు. కమిషనర్ తన ప్రసంగంలో, పోలీస్ స్టాల్ కోసం స్థలాన్ని అందించినందుకు ఎగ్జిబిషన్ సొసైటీకి కృతజ్ఞతలు తెలిపారు. విద్యా కార్యక్రమాలను నిర్వహించడంలో వారి చొరవను ప్రశంసించారు, భవిష్యత్తులో ఎగ్జిబిషన్ సొసైటీకి మద్దతు కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్ ట్రాఫిక్ అదనపు పోలీసు కమిషనర్ విశ్వ ప్రసాద్ మాట్లాడుతూ కోటి మందికి పైగా జనాభా ఉన్న హైదరాబాద్‌లో అందరికి ట్రాఫిక్ రూల్స్ పాటించాలని చెప్పలేము. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పొందాలని అన్నారు.

జూనియర్ అసిస్టెంట్ల మూడో బ్యాచ్‌కు ప్రారంభమైన శిక్షణ

ప్రజాపక్షం/హైదరాబాద్ : జలమండలికి కొత్తగా కేటాయించిన జూనియర్ అసిస్టెంట్‌ల మూడో బ్యాచ్‌కు గురువారం శిక్షణ ప్రారంభమైంది. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ శిక్షణను ఈ.డి. మయాంక్ మిట్టల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలమండలిలో ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉండాలన్నారు. పనిలో పారదర్శకత పాటించాలని సూచించారు. ఇతరులకు ఆదర్శంగా ఉండాలన్నారు. బోర్డు ప్రతిష్ఠను కాపాడేలా పనిచేయాలన్నారు. రెండు సెషన్లుగా జరిగిన ఈ కార్యక్రమంలో ఈఎన్‌సి, రెవెన్యూ డైరెక్టర్ వి.ఎల్. ప్రవీణ్ కుమార్, పి అండ్ ఏ సిజిఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్‌లు వారికి బోర్డు పరిపాలన తీరు, ప్రజలకు అందించే సేవలు, కార్యాలయాల్లో నిర్వహించాల్సిన విధులపై సమగ్రంగా వివరించారు. బోర్డు హైరార్కి, విధి విధానాలు, అంతర్గత శాఖలు, సేవలు, నిబంధనలు, ఉద్యోగుల సౌకర్యాలు తదితర వాటి గురించి తెలిపారు.

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత

ప్రజాపక్షం/కొందుర్గు: చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని మాజీ వైస్ ఎంపిపి రాజేష్ పటేల్ అన్నారు. గురువారం మండల పరిధిలోని శ్రీరంగాపూర్, భైరంపల్లి గ్రామాల్లో క్రికెట్ టోర్నమెంట్ల ముగింపు కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందుర్గు మండల కేంద్రంలో ప్రతి సంవత్సరం వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ టోర్నమెంట్లను నిర్వహించడం వల్ల కొందుర్గు మండల కేంద్రం క్రీడలకు నిలయంగా మారిందని, దీని వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన ఎంతో మంది క్రీడాకారులు వెలుగులోకి వస్తున్నారని, సంక్రాంతి పండుగ సమయంలో మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో క్రికెట్ పోటీలను నిర్వహించడం అనవాయితీగా మారిందని అన్నారు. రెండు టోర్నమెంట్ల విజేత జట్లకు బహుమతులను, షీల్డ్‌లను అందజేశారు. అలాగే మండల పరిధిలోని చెక్కలోనిగూడ ప్రీమియర్ లీగ్ సీజన్ 4 గురువారం ముగిసింది. అయా కార్యక్రమాల్లో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, నాయకులు ఎదిరే రామకృష్ణ, బి రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బలవంత్ రెడ్డి, రవి గౌడ్, జనార్దన్ గౌడ్, గండెటి విజయ్‌కుమార్, రమేష్, దర్గా రాంచంద్రయ్య, నర్సింహ్మారెడ్డి, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణం... ఎమ్మెల్యేగా మీ విజయానికి తొలిమెట్టు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ప్రశంసించిన ప్రొఫెసర్ హరగోపాల్

ప్రజాపక్షం/షాద్‌నగర్: షాద్‌నగర్ పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణం ఎమ్మెల్యేగా మీ విజయానికి తొలిమెట్టని ప్రొఫెసర్ హరగోపాల్ వీర్లపల్లి శంకర్‌ను ప్రశంసించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ప్రొఫెసర్ హరగోపాల్ కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రొఫెసర్ హరగోపాల్‌కు శాలువాతో సన్మానం చేసి, పాదాభివందనం చేశారు. నూతన భవనం నిర్మాణం జరుగుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్దకు ప్రొఫెసర్‌ను తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ ఎంతో మందిని విద్యావంతులను చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన భవనం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తీసుకున్న సంకల్పం ఎంతో గొప్పదని, తాను చదివిన మొగల్‌గిద్ద పాఠశాలతో పాటు నియోజకవర్గంలోని పలు పాఠశాల ల్లో చాలా సమస్యలు ఉన్నాయని, వాటిని పరిశీలించి పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. భవిష్యత్తులోను ఇలాంటి ఉన్నతమైన కార్యక్రమాలు చేపట్టి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రజల హృదాయాల్లో నిలిచిపోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాలమూరు ప్రజా వేదిక కన్వీనర్ రాఘవులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ మహ్మద్ అలీఖాన్ బాబర్, నాయకులు అగ్గనూరు విశ్వం, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, అగ్గనూరు బస్వం, ఇబ్రాహీం, అందె మోహన్, డంగు శ్రీనివాస్ యాదవ్, బాల్‌రాజ్ గౌడ్, మాధవులు, సయ్యద్ ఖదీర్, ముబారక్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

31వ తేదీలోపు ట్రేడ్ లైసెన్స్‌ల పునరుద్ధరించుకోవాలి

జిహెచ్ఎంసి

ప్రజాపక్షం/హైదరాబాద్ : నగరంలోని దుకాణదారులు, వాణిజ్య సంస్థల యజమానులు తమ వ్యాపారాలకు సంబంధించిన ట్రేడ్ లైసెన్స్ పునరుద్ధరించుకోవాలని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో జిహెచ్ఎంసి అధికారులు సూచించారు. ఈనెల 31వ తేదీలోపు ట్రేడ్ లైసెన్స్‌లను పునరుద్ధరించుకుంటే ఎలాంటి అపరదరుసుం లేకుండానే పునరుద్ధరణ జరుగుతుందన్నారు. ఫిబ్రవరి మొదటి తేదీ నుంచి మార్చి 31 వరకు అయితే 25 శాతం అపరదరుసుం, ఏప్రిల్ మొదటి తేదీ నుంచి 50 శాతం అపరదరుసుంతో ట్రేడ్ లైసెన్స్‌ల పునరుద్ధరణ జరుగుతుందన్నారు. కావును ఈనెలలోనే వ్యాపారులు, వాణిజ్య సంస్థల యజమానులు తమ తమ వ్యాపారాలకు సంబంధించిన ట్రేడ్ లైసెన్స్‌ల పునరుద్ధరించుకోవాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల సంకల్పంతో పాఠశాల అభివృద్ధికి పునాది

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి : పూర్వ విద్యార్థుల సంకల్పంతో మొగిలిగిద్ద పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు అభివృద్ధికి పునాది పడనుందని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. షాద్‌నగర్ నియోజక వర్గం ఫరుక్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలోని ఉన్నత పాఠశాల 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంలో ఈ నెల 31న నిర్వహించే ఉత్సవాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొననున్నందున పూర్వ విద్యార్థులు, ప్రొఫసర్ హరగోపాల్, స్థానిక శాసనసభ్యులతో కలిసి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి గురువారం పాఠశాల ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మొగిలిగిద్ద గ్రామనికి చెందిన ప్రొఫసర్ హర గోపాల్ రాష్ట్ర ముఖ్యమంత్రిని కలిసి ఉత్సవాలకు ఆహ్వానించగా ముఖ్యమంత్రి అంగీకరించడం జరిగిందన్నారు.ఇట్టి పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు అభివృద్ధికి పునాది అని పాఠశాలలో కావలసిన వసతులు, నూతన భవన నిర్మాణానికి రెండు రోజుల్లో అధికారుల బృందం స్థానిక ఆర్‌డిఒ ఆధ్వర్యంలో అన్ని వివరాలు సేకరించి కావలసిన పనులకు సంబంధించి ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేయడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలో సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ తదితర వసతులు ఏర్పాటుకు స్టేజ్ కన్సల్టెన్సీలను పిలిచి ప్రణాళిక సిద్ధం చేయడంతో పాటు పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు లేరని ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ప్రస్తుతం పని చేస్తున్నారని తెలిపినందున వెంటనే మంచి చురుకైన పని తనం ఉన్న హెచ్ఎంను నియమించవలసిందిగా ప్రక్కనే ఉన్న డిఇఒను ఆయన ఆదేశించారు. జూనియర్ కళాశాలలో అటెండర్ లేరని తెలిపినందున వెంట నే రెండు రోజుల్లో కాలేజీకి అటెండరును నియమించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా గ్రామానికి పాఠశాలకు అన్ని వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని ఆయన అన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న స్థానిక ఎమెల్యే వీరపల్లి శంకర్ మాట్లాడుతూ.. మొగిలిగిద్ద చరిత్రగలిగిన ఊరని,ఈ పాఠశాలలో మాజీ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, గవర్నర్ సత్యనారాయణ రెడ్డి,ఉస్మానియా విసి మల్లారెడ్డి,ప్రొఫసర్ హరగోపాల్ లాం టి పెద్దలు చదివిన పాఠశాలకు ఎంతో విశిష్టత ఉందని, శేషజీవితంలో హరగోపాల్ లాంటి వారు సమాజ సేవ దృక్పథంతో రాష్ట్ర ముఖ్యమంత్రిని ఈ పాఠశాల 150 సంవత్సరాల ఉత్సవాలకు తీసుకురావడం గర్వకారణం అని అన్నారు. అనంతరం ప్రొఫసర్ హరగోపాల్ మాట్లాడుతూ తాను చదివిన పాఠశాల, గ్రామంకు మేలు చేస్తే జీవిత కాలం తృప్తి చాలా బాగుంటుందని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఉత్సవాలకు అంగీకరించడం తనకు ఎంతగానో ఆనందంగా ఉందని, దీంతో ఈ గ్రామానికి పాఠశాల అభివృద్ధికి నాం ది పలుకుతుందన్నారు. అనంతరం ముఖ్యమంత్రి పాల్గొనే సభ స్థలాన్ని జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, అధికారులరులతో కలిసి పరిశీలించడం జరిగింది.ఈ సమావేశంలో డిఇఓ సుశిందర్ రావు,డిపిఒ సురేష్ మోహన్,ఆర్‌డిఒ సరిత,పూర్వ విద్యార్థులు,పాఠశాల విద్యా కమిటీ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గొప్ప రాజనీతిజ్ఞుడు జైపాల్‌రెడ్డి

ప్రజాపక్షం/షాద్‌నగర్: నీతి, నిజాయితీగా ఉంటూ అత్యున్నత రాజకీయ ప్రమాణాలు పాటించిన గొప్ప రాజనీతిజ్ఞుడు జైపాల్‌రెడ్డి అని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్ వీర్లపల్లి శంకర్ కొనియాడారు. మాజీ కేంద్ర మంత్రి, స్వర్గీయ ఎస్ జైపాల్‌రెడ్డి 83వ జయంతిని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ హరగోపాల్, మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ మహ్మద్ అలీఖాన్ బాబర్, నేతలు అగ్గనూరు విశ్వం, కొంకళ్ల చెన్నయ్య, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర ధారుడ్యానికి ఎంతగానో దోహదం

ప్రజాపక్షం/యాచారం : క్రీడలు మానసిక ఉల్లాసానికి శరీర ధారుడ్యానికి ఎంతగానో దోహదం చేస్తాయని హైద్రాబాద్ గ్రీన్ ఫార్మాసిటి సిఐ లిక్కి కృష్ణం రాజు అన్నారు. గురువారం యాచారం మండల పరిధిలోని మేడిపల్లి నక్కర్త గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకోని సిజన్ 4 క్రికేట్టు క్రీడోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సిఐ ముఖ్యఅతిదిగా హాజరై మాట్లాడారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని అన్నారు. గ్రామాల్లో క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీయడానికి క్రీడలు ఎంతో గానో ఉపయోగ పడుతుతాయని అన్నారు. జాతీయ స్థాయిలో కూడా రాణించవచ్చునన్నారు. క్రీడల్లో గ్రామస్తులందరు పాలు పంచుకోవడం ఎంతో అనందంగా ఉందని అన్నారు. తన సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు తెజంరెడ్డి, ఎస్ఐ రూప , మాజీ సర్పంచ్‌లు పాశ్చభాష, ఎరుకలి బాల్‌రాజ్, చిగురింత శ్రీనివాస్‌రెడ్డి,మాజీ ఎంపిటిసి మోటే శ్రీశైలం, ఎవిజి ఫౌండేషన్ చైర్మన్ అడాల గణేశ్,బుస్సు జంగారెడ్డి, జాల నాగరాజు, ముచ్చర్ల సురేశ్ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వరద నీటి ప్రభావం ఉన్న కాలనీలకు ఉపశమనం కల్పిస్తాం

జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : బిఎన్ రెడ్డి నగర్, వనస్థలిపురం డివిజన్ నుంచి వచ్చే వరద నీటి ప్రభావం ఉన్న హయత్ నగర్ డివిజన్ కాలనీలకు ఉపశమనం కలుగుతుందని ఎల్‌బి నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. గురువారం డివిజన్‌లోని ఆంధ్రకేసరి నగర్ పైన ఉన్నటువంటి వనస్థలిపురం, బిఎన్‌రెడ్డి డివిజన్ పరిశరాల ప్రాంతాలను ఆయన కార్పొరేటర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హయత్ నగర్‌లోని శారదా నగర్, మోమిని ఎంక్లేవ్, పరిశరాల కాలనీలకు వరద ప్రభావం ద్వారా ప్రతి ఏటా నిటిలో మునిగిపోవడం జరుగుతతుందని, ఆంధ్రకేసరి నగర్ నుంచి వరద నిటి కాలువ నిర్మాణం చేపట్టాలని గతంలో కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి కమిషనర్‌కు సూచించారు. హయత్ నగర్ ఇంజాపూర్ రోడ్ జస్వాల్ ఫర్నిచర్ నుంచి మునుగనూర్ కల్వర్టు వరకు మరో వరద నీటి కాలువ నిర్మాణం చేయాలని, వర్షాకాలంలో ఇక్కడ ఉన్నటువంటి పి.టి కాలనీ, గజ్జి పూలయ్య కాలనీ వరదలో ఉంటదని కార్పొరేటర్ తెలిపారు.త్వరలోనే ప్రణాళిక సిద్ధం చేసి వ్యయం అంచన వేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, డీఈ దామోదర్,ఇఇ ఆశలత, ఏఇ రమావత్ హేము నాయక్‌తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు పామెన జ్యోతి భీంభరత్

ప్రజాపక్షం/షాబాద్ : మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు పామెన జ్యోతి భీంభరత్ అన్నారు. గురువారం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మహిళా నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించిన్నట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా సెక్రటరిగా ముత్యాల పుష్పమ్మ చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షురాలు మాడి రమ్యశ్రీ, శంకర్ పల్లి మున్సిపల్ అధ్యక్షురాలుగా కడమంచి పుష్పమ్మ, మహేశ్వరం అధ్యక్షులుగా సమత, శేరిలింగం పల్లి అధ్యక్షురాలుగా చంద్రికలను జిల్లా కమిటీ సభ్యులుగా ఉత్తర్వులు అందజేసిన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా మహిళ్లా అధ్యక్షురాలు పామెన జ్యోతి భీంభరత్ మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో మహిళలకు అధిక ప్రాధ్యానత కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. మహిళలకు ఇచ్చిన హమిలు దశల వారిగా అమలు చేసేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నట్లు వివరించారు.

మాల్‌లో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు రూ1.30 లక్షల విరాళం

**

మహానగరి

పట్టపగలే చైన్‌స్నాచింగ్

ప్రజాపక్షం/మల్కాజిగిరి : నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గీతానగర్ ప్రాంతంలో ఉండే తన తల్లి వద్దకు సంక్రాంతి సందర్భంగా నిజామాబాద్ నుండి రెండు రోజుల క్రితం పూజిత అనే మహిళ వచ్చింది. గురువారం సాయంత్రం తన సోదరితో కల్సి మెడికల్ షాపుకు వెళ్లి ఇంటికి వెళుతుండగా గీతానగర్ రోడ్ నంబరు 3,4లోకి వస్తుండగా ఓ ఆగంతకుడు బైకుపై వెళుతూ వెనుక కూర్చొన్న పూజిత మెడలోంచి బంగారు గొలుసు లాక్కొని పరారయ్యాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తాండూరు నుంచి శ్రీశైలానికి మహా పాదయాత్ర

ప్రజాపక్షం/తాండూరుః తాండూరు పట్టణ నుండి పుణ్యక్షేత్రమైన శ్రీశైలం మహాక్షేత్రానికి శివభక్తులు పాదయాత్రగా తరలి వెళ్ళారు. సుమారు 80మంది శివ భక్తులు శ్రీశైలానికి పాదయాత్రగా తరలివెళ్ళారు. శ్రీ ఉమా మహేశ్వర సేవా సమితి ఆధ్వర్యాన గురువారం తాండూరు పట్టణంలోని భవగీ భద్రశ్వ దేవాలయంలో శివభక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మహా పాదయాత్రను తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ్ల బాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నీరాజబాల్‌రెడ్డి మాట్లాడుతూ శివయ్య ఆజ్ఞగా భావించి తాము ఈ మహాపాదయాత్రను కొనసాగిస్తున్నామని తెలిపారు.

రూ.1.43కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శంకుస్థాపన

ప్రజాపక్షం/నాగారంః మున్సిపాలిటీల అభివృద్ధికి కృషి చేస్తామని మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్, మాజీ మంత్రి, మేడ్చల్ ఎంఎల్ఎ చామకూర మల్లారెడ్డి అన్నారు. గురువారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లిలో 15వ ఆర్థిక సంఘం నిధులు కోటి 43 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి(యుపిహెచ్‌సి) ఎంపి రాజేందర్, ఎంఎల్ఎ మల్లారెడ్డిలు మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డితో కలసి శంకుస్థాపన చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు గోక కళావతియాదగిరి, ఎలిజాల నాగేష్‌గౌడ్, లక్ష్మి, కోఆప్షన్ సభ్యులు అశోక్‌గౌడ్, నాయకులు గండి అంజయ్య, వర్కాల పెంటయ్య, అన్నంరాజు శ్రీనివాస్, గూడురు అంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్లు అందజేత

ప్రజాపక్షం/చర్లపల్లిః మహిళలకు కుట్టుమిషన్లు అందించడం అభినందనీయమని ఉప్పల్ ఎంఎల్ఎ బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని పారిశ్రామికవాడ ప్రాంతంలో రోటరీ క్లబ్ కంపెనీలో ప్రముఖ పారిశ్రామికవేత్త బబ్బురి బాలరాజుగౌడ్ ఆధ్వర్యంలో 20 మంది మహిళలకు ఎంఎల్ఎ చేతులమీదుగా అందజేశారు. రోటరీ క్లబ్ వారు మహిళలకు అందించిన కుట్టు మిషన్లు ఎంతగానో ఉపయోగపడుతాయని మున్ముందు అనేక కార్యక్రమాలు చేపట్టాలను సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేశంలోనే అగ్రగామిగా తెలంగాణ

ప్రభుత్వ ఛీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : ఈ నెల 26 గణతంత్ర దినోత్సవం నుండి రాష్ట్రంలో రైతులకు ఎకరాకు రూ.6 వేల చొప్పున రైతు భరోసా పథకంతో పాటు అర్హులైన ఇళ్ల స్థలం ఉన్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే కార్యక్రమాలను ప్రభుత్వం అమలు పరుస్తోందని రాష్ట్ర ప్రభుత్వ ఛీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు. మేడ్చల్ మున్సిపల్ పరిధిలో రూ.44కోట్ల వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికలతో కల్సి గురువారం ప్రారంభించారు. రూ.38 కోట్ల అమృత్ పథకం నిధులతో 5 మంచి నీటి ట్యాంకులు, రూ. 6 కోట్ల నిధులతో అంతర్గత సిసి రోడ్డు మరియు యుజిడిలు, రూ.25 లక్షల నిధులతో తుమ్మ చెరువు కట్టకు కంచె వేయటం తదితర పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నిటిని రాష్ట్రంలో అధికారం చేపట్టిన నాటి అమలు చేస్తూ వచ్చిందన్నారు. దేశంలోనే అగ్రగామిగా మన రాష్ట్రాన్ని తీర్చి దిద్దుతున్న ప్రభుత్వంగా మారిందని అన్నారు. దివంగత నేత జైపాల్‌రెడ్డి జయంతి జయంతి సందర్భంగా ఈ కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్ తదితరులు ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

ఆలయ కమిటీలు సమాజ సేవకు ఉపయోగపడాలి ః బండి రమేష్

ప్రజాపక్షం/కూకట్‌పల్లి ః ఆలయ కమిటీలు హిందూ ధర్మ పరిరక్షణకు సమాజసేవకు ఉపయోగపడాలని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. కూకట్‌పల్లిలోని ద్వాదశ జ్యోతిర్లింగ ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం భక్తుల మధ్య అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై నూతన ఆలయ కమిటీ చైర్మన్ గొట్టి ముక్కల నాగేశ్వర్‌రావు, కమిటీ సభ్యులు సురువు వెంకట్రావు, గంట విద్యా సాగర్, రంగా భాస్కర్ గౌడ్, కృష్ణ, ఏంబరి శ్రీకాంత్ ముదిరాజ్, శారద శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు కె.గోపాల్ శర్మలను అభినందించారు. అభివృద్ధిలో ఎలాంటి రాజకీయాలకు తావు ఇవ్వవద్దని సూచించారు. సిఎం రేవంత్ రెడ్డి తెలంగాణ అభివృద్ధికోసం రోజుకు 18 గంటలు పని చేస్తున్నారని, విదేశీ పెట్టుబడులకోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గొట్టి ముక్కల వెంకటేశ్వర్ రావు, టిపిసిసి అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు సతీష్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్పరెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, సాదు ప్రతాప్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు, కార్యకర్తలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కోసం వ్యవసాయేతర భూముల ఏరివేత

*సమగ్ర వివరాలన్నీ ప్రత్యేక యాప్‌లో నమోదు

* గత ప్రభుత్వం హయాంలో రూ.25కోట్లు దుబారాగా రైతు బంధు చెల్లింపులు

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: వ్యవసాయదారులకు ఆర్థిక సాయం అందించే లక్ష్యంగా ఈ నెల 26 నుండి రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న రైతు భరోసా పథకాన్ని పకడ్బందీగా అమలు పరచే లక్ష్యంగా మేడ్చల్ జిల్లా యంత్రాంగం కసరత్తు వేగవంతం చేసింది. దీనిలో భాగంగా జిల్లాలో వ్యవసాయ భూములు ఏవి, వ్యవసాయేతర భూములు ఏవి, అసలు వ్యవసాయానికి పూర్తిగా పనికిరాని భూములు ఏవి అన్న వివరాలను కూలంకుషంగా క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి రికార్డుల రూపంలో నమోదు చేస్తున్నారు. తద్వారా రైతు భరోసా పథకాన్ని కేవలం వ్యవసాయం చేసే భూములకు మాత్రమే అందించటం ద్వారా నిజమైన రైతులను మాత్రమే లబ్ధిదారులుగా ఎంపిక చేయటమే ఈ సర్వే లక్ష్యం. గత ప్రభుత్వ హయాంలో రియల్ ఎస్టేట్ భూములు, ప్లాట్లు, రహదార్లుగా మారినవి, పరిశ్రమలు, గోదాము, గనులకు వినియోగిస్తున్నవి, గుట్టలు, రాళ్లు, రప్పలు, ముళ్ల కంపలు, ఇతర సంస్థలకు కేటాయించిన భూములన్నిటికీ వ్యవసాయ భూములుగా చిత్రీకరించి రైతు బంధు పథకం పేరిట కోట్లాది రూపాయలు దుబారా చేసిన విషయం ప్రభుత్వ దృష్టికి రావటంతో గతేడాది అధికారం చేపట్టిన ప్రభుత్వం ఈసారి ఎలాంటి దుబారాకు తావు లేకుండా రైతు భరోసా పథకాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు మార్గదర్శకాలను రూపొందించింది.

25లోగా సర్వే పూర్తి లక్ష్యం

గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయేతర భూములకు రైతు బంధు పథకం పేరిట ఆర్థిక సాయం ద్వారా మేడ్చల్ జిల్లాలో రూ.25 కోట్ల మేరకు దుబారా అయిందన్న విషయాన్ని జిల్లా అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుండి ప్రారంభించనున్న రైతు భరోసా పథకం ద్వారా సాగు భూముల్లో వ్యవసాయం చేసే రైతాంగానికి ఆర్థిక సాయం అందించేందుకు గాను ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో గతంలో వ్యవసాయ భూములుగా రికార్డుల్లో నమోదై ఉన్న వ్యవసాయేతర భూములను ఏరి పారేసే ప్రక్రియ కోసం క్షేత్రస్థాయిలో యుద్ధ ప్రాతిపదికన సర్వే కొనసాగిస్తోంది. ప్రతి గ్రామంలో వ్యవసాయ విస్తరణాధికారి, రెవెన్యూ ఇనస్పెక్టర్లు ఒక బృందంగా ఏర్పడి ఆయా గ్రామాల్లో ఆర్వోర్ పట్టాదారు పాస్ పుస్తకాల జాబితాను భూభారతి (గత ప్రభుత్వ ధరణి) పోర్టల్ నుండి తీసుకొన్న వివరాల మేరకు గ్రామ మ్యాప్, గూగుల్ మ్యాప్‌ల ఆధారంగా గ్రామాలను సందర్శించి వ్యవసాయానికి పనికిరాకుండా ఉన్న భూములను ఆరాతీసి వాటి జాబితాను తయారు చేస్తున్నారు. దీనికోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో వ్యవసాయేతర భూములు కాని వాటి నుండి గత పోర్టల్ నుండి తొలగిస్తూ ఆయా భూములు వ్యవసాయానికి పనికి రాకుండా ఏ దశలో ఉన్నాయన్న వివరాలను (రియల్ ఎస్టేట్, సంస్థలకు కేటాయించినవి. లీగల్ రిజిస్ట్రేషన్లు, గుట్టలు, చెరువులు లాంటి కారణాలు) సమగ్రంగా నమోదు చేయనున్నారు. ఒక వేళ గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ భూములు వ్యవసాయేతర భూములుగా నమోదై ఉంటే వాటిని సైతం క్షేత్రస్థాయిలో పరిశీలించి సవరించనున్నారు. ఈ విధంగా వ్యవసాయ యోగ్యం కాని భూముల వివరాల పట్టికను ఆయా గ్రామాల్లో ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభల్లో ప్రదర్శించి, వినిపించటం ద్వారా ఏవైనా అభ్యంతరాలుంటూ స్వీకరించి అవసరమైతే సవరణలు చేయటం ద్వారా తుది జాబితాగా పేర్కొని పోర్టల్‌లో నమోదుచేసి డిజిటల్ సంతకం ద్వారా అధికారికంగా జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి 25న పంపిస్తారు. తద్వారా ప్రభుత్వం వ్యవసాయేతర భూములను పూర్తి స్థాయిలో తొలగించి కేవలం వ్యవసాయ భూములున్న పట్టాదారులైన రైతులకు ఈ నెల 26 నుండి రైతు భరోసా పథకం ద్వారా ఆర్థిక సాయం అందించనుంది.

కలెక్టర్ పరిశీలన ః గురువారం కీసర ఎమ్మార్వో కార్యాలయంలో జిల్లా కలెక్టర్ గౌతం, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, లా అధికారి చంద్రావతిలతో కల్సి వ్యవసాయేతర భూములను గుర్తించే ప్రక్రియ ఏ విధంగా కొనసాగుతన్న విషయాన్ని పరిశీలించారు. సర్వే చేస్తున్న సిబ్బంది క్షేత్ర స్థాయిలో జిపిఆర్ మ్యాప్ ద్వారా పరిశీలిస్తూ భూములు వ్యవసాయానికి పనికి వచ్చేవా కాదా అన్న విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ధారించుకొన్న మీదట సమగ్ర నివేదిక తయారుచేసి ఆ వివరాలను డేటా ఎంట్రీకి ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన చోట సర్వేయర్ల ద్వారా సమాచారం సేకరించిలే అవుట్లు, నాలాగా మార్చిన భూములను, పరిశ్రమలకు సంబంధించిన వివరాలను జాగ్రత్తగా సేకరించాలని సిబ్బందికి సూచించారు.

ప్రతి పేద కుటుంబానికీ సంక్షేమ పథకాలు

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ప్రజాపక్షం/కూకట్‌పల్లిః ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందివ్వడమే ప్రభుత్వ లక్ష్యమని పిఎసి చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల పంపిణీ, రైతు భరోసా వంటి పథకాలు అమలుకై ఈ నెల 16 నుంచి 20 వ తేది వరకు అధికారుల బృందాలు పర్యటించి అర్హులను గుర్తిస్తాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎలాంటి తారతమ్యాలు లేకుండా లబ్ధిదారుల ఎంపిక జరుగాలన్నారు. పేద వారు కన్న కల ఇందిరమ్మ ఇల్లు అని, పేదవారికి భారం కాకుండ ప్రభుత్వం అన్ని రకాల నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. పేదవారి కలను రాష్ట్ర ప్రభుత్వం నేరవేరుస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో తొలి దశలో సొంత స్థలాలున్న వారికే ప్రాధాన్య మిస్తున్నందున్న తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇంటికి మొదటి విడతగా లక్ష రూపాయలు ఇస్తారని, ఎవరి ఇండ్లు వారే నిర్మించుకునే విధంగా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజాపాలనలో ఇండ్లకోసం దరఖాస్తు చేసుకున్న వారిని గుర్తిస్తున్నారన్నారు. అర్హులైన నిజమైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందుతాయన్నారు. ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. కొత్త రేషన్ కార్డుల జారీకి రాష్ట్ర ప్రభుత్వం మార్గ దర్శకాలు జారీ చేసిందన్నారు. కుల గణన సర్వే ఆధారంగా రేషన్ కార్డులు జారీ చేయాలని నిర్ణయించిందన్నారు. రేషన్ కార్డులో సభ్యుల మార్పులు, చేర్పులు తొలగింపులకు అవకాశం కల్పించారన్నారు.

రేషన్ కార్డుల సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్

ప్రజాపక్షం/నాగారంః ఆహార భద్రత కార్డుల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. గురు వారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 20వార్డుల్లో నిర్వహిస్తున్న ఆహార భద్రత కార్డుల ఇంటింటి సర్వేను 17వ వార్డులో అడిషనల్ కలెక్టర్(స్థానిక సంస్థలు) పరిశీలించారు. గురువారం నుండి ప్రారంభమైన సర్వేను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, అర్హులైన వారికి ఆహార భద్రత కార్డులు ఇవ్వాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలి

కలెక్టర్ ప్రతీక్ జైన్

ప్రజాపక్షం/నవాబుపేట్ ః ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం నవాబ్ పేట్ మండల పర్యటనలో భాగంగా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేపడుతున్న పనులు, వట్టి మీనపల్లిలో ఇందిరమ్మ ఇండ్లు, పులుమామిడి పొలాల్లో రైతు భరోసా సర్వేలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ప్రసవాలు జరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నిధులను కేటాయించడం జరుగుతుందని, ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగ ఉండేలా ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు కూడా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేపడుతున్న మరమ్మత్తులను వారం రోజులలోపు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పనులు చేపట్టే క్రమంలో నాణ్యత లోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఆసుపత్రిలో లైట్లు, ఫ్యాన్లు సరిపడే విధంగా అమర్చుకోవాలని కలెక్టర్ వైద్యాధికారులకు సూచించారు. ఆసుపత్రి కిటికీలు, వెంటిలేటర్లకు దోమతెరల ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా భవనం పైన చెత్తాచెదారంతో పాటు నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లాలో 25 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధిపరిచేందుకు నిధులను కేటాయించడం జరిగిందని ఇందులో భాగంగానే నవాబ్ పేట్ ఆసుపత్రిని ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని 25 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అన్ని వసతులతో అభివృద్ధి పరచి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్, ఇన్ పేషంట్ వార్డులను పరిశీలించారు. అనంతరం వట్టిమీనపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే, రైతు భరోసా సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించా రు. అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసాను అందించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. పర్యటనలో భాగంగా వట్టిమీనపల్లి అంగన్వాడి పూర్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి సామ్ మామ్ పిల్ల ల వివరాలను, పిల్లలకు అందిస్తున్న భోజనం వివరాలను అడిగి తెలుసుకుని బియ్యం నాణ్యతను పరిశీలించారు. అంగన్వాడికి సరఫరా చేస్తున్న బాలామృతం, బియ్యం తదితర వాటిని ఎప్పటికప్పుడు స్టాక్ రిజిస్టర్ లో నమోదు చేయాలని అంగన్వాడి టీచర్ కు కలెక్టర్ సూచించారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న అంగన్వాడి పూర్వ ప్రాథమిక పాఠశాలలను ఎంపిడివొలు, పంచాయతీ కార్యదర్శులు విధిగా పర్యటించి తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ ఆకస్మిక పర్యటనలో భాగంగా ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ వెంకటరవణ, తహసిల్దార్ జయరాం, ఎంపీడీవో అనురాధ, పిహెచ్ సి వైద్యాధికారి డాక్టర్ రోహిత్, మండల సుపర్డెంట్ అజయ్ కుమార్, పుల్ మామిడి పంచాయతీ కార్యదర్శి నితిన్, మీనపల్లి పంచాయతీ కార్యదర్శి గీత,తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో ప్రభుత్వ డయాలసిస్ సెంటర్

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి: వైద్యంకోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమలు పరుస్తున్న ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ లాంటి పథకాలు పేదలకు వరంలాంటివని మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. మేడ్చల్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ డయాలసిస్ సెంటర్‌ను మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డితో కల్సి గురువారం ప్రారంభించారు. సమీప ప్రాంతాల్లోనే అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు, పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించటం కోసం బస్తీ దవాఖానాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక, అర్బన్ ఆరోగ్య కేంద్రాలు తోడ్పడుతాయని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డా.రఘునాథస్వామి అన్నారు. డిప్యూటి డిఎంహెచ్ఓ డా.శోభ, వైద్యాధికారి డా. గురు భార్గవ్ లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఏర్పాటు

ప్రజాపక్షం/బంట్వారం ః మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, నూతన కమిటిలో బాగంగా బంట్వారం మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామంలో ఎంఆర్‌పిఎస్ మండల ఇంచార్జీ భరత్ కమార్ మాదిగ ఆధ్వర్యంలో మండల నూతన కమిటిని ఏకాగ్రీంవగా ఎన్నుకోవడం జరిగింది. కమిటిలో బాగంగా గ్రామ కమిటి అధ్యక్షులుగా నగిడెపల్లి ఆదర్శ్, ఉపాధ్యక్షులుగా సిర్ర నందు, రాజు, అధికార ప్రతినిధిగా కమ్మర్‌పల్లి నరేష్, కార్యవర్గ సభ్యులుగా సందిప్, విజయ్‌కూమార్, దిలిప్, విశాల్, ప్రవీణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోన్నారు. ఎంఆర్‌పిఎస్ మండల ఇంచార్జీ భరత్ కమార్ మాదిగ మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ నేతృత్వంతో 30 యేళ్ల తరబడి సుదీర్ఘ పోరటం ఫలితంగా వర్గీకరణ అమలుకు సుప్రీం కోర్టు ధర్మాసనం తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ సినియర్ నాయకులు పి గోపాల్ మాదిగ తదితరులు ఉన్నారు.

ఓవర్‌లోడ్‌కు అడ్డెవ్వరు?

* మామూళ్ళ మత్తులో జోగుతున్న అధికారులు
* తూతూమంత్రంగా ఆర్‌టిఎ అధికారుల తనిఖీలు
* అనుమతుల పేరిట ఎర్రమట్టి అక్రమ రవాణా

ప్రజాపక్షం/తాండూరుః తాండూరు నియోజకవర్గంలో ఓవర్ లోడ్‌ను నియంత్రించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఓవర్‌లోడ్‌తో వాహనాలను తరలిస్తే తమకు అడ్డెవ్వరు అన్నచందంగా అధికారులకు సవాల్ విసురుతున్నారు. ఓవర్ లోడ్‌తో రోజురోజుకు ప్రమాదాలు పెరిగి పోతున్నాయి. గత వారం రోజుల క్రితమే ఓవర్ లోడ్‌తో వెళ్తున్న ఓ ఎర్రమట్టి టిప్పర్ బోల్తా పడిన ఘటన తెలిసిందే. ఓవర్ లోడ్‌ను అడ్డుకోవాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదన్న విమర్శలు వ్యక్తవుతున్నాయి. తాండూరు నియోజకవర్గంలో తాండూరు, పెద్దేముల్, బషీరాబాద్ మండలాలు ఖనిజ సంపదకు నిలయంగా మారినాయి. వాటితో పాటు తాండూరు మండలంలో సిమెంట్ ఫ్యాక్టరీలు ఉండటంతో ప్రతిరోజూ వందలాది లారీలు, టిప్పర్లు రవాణాను సాగిస్తున్నాయి. పెద్దేముల్ మండల పరిధిలో లభించే సుద్ద, ఎర్రమట్టిని గనుల నుండి పెద్ద మొత్తంలో కంపెనీలకు రా మేటిరియల్‌ను తరలించి దండుకుంటున్నరు. రా మేటరియల్‌ను రాయల్టీకి మించి ఓవర్ లోడ్‌తో టిప్పర్‌లు తరలి పోతున్నాయి. తాండూరు పోలీసు స్టేషన్ ముందు నుండియే ఓవర్ లోడ్‌తో టిప్పర్‌లు తరలిపోతున్నా అటువైపు ఏ అధికారి కూడా దృష్టి పెట్టడం లేదు. ఓవర్ లోడ్‌ను నియంత్రించాల్సిన అధికారులు మైన్స్, రెవెన్యూ, పోలీసు, ఆర్టిఎ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదంటే అధికారుల తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు టిప్పర్ల డ్రైవర్లు తాము మైన్స్, అర్టిఓ, పోలీసులకు నెలవారిగా మామూళ్ళు అందిస్తున్నామని, తమ ఓవర్ లోడ్‌ను అడ్డుకునేది ఎవ్వరని బహిరంగంగానే ఎదురు ప్రశ్నిస్తున్నారు. మరికొందరు డ్రైవర్లు అయితే తమ క్వారి యాజమానులే నెల వారీగా అధికారులకు అందజేయాల్సినంత ముట్ట చెప్పుతున్నారని వాపోతున్నారు. పరిమితికి మించి ఓవర్ లోడ్‌ను తరలిస్తేనే తమకు గిట్టుబాటు అవుతుందని డ్రైవర్లు వాపోతున్నారు. ముఖ్యంగా పెద్దేముల్ మండల పరిధి తట్టేపల్లి కేంద్రంగా ఎర్రమట్టి అక్రమ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది. అక్రమార్కుల ఆగడాలకు అడ్డు లేకుండా పోయింది. ఈ ప్రాంతం కర్నాటక సరిహద్దులో ఉండటంతో సులభంగా కర్నాటక మీదుగా పెద్దఎత్తున్న ఓవర్ లోడ్‌తో టిప్పర్లు తరలిపోతున్నాయి. ఓవర్ లోడ్ వాహనాలతో రోడ్లన్నీ దెబ్బతింటున్నా ఎవ్వరు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్టిఒ అధికారులు అప్పుడప్పుడు నామామాత్రంగా తనిఖీలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి ఓవర్ లోడ్‌ను నియంత్రించాల్సిన అవసరం ఎంతైన ఉందని పలువురు కోరుతున్నారు.

అక్రమ పార్కింగ్ నివారణకు చర్యలు తీసుకోండి

ప్రజాపక్షం / కొడంగల్ ః కొడంగల్ ఆర్‌టిసి బస్టాండ్‌లో ప్రైవేట్ వాహనాలు ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తు బస్సుల రాకపోకలకు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కల్గిస్తుండటంతో వాటిపై చట్టపరంగా చర్యలు తీసు కోవాలని కోరుతూ

క్రీడ

కరుణ్ నాయర్ ఊచకోత..

ప్రతిష్టాత్మక దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో విదర్భ కెప్టెన్, టీమిండియా వెటరన్ బ్యాటర్ కరుణ్ నాయర్ విధ్వంసం కొనసాగుతోంది. ఈ టోర్నీలో ఇప్పటి వరకు ఆడిన ఏడు ఇన్నింగ్స్‌ల్లోనూ కరుణ్ నాయర్ బౌలర్లపై కనికరం లేకుండా విరుచుకుపడ్డాడు. వరుసగా 112 నాటౌట్, 44 నాటౌట్, 163 నాటౌట్, 112, 122 నాటౌట్, 88 నాటౌట్‌లతో మొత్తం 752 పరుగులు చేశాడు. అతని యావరేజ్ 75.2గా నమోదైంది. ఈ ఏడు ఇన్నింగ్స్‌ల్లో ఐదు సెంచరీలతో పాటు ఒక హాఫ్ సెంచరీ ఉంది. ఈ ఏడు ఇన్నింగ్స్‌ల్లో అతను ఒక్కసారి మాత్రమే ఔటవ్వడం విశేషం. తాజాగా మహారాష్ట్రతో జరిగిన మ్యాచ్‌లోనూ కరుణ్ నాయర్ తన ఊచకోతను కొనసాగించాడు. 44 బంతుల్లో 9 ఫోర్లు, 5 సిక్స్‌లతో 88 పరుగులతో అజేయంగా నిలిచాడు. దాంతో ముందుగా బ్యాటింగ్ చేసిన విదర్భ నిర్ణీత 50 ఓవర్లలో 3 వికెట్లకు 380 పరుగుల భారీ స్కోర్ చేసింది. విజయ్ హజారే ట్రోఫీ చరిత్రలోనే విదర్భకు ఇది అత్యధిక స్కోర్ కావడం విశేషం. కరుణ్ నాయర్‌తో పాటు ఓపెనర్లు ధ్రువ్ షోరే(120 బంతుల్లో 14 ఫోర్లు, సిక్స్‌తో 114), యశ్ రాథోడ్101 బంతుల్లో 14 ఫోర్లు, సిక్స్‌తో 116) శతకాలతో రాణించగా.. వికెట్ కీపర్ జితేశ్ శర్మ(33 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 51) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. మహారాష్ట్ర బౌలర్లలో ముఖేష్ చౌదరి రెండు వికెట్లు తీయగా.. సత్యజీత్ బచ్చావ్ ఓ వికెట్ పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేధనకు దిగిన మహారాష్ట్ర 8 పరుగులకే తొలి వికెట్ కోల్పోయింది. ఇక కరుణ్ నాయర్ సూపర్ ఫామ్ నేపథ్యంలో అతన్ని ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. గతంతో భారత్ తరపున అతను టెస్ట్‌ల్లో ట్రిపుల్ సెంచరీ నమోదు చేశాడు. ఆ తర్వాత అతనికి సరైన అవకాశాలు రాలేదు. దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్న కరుణ్ నాయర్‌కు అవకాశం ఇవ్వకపోతే సెలెక్టర్లపై తీవ్ర విమర్శలు వచ్చే అవకాశం ఉంది. అతని సూపర్ ఫామ్ ఇప్పుడు అజిత్ అగార్కర్ సారథ్యంలోని సెలెక్షన్ కమిటీకి తలనొప్పిగా మారింది.

క్వార్టర్ ఫైనల్‌కు సింధు!

ఇండియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్ 750 టోర్నీలో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు జోరు కొనసాగుతోంది. వివాహం అనంతరం బరిలోకి దిగిన తొలి టోర్నీలో సింధు సాధికారిక ప్రదర్శనతో రెండో విజయాన్ని నమోదు చేసింది. గురువారం జరిగిన ప్రి క్వార్టర్ ఫైనల్లో రెండు సార్లు ఒలింపిక్స్ మెడలిస్ట్ అయిన సింధు 21–15, 21–13 తేడాతో జపాన్‌కు చెందిన మనమి సూజుపై విజయం సాధించింది. ఈ గెలుపుతో క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. హైదరాబాద్‌లోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియం వేదికగా 46 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సింధు పూర్తి ఆధిపత్యం చెలాయించింది. తనకంటే తక్కువ ర్యాంక్ కలిగిన జపాన్ షట్లర్‌పై తనదైన ఆటతో విరుచుకుపడింది. పూర్తిగా ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌లో క్రాస్ కోర్ట్ స్మాష్‌లతో చెలరేగిన సింధు.. వరుస గేమ్‌ల్లో గెలిచి విజయలాంఛనాన్ని పూర్తి చేసింది. అక్టోబర్ 2024 తర్వాత సూపర్ 750 టోర్నీల్లో పీవీ సింధు క్వార్టర్ ఫైనల్ చేరడం ఇదే తొలిసారి. గతేడాది నవంబర్‌లో సింధు సయ్యద్ మోదీ ఇండియా ఇంటర్నేషనల్ సూపర్ 300 టోర్నీ టైటిల్ గెలిచింది. ఈ ఏడాది ఆరంభంలో జరిగిన మలేసియా ఓపెన్‌కు దూరంగా ఉన్న సింధు.. వివాహం అనంతరం బరిలోకి దిగిన తొలి టోర్నీలో సత్తా చాటింది.

తొలి రౌండ్‌లో సింధు 21–14, 22–20తో యున్ సుంగ్(చైనీస్ తైపీ)పై విజయం సాధించిన విషయం తెలిసిందే. శుక్రవారం జరిగే క్వార్టర్ ఫైనల్లో సింధు.. ఇండోనేషియా ప్లేయర్ జీఎమ్ టన్‌జంగ్‌తో తలపడనుంది. నాలుగో సీడ్ ప్లేయర్ అయిన టన్‌జంగ్‌తో సింధుకు కఠిన సవాల్ తప్పదు.

ఈ విజయంపై సింధు సంతోషం వ్యక్తం చేసింది. 'చాలా సంతోషంగా ఉంది. తొలిసారి మనమి సూజుతో తలపడ్డాను. ఈ మ్యాచ్‌లో కొన్ని సుదీర్ఘ ర్యాలీలు జరిగాయి. ఈ మ్యాచ్‌లో నేను 100 శాతం ఇవ్వగలిగినందుకు సంతోషంగా ఉన్నాను. రేపటి కోసం నేను కోలుకొని మరింత బలంగా తిరిగి రావాలి.'అని విజయానంతరం సింధు తెలిపింది.

మరో మ్యాచ్‌లో అనుపమ ఉపాధ్యాయ 6–21, 9–21 తేడాతో జపాన్ స్టార్ టోమోకా మియాజకి చేతిలో చిత్తయ్యింది. పురుషుల సింగిల్స్‌లో కిరణ్ జార్జ్ క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించాడు. ప్రిక్వార్టర్స్‌లో కిరణ్ జార్జ్ 22–20, 21–13 తేడాతో ఫ్రాన్స్ షట్లర్ ఏ లానియర్‌ను ఓడించాడు. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్పతనీషా క్రాస్టో పోరాటం రెండో రౌండ్‌లోని ముగిసింది. భారత ద్వయం 9–21, 21–23 తేడాతో జపాన్ ద్వయం మట్సుమోటోఫుకుషిమా చేతిలో ఓటమిపాలైంది. తొలి గేమ్‌లో చిత్తయిన.. రెండో గేమ్‌లో భారత్ ద్వయం గట్టి పోటీనిచ్చింది. మిక్స్‌డ డబుల్స్‌లో భారత పోరాటం ముగిసింది.

టీమిండియా కోసం నేను రెడీ: కెవిన్ పీటర్సన్

టీమిండియా బ్యాటింగ్ కోచ్ పనిచేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఇంగ్లండ మాజీ క్రికెటర్ కెవిన్ పీటర్సన్ తెలిపాడు. టీమిండియా వరుస వైఫల్యాల నేపథ్యంలో బ్యాటింగ్ కోచ్‌ను నియమించేందుకు బీసీసీఐ సిద్ధమైందని, అన్వేషణ కూడా ప్రారంభించిందని ఓ క్రికెట్ పీఆర్ చేసిన ట్వీట్‌కు కెవిన్ పీటర్సన్ బదులిచ్చాడు. టీమిండియా బ్యాటింగ్ కోచ్‌గా పని చేసేందుకు తాను అందుబాటులో ఉంటానని పీటర్సన్ సమాధానమిచ్చారు. మరోవైపు టీమిండియా సపోర్ట్ స్టాఫ్‌ను పెంచాలని బీసీసీఐ భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. బ్యాటింగ్‌కు స్పెషలిస్ట్ కోచ్‌ను నియమిస్తేనే టీమిండియా వరుస వైఫల్యాలకు బ్రేక్ పడుతుందనే ఆలోచనలో బోర్డు ఉన్నట్లు సమాచారం.

రీల్

'లైలా' టీజర్‌కు బాలయ్య ఫిదా!

'మాస్ కా దాస్' విశ్వక్‌సేన్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'లైలా' ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాలో విశ్వక్ లేడీ గెటప్‌లో కనిపిస్తుండటంతో ఈ మూవీ ప్రేక్షకులను ఎంతమేర ఆకట్టుకుంటుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఇక ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేసి ప్రేక్షకులను థ్రిల్ చేసేందుకు మేకర్స్ రెడీ అయ్యారు. అయితే, ఈ చిత్ర టీజర్‌ను అందరికంటే ముందు నటసింహం నందమూరి బాలకృష్ణ వీక్షించి ఎంజాయ్ చేశాడు. బాలయ్య నటించిన 'డాకు మహారాజ్' చిత్రం బాక్సాఫీస్ దగ్గర సూపర్ హిట్ మూవీగా నిలవడంతో చిత్ర యూనిట్ సక్సెస్ సెలబ్రేషన్స్ జరుపుకుంది. ఈ సెలబ్రేషన్స్‌లో మాస్ కా దాస్ విశ్వక్ సేన్, స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ కూడా పాల్గొన్నారు. ఈ క్రమంలోనే విశ్వక్ తన 'లైలా' టీజర్‌ను బాలయ్యకు చూపెట్టగా.. అది చూసిన బాలయ్య తెగ ఎంజాయ్ చేశాడు. అంతేగాక అద్భుతంగా ఉందంటూ విశ్వక్‌కు చెప్పాడు. దీనికి సంబంధించిన వీడియోను లైలా మేకర్స్ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో, లైలా టీజర్‌పై ప్రేక్షకుల్లో అంచనాలు పెరుగుతున్నాయి. కాగా, ఈ టీజర్‌ను జనవరి 17న రిలీజ్ చేయబోతున్నట్లు చిత్ర యూనిట్ ఇప్పటికే వెల్లడించింది. ఇక ఈ సినిమాలో ఆకాంక్ష శర్మ హీరోయిన్‌గా నటిస్తుండగా రామ్ నారాయణ్ ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తున్నారు. లియోన్ జేమ్స్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు.

'ఇండియన్–3'పై శంకర్ కామెంట్స్

పాన్ ఇండియా లెవెల్లో తమదైన ముద్ర వేసుకున్న టాప్ మోస్ట్ దర్శకుల్లో శంకర్ అంటే తెలియని వారు ఎవరూ ఉండరు. తనదైన భారీ సినిమాలు, మెసేజ్‌లతో శంకర్ ఎన్నో మరపురాని సినిమాలు అందించారు. అయితే ఇపుడు తన సినిమాలు అనుకున్న రేంజ్‌లో హిట్ కావడం లేదు. రీసెంట్ గానే వచ్చిన చిత్రం గేమ్ ఛేంజర్ కూడా చాలా నెగిటివిటీ చూడాల్సి వచ్చింది. అయితే ఈ సినిమా తర్వాత శంకర్ నుంచి ఉన్న మరో సినిమానే ఇండియన్ 3. ఇది కూడా పార్ట్ 2 సక్సెస్ కాలేదు కానీ పార్ట్ 3ని కూడా తీసుకొచ్చేస్తున్నారు. అయితే దీనిపై శంకర్ చేసిన కామెంట్స్ ఇపుడు వైరల్‌గా మారాయి. తన నెక్స్ట్ పని ఇండియన్ 3కి చేయాల్సి ఉందని. ఆ సినిమా షూటింగ్ దాదాపు అయిపోయింది, మేజర్‌గా విఎఫ్ఎక్స్ పనులు పెండింగ్ ఉన్నాయని తెలిపారు. అలాగే ఇదంతా అయ్యేసరికి మరో 6 నెలల సమయం అలా పడుతుంది అని ఆ తర్వాత థియేటర్స్‌లో రిలీజ్‌కి తీసుకొస్తామని శంకర్ క్లారిటీ ఇచ్చారు. దీనితో తన కామెంట్స్ ఇపుడు వైరల్‌గా మారాయి.

పవర్‌ప్యాక్డ్‌గా 'పట్టుదల' ట్రైలర్

తమిళ హీరో అజిత్ కుమార్ ప్రస్తుతం వరుసబెట్టి సినిమాలు చేస్తున్నాడు. ఆయన నటించిన రెండు సినిమాలు కూడా షూటింగ్ ముగించుకుని రిలీజ్‌కు రెడీ అయ్యాయి. ఇందులో గుడ్ బ్యాడ్ అగ్లీ, విదాముయార్చి చిత్రాలు ఇప్పటికే రిలీజ్ డేట్స్‌ను వాయిదా వేసుకున్నాయి. అయితే, ఈ చిత్రాల్లో 'విదాముయార్చి' మూవీపై ప్రేక్షకుల్లో సాలిడ్ అంచనాలు క్రియేట్ అయ్యాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. అజిత్ సినిమా అంటే ఎలా ఉంటుందో మరోసారి ఈ ట్రైలర్ ప్రూవ్ చేసింది. ఇందులో పూర్తి యాక్షన్ సీక్వెన్స్‌లతో పవర్‌ప్యాక్డ్ కథతో అజిత్ మరోసారి అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నాడు. ఇక ఆయనతో పాటు యాక్షన్ కింగ్ అర్జున్ కూడా ఈ సినిమాలో సాలిడ్ రోల్ చేస్తున్నట్లు ఈ ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. అందాల భామ త్రిష ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తుండగా రెజీనా మరో లీడ్ రోల్‌లో నటిస్తోంది. యాక్షన్ ప్రియులకు ఫుల్ మీల్స్ అందించే విధంగా ఈ మూవీని దర్శకుడు మగిళ్ తిరుమేని డైరెక్ట్ చేస్తున్నాడు. ఇక ఈ సినిమాకు మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. 'పట్టుదల' చిత్రాన్ని ఫిబ్రవరి 6న గ్రాండ్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.

మరో పాన్ ఇండియా మూవీతో పాయల్

టాలీవుడ్‌లో తన డెబ్యూ సినిమాతోనే సాలిడ్ హిట్ అందుకున్న హీరోయిన్ 'ఆర్ఎక్స్ 100' ఫేమ్ పాయల్ రాజ్‌పుత్. పంజాబి నుంచి వచ్చిన ఈ ముద్దుగుమ్మ తొలి సినిమాతోనే ఇక్కడ రచ్చ చేసింది. తన అందాల ఆరబోతతో స్క్రీన్ అంతా షేక్ అయిపోయింది. ఆ తర్వాత మంగళవారం మూవీ సూపర్ హిట్‌తో పాయల్‌కు ఇండస్ట్రీలో స్పెషల్ క్రేజీ ఏర్పడింది. కుర్రాళ్లకు హాట్ ఫేవరేట్‌గా మారిపోయింది. ఈ క్రమంలో మరో పాన్ ఇండియా మూవీతో వస్తోంది పాయల్. పాయల్ ప్రధాన పాత్రలో సినిమా టికెట్ ఎంటర్టైన్‌మెంట్స్ & అర్జున్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'ప్రొడక్షన్ నం. 1' చిత్రం సిద్ధం కాబోతుంది. డైరెక్టర్ ముని కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం అందిస్తున్న ఈ మూవీ జనవరి 24న హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో ప్రారంభం కానుంది. ఈ చిత్రంలో పాయల్ రాజ్‌పుత్ పాత్ర చాలా ఎమోషనల్‌గా ఉండబోతోంది. ఈ మూవీ ప్రారంభోత్సవానికి పలువురు సినీ ప్రముఖులు హాజరు కానున్నారు. సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు ప్రారంభం రోజు మూవీ మేకర్స్ ప్రకటించనున్నారు.

అంతరిక్షంలో విజయవంతంగా...
ఇస్రో 'స్పేస్ డాకింగ్'

ప్రపంచంలో నాలుగో దేశంగా భారత్
ఇస్రోకు మోదీ సహా పలువురు ప్రముఖుల అభినందన

బెంగళూరు : అంతరిక్షంలో భారత ఉపగ్రహాలను అనుసంధానం (స్పేస్ డాకింగ్) చేసేందుకు ఇస్రో నిర్వహించిన ప్రయోగం విజయవంతమైంది. ఇస్రో ప్రయోగించిన 'ఛేజర్', 'టార్గెట్' రెండూ అంతరిక్షంలో విజయవంతంగా అనుసంధానమై ఏకరూపం ధరించాయి. దీంతో 'స్పేస్ డాకింగ్' 'సాంకేతిక సాహసకృత్యం చేయడంలో భారతదేశం ప్రపంచంలో నాలుగోదేశంగా అవతరించింది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా పలువురు ప్రముఖులు ఇస్రోకు ఎక్స్ వేదికగా అభినందనలు తెలియజేశారు. ఇప్పటివరకూ అమెరికా, రష్యా,చైనా దేశాలు మాత్రమే అంతరిక్షంలో ఈ స్పేస్ డాకింగ్ చేయగలుగుతున్నాయి. భారత దేశం అంతరిక్షంలో తనకంటూ ఒక అంతరిక్ష కేంద్రాన్ని (స్పేస్ స్టేషన్) ఏర్పాటు చేసుకోవాలంటే స్పేస్ డాకింగ్ ఎంతో ముఖ్యం. ప్రపంచంలో ఇప్పటివరకూ ఒక్క చైనా దేశానికి మాత్రమే అంతరిక్షంలో తనకంటూ ప్రత్యేకంగా ఒక అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసుకుంది. చైనా వ్యోమగాములు అనేకమంది తరచుగా భూమి నుండి ఈ అంతరిక్ష కేంద్రానికి రాకపోకలు సాగిస్తున్నారు. భవిష్యత్ అవసరాల నిమిత్తం భారీ విడిభాగాలను అంతరిక్షంలో అనుసంధానం చేసేందుకు ఇస్రో రెండు ఉపగ్రహాలను అనుసంధానం చేసే ప్రయోగాన్ని గురువారం నిర్వహించింది. ఈ ప్రయోగం విజయవంతంగా ముగిసిందని ఎక్స్ వేదికగా ఇస్రో ఒక ప్రకటన చేసింది. భవిష్యత్‌లో భారీ ప్రయోగాలు, అంతరిక్ష ప్రయోగ లేబొరేటరీల నిర్మాణ అవసరాలు నెరవేర్చేందుకు సన్నాహాల్లో భాగంగా భూమి నుండి ప్రయోగించిన రెండు ఉపగ్రహాలను అంతరిక్షంలో ఇస్రో విజయవంతంగా అనుసంధానం చేసింది. రెండు విడిభాగాలను ఒకే వస్తువుగా అనుసంధానం చేయడానికి ఈ ప్రయోగం ఉపయోగపడుతుంది. ''అంతరిక్ష చరిత్రలో భారత్ తన పేరును అనుసంధానం చేసుకుంది, గుడ్ మార్నింగ్ ఇండియా ఇస్రో చేపట్టిన అంతరిక్ష అనుసంధాన కార్యక్రమం చరిత్రలో నిలిచేవిధంగా విజయవంతమైంది, ఈ క్షణాలకు సాక్ష్యంగా నిలిచినందుకు ఎంతో గర్వంగా ఉంది' అని ఎక్స్ వేదికగా కేంద్ర సైన్స్, టెక్నాలజీ, స్పేస్ మంత్రిత్వశాఖ సహాయమంత్రి జితేంద్ర సింగ్ ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. ఇస్రోకు అభినందనలు తెలియజేశారు. చంద్రయాన్–4, గగనయాన్ ప్రయోగాలకు ఇది మార్గం సుగమం చేసిందన్నారు. ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తదితరులు అభినందనలు తెలియజేశారు. అంతరిక్షంలో ఒక లక్ష్యం సాధించేందుకు అనేక రాకెట్లను వివిధ సమయాలలో ప్రయోగిస్తారు. ఆ తర్వాత వీటిని అంతరిక్షంలో ఒకే వస్తువుగా మార్చి అవన్నీ కలిసి ఏకరూపం ధరించాలంటే ఈ స్పేస్ డాకింగ్ సాహసకృత్యంలో ఇస్రో క్రమంగా అనుభవం సంపాదించుకోవాలి. ఈ ప్రక్రియలో ఇది ఇస్రోకు మొదటి మెట్టు. భవిష్యత్‌లో చంద్రయాన్–4, గగనయాన్ వంటి భారీ కార్యకలాపాలను ఇస్రో నిర్వహించనున్నది. ఈ ఆశలు, లక్ష్యాలు నెరవేరాలంటే స్పేస్ డాకింగ్‌లో అనుభవం గడించాలి. ఇదెంతో కీలకమైన వ్యవహారం. 2035వ సంవత్సరం నాటికి భారత దేశం సొంతంగా ఒక స్పేస్ స్టేషన్‌ను నిర్మించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. గడచిన అక్టోబరునెలలో ప్రభుత్వంఈ విషయాన్ని ప్రకటించింది. భారతీయ అంతరిక్ష కేంద్రంగా దీనిని పిలవాలని కూడా పేర్కొంది.

మళ్లీ ఢిల్లీబాట

(మొదటి పేజీ తరువాయి)

సిబ్బంది వారిని ముందుకు కదలకుండా అడ్డగించింది. రైతు నాయకుడు జగజిత్ సింగ్ డల్లేవాల్ చేస్తున్న ఆమరణ నిరాహారదీక్ష గురువారం నాటికి 52రోజులకు చేరుకుంది. ఆయనకు సంఘీభావంగా హర్యానా వైపు ఉన్న ఖనౌరి సమీపంలోని సరిహద్దు వద్ద 111 మంది రైతులతో కూడిన బృందం కూడా ఆమరణ నిరాహారదీక్షకు దిగింది. ఈ తరుణంలో రైతులు మరోసారి ఢిల్లీకి ర్యాలీగా వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఇదిలా ఉండగా, పంజాబ్–హర్యానా మధ్య ఉన్న శంభు సరిహద్దు పాయింట్ వద్ద పంధేర్ (కిసాన్ మజ్దూర్ మోర్చా నాయకుడు) మీడియాతో మాట్లాడుతూ రైతుల డిమాండ్లకు కేంద్ర సర్కార్ ఆమోదం తెలపడం లేదని విమర్శించారు. గత 11 నెలల నుంచి శంభు, ఖనౌరి వద్ద రైతులు నిరసన తెలియజేస్తున్న విషయం తెలిసిందే. 101 రైతులతో కూడిన బృందం ఈనెల 21వ తేదీన శంభు సరిహద్దు నుంచి ఢిల్లీకి పాదయాత్రగా వెళ్లాలని ఎస్‌కెం–రాజకీయేతర, కెఎంఎం రైతు సంఘాలు నిర్ణయం తీసుకున్నాయని పంధేర్ చెప్పారు. రైతులతో చర్చలు జరిపేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదని తమకు అర్థమైందని, ఇప్పటి వరకు ఏ విధంగా స్పందించిందో చూస్తూనే ఉన్నామన్నారు. అందువల్ల ఉద్యమాన్ని ఉధృతం చేయాలని రైతుసంఘాలు నిర్ణయించాయని చెప్పారు. కాగా, ఈనెల 15వ తేదిన 111 మంది రైతులతో కూడిన బృందం డల్లేవాల్ దీక్షకు సంఘీభావంగా ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించారు. తమ డిమాండ్ల నెరవేరే వరకు దీక్ష విరమించబోమని ప్రతినబూనారు. పంజాబ్ వైపున ఉన్న ఖనౌరి వద్ద కూర్చొని నవంబరు 26వ తేదీ నుంచి ఆమరణదీక్ష చేస్తుండగా, కొత్త జాతా హర్యానా వైపు ఉన్న సరిహద్దు వద్ద దీక్షకు కూర్చున్నారు. హర్యానా పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇప్పటికే 163 సెక్షన్ విధించారు. ఐదుగురు కంటే ఎక్కువ మంది గుమిగూడడాన్ని నిషేధించారు. ఆందోళన చేస్తున్న రైతులు డల్లేవాల్ ఆరోగ్యం క్షీణించడంపై ఆందోళన చెందుతున్నారు. ఆయన అవయవాలు పూర్తిగా చెడిపోయాయని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాల సందడి

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 10,05,454 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 2,73,751 మంది అర్హులను గుర్తించారు. వీరికి ప్రాధాన్యతా క్రమంలో మొదటి విడత ఇంటి స్థలం ఉన్న వారికే ఇందిరమ్మ ఇళ్లను మంజూరుచేయనున్నారు. ప్రధానంగా గుడిసెలో ఉన్న వారికి, పాత ఇళ్లపై టార్పాలిన్లు కప్పి ఉన్న గృహాల కుటుంబాలకు, అనాథలు, వితంతువులు, ఒంటరి మహిళలు, ఎలాంటి భూమి లేని వ్యవసాయ కూలీలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్, సఫాయి కర్మచారి, అట్టడుగున ఉన్న గిరిజనులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అలాగే రైతు భరోసాను రాళ్లు, రప్పలు కలిగిన భూములకు, రియల్ ఎస్టేట్ కోసం వెంచర్లు చేసిన భూములకు, ప్రజా అవసరాల కోసం ప్రభుత్వం సేకరించిన భూములకు గాకుండా పంటలను సాగుచేసే భూములు కలిగిన రైతులకే ఎకరానికి 6 వేల రూపాయల చొప్పున రెండు పంటలకు కలిపి 12 వేల రూపాయలు ఇవ్వనున్నారు. ఎలాంటి భూపరిమితి విధించకుండా రైతు భరోసా పథకాన్ని అమలు చేయనున్నారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖాధికారులు కలిసి సాగు భూములను గుర్తించి ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు ఆ శాఖాధికారులు కసరత్తు చేస్తున్నారు. వ్యవసాయ శాఖాధికారులు తీసిన లెక్కల ప్రకారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 లక్షల 60 వేల ఎకరాల భూములు సాగవుతున్నాయి. ఈ భూములు కలిగిన రైతులందరికీ రైతు భరోసా పథకం కింద ఎకరానికి రెండు పంటలకు కలిపి 12వేల రూపాయలు రైతుల ఖాతాల్లో జమచేయనున్నారు. ఏడాదికి 1512 కోట్ల రూపాయలు ఈ పథకం కింద ప్రభుత్వం వెచ్చించాల్సి ఉంటుంది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద కూలీలకు ఏడాదికి 12 వేల రూపాయలు ఇవ్వనున్నారు. జిల్లాలో 2023–24 సంవత్సరంలో ఆధార్ సీడింగ్ అయిన కూలీల సంఖ్య ఆధారంగా ఉన్న కూలీలను గుర్తించారు. ఇందులో ఎలాంటి భూములు లేని వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయనున్నారు. ఈ మేరకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారులు కూలీల వివరాలను కలెక్టర్‌కు అందించారు. అలాగే గడిచిన రెండో విడత బీఆర్ఎస్ పాలనలో ఐదేళ్లలో 2021లో ఒకసారి మాత్రమే రేషన్ కార్డులను జారీ చేశారు. ఈ ప్రభుత్వం కూడా రేషన్ కార్డులు ఇప్పుడు, అప్పుడు అంటూ ఊరిస్తూ వచ్చారు. గత నెలలో నిర్వహించిన కులగణన సర్వే ఆధారంగా అర్హులను గుర్తించి రేషన్ కార్డులను జారీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. గత ఏడాది నిర్వహించిన ప్రజాపాలన సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం రెండున్నర లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిశీలించి ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్న గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి జాబితాలను ప్రదర్శించనున్నారు. 25 వరకు నాలుగు పథకాల ద్వారా లబ్ధి పొందే లబ్ధిదారుల తుది జాబితాను పూర్తి చేసి 26 నుంచి కొత్త పథకాలను అమలు చేయనున్నారు. ఈ క్రమంలో అంతటా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయ తలపెట్టిన సంక్షేమ పథకాలపైనే ప్రధానంగా చర్చ సాగుతున్నది.భారీగా వీటి కోసం లబ్ధి దారులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నారు. ఒక్క ఇందిరమ్మ ఇళ్లే ఉ మ్మడి వరంగల్ జిల్లాలోని నియోజకవర్గానికి 3500 చొప్పున మొత్తం 12 నియోజకవర్గాలకు 42వేల ఇళ్లు రానున్నాయి. అలాగే ఉమ్మడి జిల్లాలో ఇతర నియోజకవర్గాలకు చెందిన కొన్ని మండలాలు కలిసి ఉన్నాయి. ఆ లెక్కన చూస్తే ఉమ్మడి వరంగల్ జిల్లాకు దాదాపుగా 50 వేల ఇందిరమ్మ ఇళ్లు వచ్చే అవకాశం ఉంది.

సైఫ్ అలీఖాన్‌పై కత్తితో దాడి

(మొదటి పేజీ తరువాయి)

ఘర్షణలో ఖాన్ వంటమనిషి కూడా స్వల్పంగా గాయపడింది. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, చొరబాటుదారుడు నటుడి ఫ్లాట్‌లోకి బలవంతంగా ప్రవేశించడం గానీ, చొరబడడంగానీ జరగలేదని, రాత్రి ఏదో ఒక సమయంలో దొంగచాటుగా చొరబడి ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ ఘటన తర్వాత ఖాన్ ఇంటి సిబ్బంది అతన్ని ఆటో రిక్షాలో లీలావతి ఆసుపత్రికి తీసుకెళ్లారు. న్యూరో సర్జన్ డాక్టర్ నితిన్ డాంగే, కాస్మెటిక్ సర్జన్ డాక్టర్ లీనా జైన్, అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ నిషా గాంధీ నేతృత్వంలోని వైద్యుల బృందం అతనికి శస్త్రచికిత్స చేసింది. 'ఖాన్‌కు ఆరు గాయాలు అయ్యాయి, రెండు స్వల్ప, రెండు మాధ్యమిక, మరో లోతైన గాయాలు. వాటిలో ఒకటి వెన్నెముకకు దగ్గరగా ఉన్న వీపుపై ఉంది' అని ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ నీరాజ్ ఉత్తమని పిటిఐకి తెలిపారు. కత్తి కారణంగా సైఫ్ థొరాసిక్ వెన్నెముకకు పెద్ద గాయం అయిందని, కత్తిని తొలగించడానికి, కారుతున్న వెన్నెముక ద్రవాన్ని సరిచేయడానికి శస్త్రచికిత్స చేసినట్లు అని డాక్టర్ డాంగే అన్నారు. ఖాన్ ఇప్పుడు పూర్తిగా స్థిరంగా ఉన్నరని, అతను కోలుకుంటున్నారని, పూర్తిగా ప్రమాదం నుండి బయటపడ్డారన్నారు. ఖాన్ కోలుకుంటున్నారని, ఐసియుకి తరలించామని డాక్టర్ ఉత్తమణని చెప్పారు. బహుశా ఒకటి లేదా రెండు రోజుల్లో అతన్ని (ఐసియు కాని) వార్డుకు మార్చవచ్చు అని ఆయన అన్నారు. అయితే నటుడి ప్రతినిధులు ఘటనను 'దొంగతన ప్రయత్నం'గా అభివర్ణించారు. అగంతుకుడిపై బాంద్రా పోలీస్ స్టేషన్‌లో భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 311